అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

బుధవారం 19-02-2025

సంపుటి : 10 | సంచిక : 361 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



రాజులు వద్దు..

- ప్రెసిడెంట్స్ డే అమెరికాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు

వివరాలు 10లో

అది 2024 జనవరి నెల. అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవానికి హిందూ భక్తులు ఎదురు చూస్తున్న సమయం. బాల రాముడి విగ్రహ ప్రతిష్టాపన జరిగే జనవరి 22వ తేదీనే తాము కూడా బిడ్డకు జన్మనివ్వాలన్న కోరికలో పలువురు గర్భిణులు ఆస్పత్రుల వద్ద క్యూ కట్టారు. బిడ్డ గర్భం నుండి బయటికి రావడానికి ఇంకా సమయం ఉన్నా సరే....ముందుగానే డెలివరీ చేయాలంటూ వైద్యులపై ఒత్తిడి తెచ్చారు. రామ విగ్రహ ప్రతిష్ట జరిగిన రోజే, ఆ 'శుభ' సమయానికే తాము కూడా బిడ్డకు జన్మనివ్వాలన్నది వారి ఆకాంక్ష. ఇలా డెలివరీలకు ముహూర్తాలు నిర్ణయించుకునే ధోరణి ఇటీవలి కాలంలో దేశంలో బాగా పెరిగిపోయింది. దీనికి కొందరు వైద్యులతో పాటు, ఆస్పత్రులూ తల ఊపుతున్నాయి. అయితే ముహూర్త డెలివరీలకు క్రేజ్ బాగా ఎక్కువగా ఉండడానికి కారణమేమిటి?

కాన్పులకూ ముహూర్తాలు

జ్యోతిష్యాన్ని ఆశ్రయిస్తున్న తల్లిదండ్రులు

- బిడ్డ భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్న గుడ్డి నమ్మకం
- సమస్యలు తప్పవంటూ వైద్య నిపుణుల హెచ్చరిక
- 'సమయం' కంటే ఆరోగ్యం, సంరక్షణే కీలకమని సూచన





వివరాలు 3లో...



బీజేపీ ఆదాయం రూ.4,340 కోట్లు

విరాళాల్లో మొదటిస్థానం : ఏడీఆర్

న్యూఢిల్లీ : 2023-24 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని జాతీయ పార్టీలకు వచ్చిన విరాళాల్లో మొదటిస్థానంలో బీజేపీ నిలిచింది. ఆ పార్టీ ఆదాయం రూ.4,340.47 కోట్లు. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) తాజాగా విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక ప్రకారం ఆరు జాతీయ పార్టీలకు వచ్చిన మొత్తం రూ.5,820.91 కోట్ల విరాళాల్లో ఒక్క బీజేపీకే 75 శాతం విరాళాలు రావడం గమనార్హం. 2022-23తో పోల్చితే కమలం పార్టీ ...11లో

సైబర్‌సేఫ్ స్టేట్‌గా తెలంగాణ

ఆ దిశగా మరింత సాంకేతికత సాధించాలి

- 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రచారం చేయాలి
- ట్రెజరీ పదానికి అర్థమే మారిపోయింది : సైబర్ సెక్యూరిటీ కంక్లేవ్ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్రాన్ని సైబర్ సేఫ్ స్టేట్‌గా మార్చేందుకు ప్రభుత్వం తరపున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా ప్రపంచంలోనే అత్యాధునిక సాంకేతికతను అనుసంధానం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం నాడిక్కడి హెచ్‌ఐసీసీలో సైబర్ సెక్యూరిటీ కంక్లేవ్-2025 (షీల్డ్-2025)ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. సాంకేతిక మార్పులతో ట్రెజరీ అనే పదానికి అర్థమే మారిపోయిందని చెప్పారు. ఒకప్పుడు భౌతికంగా నేరాలు జరిగేవనీ, కానీ ఇప్పుడు ఓ కంప్యూటర్ లేదా మొబైల్ ఫోన్ ఉంటే సాంకేతికతతో ప్రపంచంలో ఎక్కడ నుంచి ఎక్కడికైనా ఆర్థిక నేరాలకు పాల్పడే వీలు ఏర్పడిందన్నారు. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజలకు తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తున్నదని తెలిపారు. గత ఏడాది దేశంలో సైబర్ నేరగాళ్లురూ. 22,812 కోట్లు దోచుకున్నారనీ, ఇది సామాన్యమైన విషయం కాదన్నారు. తెలంగాణ సైబర్ పోలీసులు మాత్రం సమర్థవంతంగా పనిచేస్తున్నారని కితాబిచ్చారు. సహజంగానే ప్రపంచంలో నేరాల రూపు మారుతున్నదనీ, దానికి తగినట్టు ప్రభుత్వాలు తమ విధానాలను మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దీనికోసం దేశమే ఒక యూనిట్‌గా పనిచేయాలని సూచించారు. భౌతిక నేరాలకు పరిమిత పరిధిలో జరుగుతాయనీ, సైబర్ క్రైమ్‌కు ఆకాశమే హద్దు అని చెప్పారు. సైబర్ క్రైం కేవలం ఆర్థికపరమైనదే కాదనీ, డీప్ ఫేక్ టెక్నాలజీతో లేనిది ఉన్నట్టు, జరగనిది జరిగినట్టు అపోహలు సృష్టించి, సమాజంలో అలజడులు ...10లో



రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంఘం (టీజీడీపీఎస్)

సలహా కమిటీ ఏర్పాటు


సభ్యులుగా 9 మంది, చైర్మెన్‌గా డిప్యూటీ సీఎం

వివరాలు 10లో

ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలా ?

మరో రూపంలో తెచ్చే ప్రయత్నమే

- నిపుణుల అభ్యంతరం




న్యూఢిల్లీ : నూతన ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలను చేర్చడంపై నిపుణులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ గత సంవత్సరం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వారు గుర్తు చేశారు. దానిని మరో రూపంలో తీసుకు రావాలన్నది ప్రభుత్వ ఉద్దేశమై ఉండవచ్చునని వ్యాఖ్యానించారు. నూతన ఆదాయపన్ను బిల్లులోని 8వ షెడ్యూలులో ఎన్నికల బాండ్ల ప్రస్తావన ఉంది. 'రాజకీయ పార్టీలు, ఎలక్టోరల్ ట్రస్టుల మొత్తం ఆదాయంలో ...11లో

గంగ నీటిలో మల బ్యాక్టీరియా !

ఎన్‌జీటీ ఆందోళన

- చర్యలపై నివేదిక ఇవ్వాలని యూపీ అధికారులకు ఆదేశాలు



న్యూఢిల్లీ : మహా కుంభమేళా సందర్భంగా త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు భక్తులు లక్షలాదిగా పోటెత్తుతున్నారు. గంగలో మునిగితే సర్వ పాపాలు తొలగిపోతాయని, పుణ్య ఫలాలు లభిస్తాయని వారి విశ్వాసం. పుణ్యం మాట దేవుడెరుగు కానీ ప్రయాగరాజ్‌లోని గంగానదిలో మల సంబంధమైన బ్యాక్టీరియా అధిక స్థాయిలో పెరుగుతోందని కాలుష్య నియంత్రణ సంస్థ అయిన జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆందోళన వ్యక్తం చేస్తోంది. దీనిపై తీసుకుంటున్న చర్యలేమిటో వివరించాలని ఉత్తరప్రదేశ్ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను ఆదేశించింది. బుధవారంలోగా సవివరమైన నివేదిక అందజేయాలని డిమాండ్ చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సీపీసీబీ) అందజేసిన నివేదిక ఆధారంగా ఎన్‌జీటీ ఈ చర్యలు చేపట్టింది. ఈ నెల 3న సీపీసీబీ అందించిన నివేదిక ప్రకారం "మహా కుంభమేళా సమయంలో మానవ మలంలో బ్యాక్టీరియా గణనీయంగా పెరుగుతోంది. నదీ జలాలు స్నానం చేయడానికి అనువుగా లేవు. జనవరి 12-13 తేదీల్లో నదీ జలాలను ...11లో

ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

రాష్ట్ర వ్యాప్తంగా వామపక్షాల నిరసన

కేంద్ర బడ్జెట్ ప్రతుల దహనం



నవతెలంగాణ -నారాయణపేట /విలేకరులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 బడ్జెట్‌ను నిరసిస్తూ వామ పక్షాల నేతలు రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల మంగళవారం బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక బడ్జెట్ అని, కార్పొరేట్ శక్తులకు మేలు కలిగించే బడ్జెట్ అని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఆర్.వెంకట్రాములు విమర్శించారు. నారాయణ పేట జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కేంద్ర నమూనా బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ప్రధాని మోడీ రైతు బడ్జెట్ అంటూనే రైతు రుణమాఫీకి తగిన బడ్జెట్ కేటాయించ లేదన్నారు. విద్యుత్ సంస్కరణలతో వ్యవసాయ రంగం, పారిశ్రామిక రంగం కుదేలవుతాయన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించారని, కార్మికులను బానిసత్వంలోకి నెట్టే నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్న డిమాండ్‌ను పట్టించుకో లేదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.వెంకట్రామి రెడ్డి, గోపాల్, మహేష్ కుమార్, కాశప్ప, శ్రీనివాస్, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయ కులు నర్సింహా, ప్రశాంత్, నరాయణ పాల్గొన్నారు. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండల కేంద్రంలో గల నేతాజీ చౌరస్తాలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన చేశారు. కేంద్ర బడ్జెట్ కేటాయింపుల్లో పేదలు, కార్మిక, కర్షకులకు తీవ్ర అన్యాయం జరిగిందని, రాష్ట్రంపై వివక్ష చూపారని వామపక్ష పార్టీల నాయకులు కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిరసన తెలిపారు. కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ శక్తులకు, అదానీ, అంబానీ లకు అనుకూలంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లాకు నిధులు తేలేకపోయిన స్థానిక ఎంపీ, కేంద్ర సహాయ మంత్రి నిధులు తెస్తారా లేక తక్షణమే రాజీనామా చేస్తారా ...11లో



వర్సిటీల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించాలి

- సమస్యలు పరిష్కరించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

వివరాలు 10లో

భూ వివాదాలకు

శాశ్వత పరిష్కారం

ఆ మేరకు భూభారతి విధివిధానాలు



కలెక్టర్లతో వర్క్ షాప్‌లో మంత్రి పొంగులేటి

వివరాలు 11లో



హైకోర్టు హాల్లోనే కుప్పకూలిన లాయర్

కేసు వాదిస్తూ గుండెపోటుతో మృతి

వివరాలు 11లో



జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా టీకేకే రెడ్డి

బాధ్యతల స్వీకరణ

వివరాలు 11లో

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్

కాలపరిమితి పొడిగింపు

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎస్సీ వర్గీకరణపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ కాలపరిమితిని ప్రభుత్వం మార్చి 10వరకు పొడిగించింది. రాష్ట్రంలో ఎస్సీల వర్గీకరణపై అధ్యయనం చేసి, సిఫారసులు చేసేందుకు వీలుగా ఏర్పాటు ...11లో

ఉపాధ్యాయుల గొంతునయ్యా..

నిత్యం అధ్యాపకుల మధ్యే ఉన్నా

ముఖాముఖి

- చట్టసభల్లో వారి వాణి వినిపించా
- నిజాయితీ, నిబద్ధతతో పనిచేశా
- ప్రతి సమస్యనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేశా
- సీడీపీ నిధులు ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికే ఖర్చు చేశా : నవతెలంగాణతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

'ఉపాధ్యాయుల పక్షాన నిబద్ధతతో నిలబడ్డాను. వారి నమ్మకాన్ని వమ్ము చేయలేదు. చట్టసభల్లో ఉపాధ్యాయుల గొంతునయ్యాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సంబంధించి ప్రతి సమస్యనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేశాను. నియోజకవర్గ అభివృద్ధి నిధులను (సీడీపీ) ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసమే ఖర్చు చేశాను. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలి, ఈ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను చెల్లించాలి, నాలుగు డీఏలను మంజూరు చేయాలనే డిమాండ్‌లను బలంగా వినిపిస్తున్నాను. మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించాలని, కేజీబీవీ, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్‌ను ఇవ్వాలని, మోడల్ స్కూల్ టీచర్లకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలని, 317 జీవో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని పోరాడుతున్నాను. అందుకే నాకు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి రెండోసారి ఎమ్మెల్సీగా గెలిపించాలి.'అని ప్రస్తుత ఎమ్మెల్సీ, వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం టీఎస్‌యూటీఎఫ్ బలపరిచిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. శాసనమండలి ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా నవతెలంగాణ ప్రతినిధి బొల్లె జగదీశ్వర్‌కు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...

వివరాలు 3లో..



రాష్ట్రంపై ఫికర్ లేదు

ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో సీఎం రేవంత్ డ్రామాలు



- పది శాతం కూడా రైతు భరోసా రాలే..
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలి : ఆమనగల్ రైతు నిరసన దీక్షలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

వివరాలు 11లో

విద్యారంగానికి బడ్జెట్‌ను పెంచాలి

- ప్రభుత్వ విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యనందించాలి : ఉప ముఖ్యమంత్రి భట్టికి విద్యాకమిషన్ ప్రతిపాదన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2025-26 బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను పెంచాలని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను మంగళవారం హైదరాబాద్‌లో విద్యాకమిషన్ చైర్మెన్ ఆకునూరి మురళి నేతృత్వంలో కలిసి ప్రతిపాదనలను సమర్పించారు. రాష్ట్రంలో వివిధ వర్గాలతో వరుస చర్చలు జరిపి వారి నుంచి అనేక సలహాలు, సూచనలను తీసుకున్నామని తెలిపారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని మొత్తం అస్తవ్యస్తం చేసిందని పేర్కొన్నారు. దాని ఫలితంగా అభ్యాస పేదరికం ఏర్పడిందని వివరించారు. ప్రస్తుత విద్యారంగం దుస్థితి వల్ల ప్రజా, పౌర సమాజ సంస్థల నుంచి ఒత్తిడి, అశాంతి పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ విద్యారంగంపై తగిన జ్యోం చేసుకోవాలని కోరారు. విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడంలో రాష్ట్ర బడ్జెట్ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును రూపొందించగల అభివృద్ధి, ప్రాధాన్యతలకు దిశానిర్దేశం చేయడం కోసం ఈ బడ్జెట్ ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీలతోపాటు విశ్వవిద్యాలయాలను ఉత్తమ ప్రమాణాలతో తీర్చిదిద్దాలని సూచించారు.

రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి కావాల్సిన బడ్జెట్‌ను తయారుచేసి సమర్పించామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ ఫౌండేషనల్ స్కూళ్లు, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా అప్‌గ్రేడ్ చేసి అంతర్జాతీయ ప్రమాణాలు, ఉత్తమ అభ్యాస వాతావరణం, ఉత్తమ బోధనా వాతావరణంతో కూడిన ఉత్తమ పాఠశాల ప్రమాణాలు కలిగి ఉండేలా బడ్జెట్ తయారు చేసి ప్రభుత్వానికి సమర్పించామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్న శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ హెచ్‌యూసీ నూతన కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా లెనిన్, పంకజ్
- విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు తీర్మానం

నవతెలంగాణ-మియాపూర్

ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ నూతన కమిటీ 41 మందితో ఎన్నికైంది. కమిటీ 18వ మహాసభ క్యాంపస్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. అంతర్జాతీయ, జాతీయ సమస్యలు, విద్యార్థుల సమస్యలపై చర్చించి, వివిధ తీర్మానాలు చేశారు. విద్యావ్యవస్థ ప్రయివేటీకరణ, కేంద్ర విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా తీర్మానాలు చేశారు. అనంతరం ఈ మహాసభ 41 మందితో కమిటీ.. 15 మందితో కారదర్శివర్గాన్ని ఎన్నుకుంది.

నూతన కమిటీ అధ్యక్షులుగా లెనిన్, కార్యదర్శిగా పంకజ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా అతీక్, దేబస్రీత, మోహిత్ ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శులుగా సుభాషిణి, ఆకాశ్, కృప ఎన్నికయ్యారు. విద్యార్థుల సమస్యలపై, విద్యార్థి వ్యతిరేక పాలసీలపై నిరంతరం పోరాటాలు చేస్తామని నూతన అధ్యక్ష కార్యదర్శులు చెప్పారు.

వైద్యారోగ్యశాఖకు అత్యంత ప్రాధాన్యత

- రాజీవ్ ఆరోగ్యశ్రీకి సమృద్ధిగా నిధులు కేటాయిస్తాం : డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పేద, మధ్యతరగతి వర్గాలు అత్యధికంగా ఆధారపడే వైద్యారోగ్యశాఖకు నిధుల కేటాయింపులో అత్యంత ప్రాధాన్యత ఇస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో జరిగిన వైద్యారోగ్యశాఖ, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులకు పలు సూచనలు చేశారు. గత దశాబ్ద కాలంగా డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ, మెడికల్ ఎడ్యుకేషన్ విభాగాలు నిర్లక్ష్యానికి గురయ్యాయని మంత్రులు అభిప్రాయపడ్డారు. ప్రజా ప్రభుత్వంలో ఈ మూడు విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చి రాబోయే రోజుల్లో బలోపేతం చేస్తామని తెలిపారు. డ్రగ్స్, ఫుడ్ సేఫ్టీ విభాగాలను ఆధునీకరిస్తామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీకి రానున్న బడ్జెట్లో సమృద్ధిగా నిధులు కేటాయించి, పేద, మధ్యతరగతి వర్గాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురానున్నట్టు తెలిపారు.

రానున్న ఏడాది కాలంలో రాష్ట్రంలో వైద్య కళాశాల భవనాలు, ఆస్పత్రుల నిర్మాణం పనులు పూర్తవుతాయని మంత్రులు తెలిపారు. కేంద్ర ప్రాయోజిత పథకాలను పెద్ద సంఖ్యలో వినియోగించుకునేందుకు అధికారులు కృషి చేయాలని మంత్రులు ఆదేశించారు. జిల్లా కేంద్రాల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ ప్లానిటోరియంలు నిర్మించే ఆలోచనలో ఉన్నట్టు వారు తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా, సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ అహ్మద్ నదీమ్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక శాఖ జాయింట్ సెక్రెటరీ హరిత తదితరులు పాల్గొన్నారు.

డంప్ యార్డ్.. జీవన్మరణ సమస్య

పంటలు, పర్యావరణం పాడయ్యే ప్రమాదం

ప్రజాభిప్రాయానికి భిన్నంగా జీహెచ్ఎంసీ నిర్ణయం

- పోలీస్ నిర్బంధాలు పోరాటాల్ని ఆపలేవు
- గుమ్మడిదల పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తం చేస్తాం
- డంపు యార్డ్ రద్దు కోసం 20న కలెక్టరేట్ ముట్టడి
- ఇతర రాజకీయ పార్టీలూ కలిసి రావాలని పిలుపు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు
- ప్రజల దీక్షలకు మద్దతు



చెత్తతో నివాసాల విధ్వంసం

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయాలని గుమ్మడిదల ప్రాంతంలోని 40 వేల మంది ప్రజలు చేస్తున్న పోరాటం జీవన్మరణ సమస్య అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు అన్నారు. చెత్త వల్ల జన నివాసాలు విధ్వంసం అవుతాయని, ఇప్పటికే జవహర్‌నగర్ ప్రాంతం కాలుష్యమయంగా మారిందని వివరించారు. డంప్ యార్డ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 14 రోజులుగా జేఏసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పోరాటానికి సీపీఐ(ఎం) మద్దతు పలుకుతూ మంగళవారం ఆ పార్టీ నాయకులు గుమ్మడిదల, నల్లవల్లిలో దీక్షా శిబిరాల్ని సందర్శించి.. మద్దతు తెలిపి దీక్షల్లో కూర్చుకున్నారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. చెత్త డంపింగ్ యార్డ్ వల్ల ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లోని నివాస గ్రామాలన్నీ ఖాళీ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే జవహర్‌నగర్‌లో 400 ఎకరాల్లో పోస్తున్న చెత్త వల్ల ఆ ప్రాంతమంతా పర్యావరణం దెబ్బతిన్నదని, వాయు, జల కాలుష్యం వల్ల ప్రజలెవ్వరూ అక్కడ ఉండే పరిస్థితి లేదని అన్నారు.

ప్యారానగర్‌లో ప్రజాభిప్రాయానికి భిన్నంగా జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం డంపింగ్ యార్డ్ పెట్టాలని నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఇక్కడ జనవాసాలు, పంటలు, పర్యావరణం దెబ్బతినడమే కాకుండా పక్కనే ఉన్న ఎయిర్‌లైన్స్ శిక్షణా కేంద్రానికీ ముప్పు వాటిళ్లుతుందన్నారు. ఎయిర్‌ఫోర్స్ అకాడమీ అధికారులు సైతం డంపింగ్ యార్డ్ పెట్టొద్దని కలెక్టర్‌కు లేఖ రాసినా అధికారులు పట్టించుకోకపోవడం బాధ్యతారా హిత్యమన్నారు. ఊర్లను ఖాళీ చేసే.. పంట పొలాల్ని పడావు పెట్టే చెత్త కుంపటిని ప్యారానగర్‌లో కాకుండా జనజీవనం, పంట పొలాల్లేని, గుట్టలు కొండల్లో పెట్టుకోవాలని సూచించారు.

అధికారులు చెబుతున్న టెక్నాలజీ ఏమిటో దాని వల్ల చేకూరే మేలు ఏమిటో ప్రజలకు అవగాహన కల్పించి ఇప్పటికే ఏర్పాటు చేసిన జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను సరి చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ వ్యతిరేక పోరాటం న్యాయబద్ధమైనదని, ప్రజలు ప్రజాస్వామ్యయుతంగా ప్రశాంతంగా ఆందోళనలు చేస్తున్నారని చెప్పారు. సీపీఐ(ఎం) ప్రజల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెల్పడమే కాకుండా ప్రత్యక్ష కార్యాచరణలో ఉంటుందన్నారు. ఈ నెల 20న సంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రభుత్వం డంపింగ్ యార్డ్‌ను రద్దు చేయకపోతే ప్రజల్ని సమీకరించి గుమ్మడిదల పోరాటాన్ని రాష్ట్ర వ్యాప్తం చేస్తామని హెచ్చరించారు. ఎంపీ, ఎమ్మెల్యే, జెడ్పీటీసీ ఇతర ప్రజా ప్రనతినిధులు, పార్టీలు, నాయకులు ఈ పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఊర్ల నిండా పోలీస్ బలగాల్ని మోహరించి ప్రజలు కదలకుండా నిర్బంధం ప్రయోగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అరెస్టులు, కేసులు, నిర్బంధాల వల్ల ప్రజా పోరాటాలు ఆగవని స్పష్టం చేశారు. ప్రజల న్యాయమైన పోరాటానికి ఈ ప్రాంతంలోని కార్మికవర్గం కూడా మద్దతుగా నిలుస్తుందన్నారు.

సీపీఐ(ఎం), సీఐటీయూ ప్రజాందోళనలో పాల్గొంటాయన్నారు. సీపీఐ(ఎం) సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.రాజయ్య, అతిమేల మాణిక్ మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయం సేకరించకుండా ఏకపక్షంగా ప్యారానగర్‌లో డంపింగ్ యార్డ్ పెట్టడం అప్రజాస్వామికమన్నారు. నివాస గ్రామాలకు రోడ్డు వేసుకునేందుకు అనుమతులివ్వని అటవీ శాఖ అధికారులు డంపింగ్ యార్డ్ కోసం మాత్రం రాత్రికి రాత్రే చెట్లు నరికి రోడ్డు వేసేందుకు అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. డంపింగ్ యార్డ్ వల్ల ఎలాంటి పర్యావరణం దెబ్బతినదంటూ పీసీబీ అధికారులు అనుమతులివ్వడం బాధ్యతా రాహిత్యమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు నాగేశ్వర్, రాయిని లలిత, ప్రజా సంఘాలు, సీఐటీయూ నాయకులు పాండు రంగారెడ్డి, నాయిని నర్సింహ్మారెడ్డి, సునీత, వీరస్వామి, శ్రీధర్‌రెడ్డి, బాస్కర్‌రెడ్డి, శేఖర్, లక్ష్మణ్, తలారి శ్రీను, వెంకటేశ్, సదాశివరెడ్డి పాల్గొన్నారు.

హత్యకేసులో 17 మందికి జీవితఖైదు

నల్లగొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు తీర్పు

- చట్టాన్ని చేతిలోకి తీసుకుంటే శిక్షలు తప్పవు : రాచకొండ సీపీ సుధీర్‌బాబు



నవతెలంగాణ-అడ్డగూడూరు

భువనగిరి జిల్లా అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో జరిగిన హత్య కేసులో 17మందికి నల్లగొండ ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను రాచకొండ సీపీ సుధీర్‌బాబు వెల్లడించారు. అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని అజీంపేట గ్రామంలో 2017లో యాదవ సామాజిక తరగతికి చెందిన ఓ వ్యక్తి మృతి కేసులో బట్ట లింగయ్య జైలుకెళ్లాడు. అనంతరం బెయిల్‌పై బయటకొచ్చాడు. దసరా పండుగ సందర్భంగా జరిగిన ఉత్సవాల్లో బట్ట లింగయ్య కుటుంబంతో కలిసి పాల్గొనేందుకు వెళ్లాడు. ఆ సమయంలో గతంలో తన వల్ల చనిపోయిన వ్యక్తి కుటుంబీకులు ఎదురయ్యారు. ఈ క్రమంలో మాటామాటా పెరగడంతో లింగయ్యపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన లింగయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు.. యూఎస్147, 302, 323 504 ఆర్/డబ్ల్యూ149 ,109 ఐపీసీ సెక్షన్ 3(1)(1)(ఆర్),(ఎస్) 3(2)(వీఏ) ఎస్సీ ఎస్టీ చట్టం, అడ్డగూడూరు పోలీస్‌స్టేషన్ ఎస్సీ నెం45/2018 కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో కేసు విచారణ ప్రారంభమైంది. ప్రస్తుతం ఖమ్మం జిల్లా ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న ఎస్.రమేష్ అప్పుడు ఇక్కడ ఏసీపీ హోదాలో ఈ కేసు విచారణను వేగవంతంగా పూర్తి చేసి సాక్షాధారాలను కోర్టు ముందుంచారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అఖిల వాదనలు వినిపించారు. సాక్షాధారాల పరిశీలన అనంతరం నల్లగొండలోని ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్స్ కోర్టు 17 మంది నిందితులకు జీవిత ఖైదుతోపాటు రూ.6000 చొప్పున జరిమానా విధించింది.

శిక్ష పడినవారు వీరే..

ఏ-1 పండుగ రామస్వామి, ఏ-2 పండుగ సాయిలు, ఏ-3 పండుగ రాములు, ఏ-4 పండుగ మల్లేశ్, ఏ-5 బండగొర్ల వలరాజు, ఏ-6 పండుగ యాదయ్య, ఏ-7 జక్కుల రమేశ్, ఏ-8జక్కుల భిక్షమయ్య(విచారణలో ఉండగా మృతిచెందాడు. ఏ-9 (విద్యార్థి), ఏ-10, ఏ-11 పండుగ నర్సాయిస్, ఏ-12 పండుగ సత్యనారాయణ, ఏ-13 బండగొర్ల నాగమ్మ, ఏ-14 పండుగ శ్రీను, ఏ-15 పండుగ మల్లయ్య, ఏ-16 పండుగ లింగయ్య, ఏ-17 జక్కుల లచ్చయ్య, ఏ-18 పిలబోయిన లింగయ్య(అజీంపేట గ్రామ మాజీ సర్పంచ్).

తాత్కాలిక ఆవేశాలతో చట్టాన్ని చేతిలోకి తీసుకోవద్దు

రాచకొండ సీపీ సుధీర్‌బాబు

తాత్కాలిక ఆవేశంలో విచక్షణ కోల్పోయి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే తగిన శిక్ష అనుభవించాల్సి వస్తుంది. భవిష్యత్‌ను కోల్పోయి జైలు జీవితం గడపాల్సి వస్తుంది. ఎటువంటి పరిస్థితుల్లోనూ వ్యక్తులు తాత్కాలిక ఆవేశాలకు లోనుకాకూడదు. ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో రాచకొండ పోలీసులు అహర్నిశలూ కృషి చేస్తున్నారు.

పంటల రక్షణకు 'సోలార్ ఫెన్సింగ్ '

మంత్రి తుమ్మల వెల్లడి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

అడవి జంతువులు, కోతుల నుంచి పంటల రక్షణ కోసం సోలార్ ఫెన్సింగ్ పథకాన్ని ప్రవేశపెట్టే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. పామాయిల్‌తోపాటు ఇతర పంటలకు డ్రిప్, తుంపర సేద్య పరికరాలను అవసరం మేరకు రైతులకు అందించాలని ఆదేశించారు. కూరగాయల సాగు విస్తీర్ణాన్ని పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. జూన్ మొదటి వారంలోపు రాష్ట్రంలో మరో పామాయిల్ కర్మాగారం, మరో రెండు ఫ్యాక్టరీల నిర్మాణ పనులు ఆరంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రగతి చూపని పామాయిల్ కంపెనీలపై చర్యలు ప్రారంభిస్తామన్నారు. విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులను రద్దు చేసినట్టు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో ఉద్యానశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. సోలార్ పెన్సింగ్ పథకాన్ని అమలు చేస్తున్న హిమాచల్‌ప్రదేశ్ లాంటి రాష్ట్రాల్లో పర్యటించి, రాష్ట్ర ప్రభుత్వం తరపున సబ్సిడీపై ఇచ్చేందుకు విధి, విధానాలు వెంటనే సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరానికి 100 కిలోమీటర్ల పరిధిలోపు ఉన్న అన్ని ప్రాంతాలలో కూరగాయాల సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందుకోసం పెరి అర్బన్ క్లస్టర్లను ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే రెండు, మూడేండ్లలో కూరగాయల పంటలను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేసి, కూరగాయలను దిగుమతి చేసుకొనే స్థితి నుంచి ఎగుమతి చేసే స్థితికి తీసుకురావాలని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ల పంపిణీ కోసం ధరఖాస్తులను స్వీకరించి గ్రౌండింగ్ మొదలు పెట్టాల్సిందిగా ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో సాగు చేస్తూ లాభాలు పొందుతున్న మొకడమియా పంటను రాష్ట్రంలో ప్రవేశ పెట్టేందుకు వాతావరణ స్థితిగతులు, నేలలు, నర్సరీలు, మార్కెటింగ్ అవకాశాలను అధ్యయనం చేయాలని ఆదేశించారు.



ఆయా కంపెనీలకు నోటీసులిస్తాం

ఆయిల్ పామ్ సాగు లక్ష్యానికి చేరువ కానీ కంపెనీలకు నోటిసులు జారీ చేస్తామని మంత్రి తుమ్మల చెప్పారు. సాగు పురోగతి తక్కువగా ఉన్న కంపెనీలను గుర్తించి రద్దు చేయాలని కోరారు. ఆయిల్ పామ్ చట్టంలో ఉన్న నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోలన్నారు. ఇప్పటికే విశ్వతేజ ఆయిల్‌పామ్ కంపెనీకి ఇచ్చిన అనుమతులు రద్దు చేసి హిందుస్థాన్ యూనిలివర్ లిమిటెడ్ కంపెనీకి ఆ ప్రాంతాన్ని అప్పగించామని చెప్పారు. మూడు, నాలుగు సంవత్సరాలు అయినప్పటికి ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి భూమి గుర్తించక పోవడం, ప్లాంటేషన్ లక్ష్యాన్ని చేరుకోని కంపెనీలను తొలగించి, వాటి స్థానంలో ఆయిల్‌ఫెడ్ కు బాధ్యతలు అప్పగిస్తామన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయిల్ పామ్ సాగు కోసం రెండు లక్షల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల్లో కనీసం ఒక పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం జరిగేలా చూడాలని సూచించారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా నర్మెట్ట గ్రామంలో నిర్మాణం జరుగుతున్న ఆయిల్ పామ్ కర్మాగారాన్ని మే నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. గద్వాల జిల్లా బీచుపల్లిలో, ఖమ్మం జిల్లా కల్లూరిగూడంలో ఆయిల్‌పామ్ కర్మాగారాల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి, పనులు ప్రారంభించాలన్నారు. ఆరువేల ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేసిన ప్రయివేటు కంపెనీలు కూడా వెంటనే పామ్ ఆయిల్ కర్మాగారాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావు, ఉద్యాన శాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషా, ఆయిల్ ఫెడ్ అధికారులు, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతుల గోడు పట్టదా.. ?

- నీళ్లు లేక పంటలు ఎండుతున్నాయి
- తక్షణమే మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగంలోకి తేవాలి
- గందరగోళం.. కాకిలెక్కలతో కాలం వెల్లదీస్తున్న సీఎం : బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నవతెలంగాణ-సూర్యాపేట

ప్రభుత్వం సాగునీళ్లు ఇవ్వక రాష్ట్రంలో పంటలు ఎండుతున్నాయని, అయినా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రైతుల గోడు పట్టడం లేదా ? అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట మున్సిపాలిటీలో విలీనమైన దూరజ్‌పల్లి లింగమంతుల స్వామి పెద్దగట్టు జాతరలో ఆమె మంగళవారం చౌడమ్మ తల్లికి బోనం సమర్పించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. పంటలు ఎండి రైతులు ఆందోళన చెందుతుంటే, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇంకా మాటలు చెబుతూ మభ్యపెడుతోందని విమర్శించారు. రాజకీయ కక్షతో మేడిగడ్డను వాడుకోక తెలంగాణను ఎండబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 199 టీఎంసీలతో బనకచర్లలో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టిందని, కానీ మన ముఖ్యమంత్రి మాత్రం కనీసం నాగార్జున సాగర్‌ను కూడా మన ఆధీనంలోకి తీసుకురాలేకపోయారని విమర్శించారు. కాళేశ్వరం ద్వారా సూర్యాపేట జిల్లాలో కేసీఆర్ గోదావరి జలాలను పారించారని, కృష్ణా పరివాహక ప్రాంతంలోనూ గోదావరి నుంచి నీళ్లు ఇచ్చిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. కేసీఆర్ హయాంలో కోదాడ నియోజకవర్గానికి కాళేశ్వరం ద్వారా లక్షా 22 వేల ఎకరాలకు నీళ్లు అందించారని వివరించారు. ఇప్పుడు నీళ్లు ఎందుకు తేవడం లేదని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని ప్రశ్నించారు. మరో 40 రోజులపాటు నీళ్లు ఇస్తేనే పంటలు చేతికొచ్చే అవకాశం ఉంటుందని, అయినా ప్రభుత్వం నీళ్లు ఇవ్వకుండా ఎండగడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. జిల్లా మంత్రియే కాకుండా సాగునీటి శాఖ మంత్రిగా ఉండి ఈ ప్రాంతానికి నీళ్లు ఇవ్వని మంత్రి ఉన్నా ఒకటే లేకున్నా ఒకటేనన్నారు. రోజంతా కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే కాంగ్రెస్ నాయకులకు ఒరిగేదేమీ లేదని, ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు. 14 నెలల్లో 30 సార్లు రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లారని ఎవరు ఏమనుకున్నా ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ పెద్దల కాళ్లు పట్టుకుంటా అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. మహిళలకు ఒక్క కార్యక్రమాన్ని కూడా చేయని కాంగ్రెస్ ప్రభుత్వం. అలాగే, మహిళలకు ప్రభుత్వం ఏమి చేసిందో ప్రభుత్వ పెద్దలు చర్చకు రావాలని సవాల్ చేశారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతి భద్రతలు సన్నగిల్లాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ కోసం కేసీఆర్ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎస్సీ, బీసీల జనాభాను తక్కువ చేసి చూపిస్తోందని విమర్శించారు. గందరగోళం.. కాకిలెక్కలతో సీఎం రేవంత్ రెడ్డి కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. రైతులను కూడా మోసం చేస్తూ రేవంత్ రెడ్డి పైశాచికానందం పొందుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో రాజ్యసభ మాజీ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్య యదవ్, నోముల భగత్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మెన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ పుట్ట కిషోర్, బూర బాల సైదులు, రఫీ పాల్గొన్నారు.

విమాన కంపెనీల నిలువు దోపిడీ

- రూ.30వేల వరకు పెంచిన చార్జీలు
- కుంభమేళా భక్తుల జేబుకు చిల్లు
- డీజీసీఏ చర్యలు అంతంత మాత్రమే



న్యూఢిల్లీ : కుంభమేళా డిమాండ్‌ను ఆసరగా చేసుకోని విమానయాన కంపెనీలు భక్తుల జేబుకు చిల్లులు పెడుతోన్నాయి. సాధారణ రోజుల్లో రూ. 5000 నుంచి రూ.10,000 లోపు ఉండే చార్జీలను ఏకంగా రూ.30వేలకు చేర్చాయి. అడ్డగోలుగా ఛార్జీలు పెంచి.. భక్తులను నిలువు దోపిడి చేయడంపై కేంద్రానికి ఫిర్యాదులు అందుతున్నాయి. కుంభమేళా ఈ నెల 26న శివరాత్రితో ముగియనుంది. ఈ క్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు ప్రయాగ్‌రాజ్ వస్తోన్నారు. విమాన మార్గంలోనూ పెద్ద సంఖ్యలోనే తరలివస్తున్నారు. ఇందుకోసం విమానయాన కంపెనీలు ప్రత్యేక విమానాలు నడుపుతున్నాయి. గత రెండు రోజులుగా ప్రయాగ్‌రాజ్ విమానాశ్రయం నుంచి నడిచే విమానాల సంఖ్య 100 మార్క్‌ను దాటింది. స్పైస్‌జెట్, ఎయిర్ ఇండియా, ఇండిగో తదితర విమానయాన సంస్థలు ఈ నెల చివరి వరకు విమానాలను నడిపేందుకు షెడ్యూల్ చేశాయి. ఢిల్లీ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు తాజాగా రూ.13వేలకు తక్కువ కాకుండా ధర ఉండగా..

కొన్ని తేదీల్లో రూ.20వేలకుపైగా వసూలు చేస్తోన్నాయి. హైదరాబాద్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఏకంగా రూ.28వేల నుంచి రూ.32వేలు, ప్రయాగ్‌రాజ్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణంలో రూ.33వేల వరకు విమాన చార్జీలు వసూలు చేస్తోన్నాయి.

మంగళవారం ప్రయాగ్‌రాజ్ నుంచి బెంగళూరు ప్రయాణానికి ఓ ప్రయివేటు విమాన కంపెనీ ఒక్కొక్కరికి రూ.39,146 వసూలు చేసింది. సాధారణంగా రూ.10వేల లోపు ఉన్న విమాన చార్జీలను.. కుంభమేళా సమయంలో బెంగళూరుకు రూ.22వేల వరకు వసూలు చేశాయి. తాజాగా మరింత దండుకోవడం గమనార్హం. ముంబయికి వెళ్లే విమానాల్లో రూ.20వేలకుపైగా వసూలు చేస్తున్నాయి. సోమవారం కనీసం రూ.21,974 వసూలు చేశాయి. అదే విధంగా కోల్‌కతా, భువనేశ్వర్ తదితర ప్రాంతాలకు నడిచే విమానాల్లోనూ టికెట్ల ధరలు ఇదే తరహాలో వసూలు చేస్తున్నాయి."అధిక డిమాండ్ వల్ల ప్రయాగ్‌రాజ్ విమాన చార్జీలు పెరిగాయి. సాధారణంగా విమానయాన సంస్థలు ట్రావెల్ ఏజెంట్ల ద్వారా ముందస్తు బుకింగ్‌లకు ప్రత్యేక విమాన చార్జీలు లేదా తగ్గింపులను అందిస్తాయి. కానీ ప్రయాణికుల రద్దీ పెరగడంతో ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విమాన కంపెనీలే స్వయంగా విక్రయించుకుంటున్నాయి. సాధారణంగా రూ.8,000 నుంచి రూ.10,000 మధ్య ఉండే చార్జీ ఇప్పుడు ప్రయాణ తేదీని బట్టి రూ.20,000 నుంచి రూ.25,000 వరకు పలుకుతోంది." అని ట్రావెల్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (గుజరాత్) ప్రెసిడెంట్ రోనక్ షా పేర్కొన్నారు. అధిక చార్జీలపై ఫిర్యాదులు పెరగడంతో రెండు వారాల క్రితం విమానయాన మంత్రిత్వ శాఖ స్పందించింది. చార్జీలను తగ్గించాలని ఆయా కంపెనీలకు సూచించింది. విమానయాన కంపెనీలు మొక్కుబడిగా కొంత తగ్గించాయి. తిరిగి మళ్లీ చార్జీలను ఆకాశానికి చేర్చడం పట్ల భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్చు చార్జీలపై పౌర విమానయాన మంత్రిత్వశాఖకు చెందిన డీజీసీఏ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు పెరిగాయి.

కాన్పులకూ ముహూర్తాలు

సమస్యలు తప్పవంటూ వైద్య నిపుణుల హెచ్చరిక | 'సమయం' కంటే ఆరోగ్యం, సంరక్షణే కీలకమని సూచన



కాన్పు కాకపోయినా...

పుట్టుక, చావు...ఏ క్షణాన వస్తాయో ఎవరికీ తెలియదన్నది నానుడి. అయితే ఇది ఒకప్పటి మాట. చావు సంగతి ఎలా ఉన్నప్పటికీ ఇప్పుడు పుట్టుక మాత్రం మన చేతుల్లోనే ఉంది. శిశువు ఎప్పుడు భూమి మీద పడాలో తల్లిదండ్రులే నిర్ణయించుకుంటున్నారు. ఆ 'శుభ ఘడియ'లను తామే నిర్దేశించు కుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే మంచి ముహూర్తం చూసుకొని పిల్లల్ని కంటున్నారన్న మాట. తిథి, వార, నక్షత్రాలను చూసుకొని అన్నీ బాగున్నాయనుకుంటే ఆ సమయానికే సిజేరియన్ చేసి బిడ్డను బయటికి తీయాలని వైద్యులకు సూచనలు చేస్తున్నారు.

న్యూఢిల్లీ : 'పూజారినో లేదా జ్యోతిష్కుడినో సంప్రదించి డెలివరీలకు ముందుగానే ముహూర్తాన్ని నిర్ణయించుకుంటున్నారు. వివాహాలకు ఏ విధంగా అయితే ముహూర్తం పెడతారో ఇప్పుడు బిడ్డ జన్మించడానికి కూడా అదే రీతిన ముహూర్తం నిర్ణయించుకుంటున్నారు. అయితే వైద్యులు ఈ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. డెలివరీకి సమయం ఆసన్నమైందా లేక ఇంకా సమయం ఉన్నదా అనేది చూసుకోవాలి. వైద్యపరంగా అత్యవసర పరిస్థితి ఎదురైతే ఎలాగూ తప్పదు. అలాంటి స్థితి ఉన్నదా అనేది కూడా గమనించాల్సి ఉంది' అని బెంగళూరులోని బీజీఎస్ ఆస్పత్రి గైనకాలజీ విభాగంలో పనిచేస్తున్న సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నిర్మలా చంద్రశేఖర్ తెలిపారు. ఇప్పుడు సిజేరియన్ డెలివరీలపై ఎక్కువగా ఆధారపడుతున్నందున ముహూర్తం ప్రకారం బిడ్డను బయటికి తీయడంలో కొత్తేమీ లేదని వైద్యులు చెబుతున్నారు. మొదటిసారి మాతృమూర్తి అయ్యే మహిళలు ఎక్కువగా సిజేరియన్ వైపే మొగ్గు చూపుతున్నారని, కాకపోతే దానికి శుభ ముహూర్తాన్ని నిర్ణయించుకుంటున్నారని నిర్మలా చంద్రశేఖర్ చెప్పారు.

జ్యోతిష్యాన్ని నమ్మి...

బిడ్డ జననాన్ని పూర్తిగా నియంత్రించలేము. సంప్రదాయపరంగా చూస్తే అనేక డెలివరీలు సహజంగానే జరిగిపోతున్నాయి. బిడ్డ ఎప్పుడు భూమిపై పడుతుందో వైద్యులు ముందుగా ఉజ్జాయింపుగా అంచనా వేస్తారు. కానీ అదేమీ కచ్చితమైన తేదీ కాదు. ఇప్పుడు వైద్య శాస్త్రం అభివృద్ధి చెందుతోంది. దీంతో తమ పిల్లల భవితవ్యాన్ని తామే నిర్ణయించాలని చాలా మంది తల్లిదండ్రులు ఆశిస్తున్నారు. అందుకోసం జ్యోతిష్యపరంగా అనుకూలమైన సమయాన్ని ఎంచుకుంటున్నారు. ఆ సమయాన్ని జ్యోతిష్య పండితుడో లేదా పూజారో నిర్ణయిస్తున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ముహూర్త డెలివరీలకు డిమాండ్ పెరుగుతోందని హైదరాబాద్‌లోని కేర్ ఆస్పత్రిలో క్లినికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మంజుల అనగాని అంగీకరించారు. 'చాలా మంది దానిని కోరుకుంటున్నారు. అనిశ్చితమైన ప్రపంచంలో బిడ్డ భవిష్యత్తుపై తామే ప్రభావం చూపాలని వారు ఆశిస్తున్నారు. అయితే ఇలాంటి డెలివరీలు ఆమోదయోగ్యం కావు. మా ఆస్పత్రిలో సిజేరియన్ తప్పనిసరి అయ్యే పరిస్థితి ఉంటేనే దీనికి అంగీకరిస్తున్నాము' అని ఆమె చెప్పారు.

సమస్యలు తప్పవు

ఇదిలావుండగా దేశంలో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య నానాటికీ పెరిగిపోతోందని అధ్యయనాలు చెబుతున్నాయి. 2015-16లో సిజేరియన్లు 17.2 శాతం జరిగితే 2019-21 నాటికి వాటి సంఖ్య 21.5 శాతానికి పెరిగిందని జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వేలు తెలిపాయి. ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్ల సంఖ్య బాగా ఎక్కువగా ఉంటోంది. వాటిలో జరిగే డెలివరీల్లో సగానికి పైగా సిజేరియన్లే. ఈ తరహా ఆపరేషన్లు సురక్షితమని, ఎలాంటి సమస్యలు ఉండవని చాలా మంది చెబుతుంటారు. అలాంటప్పుడు ముందుగానే సమయాన్ని నిర్ణయించుకొని ఆపరేషన్ చేయించుకుంటే అది తల్లి లేదా బిడ్డ ఆరోగ్యంపై ఎందుకు ప్రభావం చూపుతుందన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. దీనికి వైద్య నిపుణులు పలు కారణాలు చూపుతున్నారు. తల్లి గర్భంలోని పిండం పూర్తిగా తయారు కాకుండానే....అంటే 37 వారాల కంటే తక్కువగా ఉన్నప్పుడే ముహూర్త డెలివరీ చేస్తే నవజాత శిశువు ఆరోగ్యంపై ప్రభావం పడుతుందని, అలాంటప్పుడు వారికి తరచుగా ఎన్ఐసీయూ చికిత్స అందించాల్సి వస్తుందని డాక్టర్ అనగాని హెచ్చరించారు. అదీకాక సహజంగా నెప్పులు వచ్చినప్పుడు ఆ రోజు డెలివరీ చేయడానికి తల్లిదండ్రులు ఇష్టపడని పక్షంలో తల్లికి, బిడ్డకు సమస్యలు ఎదురవుతాయని ఆమె చెప్పారు. 'సహజమైన డెలివరీకి అవకాశం ఉన్నప్పటికీ కొందరు సిజేరియన్ చేయాలని పట్టుబడతారు. తాము ముందుగా ఎంచుకున్న సమయానికి డెలివరీ అయ్యేలా చూడడానికే వారు ఇలా చేస్తుంటారు. ఇది చాలా హానికరం. అనవసరమైన శస్త్ర చికిత్స పద్ధతులు పాటించాల్సి రావడంతో ఇన్‌ఫెక్షన్లు సోకే ప్రమాదం ఉంది. తల్లి అనారోగ్యం బారిన పడుతుంది. శిశువుపై కూడా ప్రభావం పడుతుంది' అని వివరించారు.

డెలివరీ సురక్షితమైనప్పుడు, శిశువు శారీరకంగా పూర్తిగా తయారైనప్పుడు పెద్దగా ఆరోగ్య సమస్యలేవీ రావని డాక్టర్ చంద్రశేఖర్ చెప్పారు. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తామని, తల్లిదండ్రులు ఎంచుకునే ముహూర్తం వైద్యపరంగా అనువుగా లేకుంటే వారికి నచ్చచెమబుతామని తెలిపారు. చివరగా డాక్టర్ ముంజులా అనగాని ఓ అద్భుతమైన సలహా ఇచ్చారు. 'పుట్టే సమయం కంటే చిన్నారుల భవిష్యత్తులో మంచి ఆరోగ్యం, సరైన వైద్య సంరక్షణ ప్రధాన పాత్ర పోషిస్తుంది'.... డాక్టర్ మంజుల మాటలు అక్షర సత్యాలు కదూ ?!

ఆంక్షలు తప్పనిసరి

పెరుగుతున్న ధోరణులకు అనుగుణంగా ఆస్పత్రులు కూడా కొన్నింటిని అంగీకరించాల్సి ఉంటుంది. అయితే ఆంక్షలు తప్పనిసరి. కొన్ని సందర్భాలలో తల్లిదండ్రులు ఎంతగా ఒత్తిడి తెచ్చినా తాము నిరాకరిస్తున్నామని కొందరు వైద్యులు తెలిపారు. 'సాధారణంగా ఆపరేషన్లు ఉదయం లేదా పగటి సమయంలో జరుగుతాయి. ఆ సమయంలో తల్లిదండ్రులు ఏదైనా సమయాన్ని సూచిస్తే అంగీకరిస్తాం. కానీ రాత్రి సమయంలో... 10 గంటల నుండి అర్ధరాత్రి ఒంటి గంట మధ్య డెలివరీలు చేయాలని అడిగితే మాత్రం అందుకు నిరాకరిస్తాం. ఎందుకంటే అప్పుడు వైద్య సేవలు అందించడం కష్టం. ఆ సమయం అటు బిడ్డకు, ఇటు తల్లికి సానుకూలమైనది కాదు' అని డాక్టర్ అనగాని తెలిపారు.

ఉపాధ్యాయుల గొంతునయ్యా...

• నిత్యం అధ్యాపకుల మధ్యే ఉన్నా • చట్టసభల్లో వారి వాణి వినిపించా



మీరు ఎమ్మెల్సీగా ఎన్నికై ఆరేండ్లు పూర్తి కావస్తున్నది. ఈ పదవి మీకు సంతృప్తినిచ్చిందా?, మీ అనుభవాలేంటీ?

ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావడం నాకు కొత్త అనుభవం. అనేక మంది ప్రజాప్రతినిధులను నేను గమనించాను. నిజాయితీ, నిబద్ధతతో ప్రజలతో కలిసుండే కొంతమంది ప్రజాప్రతినిధులు నాపై బలమైన ముద్ర వేశారు. వారి స్ఫూర్తితోనే నేను ఆరేండ్ల కాలం ఎమ్మెల్సీగా కొనసాగుతూ వచ్చాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సామాన్యులతో నేను వ్యవహరించిన తీరు ప్రజాప్రతినిధిగా నాకు చాలా సంతృప్తిని కలిగించింది. ఎందుకంటే ఈ ఆరేండ్లూ నన్ను ఎన్నుకున్న ఉపాధ్యాయులు అధ్యాపకుల మధ్యే గడిపాను. వారి సమస్యల పరిష్కారంలో, ప్రభుత్వ విద్యారంగాన్ని నిలబెట్టడంలో మంచి కృషి చేశాను.

రెండోసారి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్నారు. మొదటిసారి ఎన్నికల్లో మీరు ఇచ్చిన హామీలు ఎంత వరకు నెరవేరాయి. టీచర్ల సంక్షేమం కోసం ఎలాంటి కృషి చేశారు. ఇప్పుడు మీకు ఓటెందుకు వేయాలంటారు?

2019 నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారి నేను పోటీ చేశాను. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రధానంగా నన్ను ఒక ప్రశ్న అడిగారు. మీరు కూడా అధికార పార్టీ కండువా కప్పుకుని అటు వెళ్తారా? లేదా నికరంగా ఉపాధ్యాయుల పక్షాన నిలబడతారా?అని ప్రశ్నించారు. ఈ ఆరేండ్ల కాలంలో నా పనితీరును గమనించారు. గెలిచిన తర్వాత నేను ఉపాధ్యాయుల పక్షాన నికరంగా నిలబడ్డాను. నిజాయితీ, నిబద్ధతతో ఉన్నాను. ప్రతి సమస్యనూ సమర్థవంతంగా ప్రాతినిధ్యం చేశాను. అవి కొన్ని పరిష్కారమయ్యాయి. పీఆర్సీ 2020లో 30 శాతం ఫిట్‌మెంట్ ఇప్పించడంలో, దాన్ని రెగ్యులర్ ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వర్తింపజేయడంలో నేను కీలక పాత్ర పోషించాను. గతేడాది జూన్‌లో ఢిల్లీకి వెళ్లి ఎన్‌సీటీఈ చైర్మెన్, సెక్రెటరీలతో మాట్లాడి టెట్ సమస్యను పరిష్కరించాను. తద్వారా 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చాయి. 35 వేల మంది ఉపాధ్యాయులకు బదిలీలు కూడా జరిగాయి. గురుకుల విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు నిర్వహించడంలోనూ నా కృషి ఎక్కువగా ఉన్నది. కేజీబీవీ ఉపాధ్యాయుల ప్రతి సమస్య పరిష్కారంలో నేనున్నాను. వారు కాంట్రాక్టు పద్ధతిలో ఉన్నా మూడు పర్యాయాలు బదిలీలు చేయించాను. పీఆర్సీ ప్రకారం 30 శాతం జీతాల పెంపుదలకు కృషి చేశాను. వేసవి కాలం జీతాలు వచ్చేటట్టు చేశాను. ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఆటో రెన్యూవల్ సాధించాం. వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కూడా మా ద్వారానే వచ్చింది. మోడల్ స్కూల్ టీచర్ల ప్రతి సమస్య పరిష్కారంలో, ఉన్నత విద్యారంగమైన ఇంటర్, డిగ్రీ, విశ్వవిద్యాలయాల అధ్యాపకుల సమస్యల పరిష్కారంలో నా కృషి ఉన్నది. ఇంకా కొన్ని సమస్యలు పరిష్కారం చేయాల్సి ఉన్నది.

విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పట్ల బీఆర్ఎస్ విధానాలకు, కాంగ్రెస్ విధానాలకు తేడా ఏంటీ?

బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకులాల పేరు చెప్పి ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింది. బడ్జెట్‌ను కూడా 6.5 శాతానికి తగ్గించింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొంచెం భిన్నంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది బడ్జెట్‌లో విద్యకు 7.5 శాతం నిధులను కేటాయించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు విద్య బడ్జెట్‌ను 15 శాతానికి పెంచాలి. తొమ్మిదేండ్ల నుంచి ఉపాధ్యాయులకు పదోన్నతులు లేకపోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో బోధనా సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ అప్‌గ్రేడ్ అయిన పండితులు 20 వేలకుపైగా ఉపాధ్యాయులకు పదోన్నతులను కల్పించింది. డీఎస్సీ ద్వారా 10 వేలకుపైగా పోస్టులను అతి తక్కువ కాలంలో భర్తీ చేసింది. గత ప్రభుత్వం పాఠశాలల్లో పారిశుధ్య పనులను గ్రామపంచాయతీలు, మున్సిపాల్టీలు, మున్సిపాల్ కార్పొరేషన్లకు అప్పగించింది. అది ఆచరణలో సాధ్యం కాదని నేను 4 ఏండ్ల నుంచి మండలిలో, బయట చెప్తున్నాను. విద్యాశాఖ ద్వారానే పాఠశాలలకు పారిశుధ్యం కోసం నిధులివ్వాలని కోరాను. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు గ్రాంట్‌ను నెలవారీగా మంజూరు చేస్తున్నది. ప్రభుత్వ విద్యాసంస్థల కరెంటు బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని నిర్ణయించింది.

శాసనమండలిలో మీరు లేవనెత్తే సమస్యలు పరిష్కారమవుతున్నాయా?

ఈ అంశానికి వచ్చినపుడు అసెంబ్లీ, శాసనమండలిలో ప్రజా సమస్యలపై చర్చ జరిగే సమయం బాగా తగ్గింది. ఆ కొద్ది సమయంలో ప్రస్తావించిన అంశాలు కొన్ని పరిష్కారమవుతున్నాయి. కొన్ని అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి.

మీకు సీడీపీ నిధులు వస్తాయి. వాటిని ఏయే అవసరాలకు ఖర్చు చేశారు?

నాకు ఆరేండ్ల కాలంలో మూడేండ్లలో రూ.9 కోట్లు సీడీపీ నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ నిధులను 95 శాతానికిపైగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీగోడల నిర్మాణం కోసమే కేటాయించాను. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉండి ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసమే నిధులను ఖర్చు చేశాను.

సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రజలకు మీరందించిన సహాయం ఎలా ఉందంటారు?

ఇతర కార్యక్రమాలకు సంబంధించి సీఎంఆర్ఎఫ్ కింద బీపీఎల్ కుటుంబాల వారికి ఆర్థిక సహాయం అందజేస్తారు. వారు మా ఓటర్లు కాదు. అయినా వెయ్యికిపైగా కుటుంబాలకు రూ.4 కోట్లు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఇప్పించాను. నిమ్స్ ఆస్పత్రిలో బీపీఎల్ కుటుంబాల వారికి రూ.1.20 కోట్లకుపైగా ఎల్‌వోసీ ఇప్పించాను. చాలా మంది పేద పిల్లలకు గురుకులాల్లో మిగిలిపోయిన సీట్లలో ప్రవేశాలు కల్పించేందుకు కృషి చేశాను.

మీరు ఎమ్మెల్సీగా మళ్లీ పోటీ చేస్తున్నారు. మీకు మద్దతిస్తున్న సంఘాలేంటీ?


టీఎస్‌యూటీఎఫ్‌తోపాటు టీపీటీఎఫ్, ఎస్టీఎఫ్, జూనియర్ లెక్చరర్ల సంఘం, పాలిటెక్నిక్ లెక్చరర్ల సంఘం, విశ్వవిద్యాలయ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం, మోడల్ స్కూల్ టీచర్ల సంఘం, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఉపాధ్యాయుల సంఘం, కేజీబీవీ ఉపాధ్యాయుల సంఘం, కాంట్రాక్టు ఉపాధ్యాయుల సంఘం, ఐదు రకాల గురుకులాలైన రాష్ట్ర గురుకులాలు, సాంఘిక సంక్షేమ గురుకులాలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, బీసీ గురుకులాలు, మైనార్టీ గురుకులాల్లోని ఉపాధ్యాయ సంఘాలు మద్దతిస్తున్నాయి.

317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన వారి సమస్యను ఎలా పరిష్కారం చేయాలంటారు?

రాష్ట్రపతి ఉత్తర్వుల ప్రకారం కొత్త జిల్లాల ఏర్పాటు వల్ల కొంత మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు వారు పుట్టిన జిల్లా కాకుండా ఇతర జిల్లాల్లో పనిచేస్తున్నారు. పరస్పర (మ్యూచువల్), భార్యాభర్తలు (స్పౌజ్), ఆరోగ్య కారణాలున్న వారి బదిలీలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. స్థానికత కోల్పోయిన వారందరినీ రూల్ 28 ప్రకారం ఖాళీలు ఏర్పడుతున్న సందర్భంలో సొంత జిల్లాలకు బదిలీ చేయాలి. 317 జీవో బాధితులకు న్యాయం చేయాలి.

ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఇంకా ఏయే సమస్యలను ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారమేంటీ?

ఈ-కుబేర్‌లో ఉన్న పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలి. బకాయిపడ్డ నాలుగు డీఏలను విడుదల చేయాలి. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి. ఓపీఎస్‌ను అమలు చేయాలి. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లోని ఉపాధ్యాయులకు ఆరోగ్య కార్డులివ్వాలి. కేజీబీవీ టీచర్లకు గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని కాంట్రాక్టు ఉపాధ్యాయులకు మినిమం టైంస్కేల్ అమలు చేయాలి. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలి. వాటిలో చనిపోయిన కుటుంబాల వారికి కారుణ్య నియామకాలను చేపట్టాలి. గురుకులాలకు సొంత భవనాలను నిర్మించాలి. ఉపాధ్యాయులకు నివాస సముదాయాలను ఏర్పాటు చేయాలి. గురుకులాల కాల నిర్ణయ పట్టికను మార్చాలి. ఉద్యోగుల ఆరోగ్య కార్డులను పటిష్టంగా అమలు చేయాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలకు నిర్వహణ గ్రాంటును రూ.2 లక్షలకు తగ్గకుండా ఇవ్వాలి. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా రూ.10 లక్షల వరకు ఇవ్వాలి. జూనియర్ కాలేజీల్లో బోధనేతర సిబ్బంది పోస్టులను మంజూరు చేయాలి. డిగ్రీ కాలేజీల్లో అధ్యాపకులకు ఏడో కేంద్ర పీఆర్సీ బకాయిలను చెల్లించాలి. విశ్వవిద్యాలయాల్లో కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో మిగిలిపోయిన కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలి. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి. మెస్‌చార్జీలను కూడా పెంచాలి. కేంద్ర ప్రభుత్వమే మధ్యాహ్న భోజన పథకాన్ని ఇంటర్ వరకు విస్తరించాలి. కొత్త జిల్లాలకు డీఈవో పోస్టులను, డీఐఈవో పోస్టులను, కొత్త మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలి. ఎంఈవో, డిప్యూటీఈవో, డీఈవో, డైట్ లెక్చరర్ల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులను ప్రవేశపెట్టాలి. తరగతికొక టీచర్, గది, పాఠశాలకో ప్రధానోపాధ్యాయుల పోస్టు ఉండేలా ప్రాథమిక పాఠశాలలను రీ ఆర్గనైజ్ చేయాలి.



దేశభక్తుల్ని అవమానిస్తోన్న మోడీ సర్కార్

- బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు దేశానికే ప్రమాదకరం
- మత ప్రాతిపదికన ప్రజలను విడదీసే కుట్ర
- భగత్‌సింగ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలి : నవతెలంగాణ పుస్తకావిష్కరణ సభలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"మోడీ సర్కార్ దేశభక్తులను అవమానిస్తోంది. గాంధీ, నెహ్రూ లాంటి వారి త్యాగాలు, పోరాటాల ఆనవాళ్లు లేకుండా చేసేందుకు చరిత్రను వక్రీకరిస్తోంది. మతమౌఢ్యాన్ని ప్రజల నరనరాల్లో జొప్పిస్తూ.. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు హిందూ రాష్ట్ర ఎజెండాను భుజానెత్తుకుని మత ప్రాతిపదికన ప్రజలను విడదీసేందుకు చేస్తున్న ప్రయత్నాలు దేశానికే ప్రమాదకరం. భగత్ సింగ్‌ను ఆదర్శంగా తీసుకొని వారు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలి" అని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ ఇర్ఫాన్ హబీబ్ రాసిన 'ఇంక్విలాబ్' రాంపునియా రాసిన 'ఆర్ఎస్ఎస్, బీజేపీ కోరుకునేది' అనే రెండు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం వెస్లీ మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కొనసాగుతున్న సంక్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో ఈ రెండు పుస్తకాలు రావడం సమాజానికి, భవిష్యత్ పోరాటాలకు ఎంతో అవసరమని వ్యాఖ్యానించారు. స్వాతంత్రోద్యమ కాలం నుంచి బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరిస్తూ, హిందూ, ముస్లింల మధ్య చిచ్చు పెట్టిన చరిత్ర ఆర్ఎస్ఎస్‌దని విమర్శించారు. హిందుత్వ ఎజెండాను అమలు చేసేందుకు ఒకప్పుడు జనసంఘ్‌కు, ప్రస్తుతం బీజేపీకి బినామీగా ఆర్ఎస్ఎస్ మారిందని ఎద్దేవా చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలు, పేద, ధనిక వర్గ పోరాటాలను అడుగడుగునా దెబ్బతీస్తూ కుల వ్యవస్థను పెంచి పోషిస్తోందని వ్యాఖ్యానించారు. మూడోసారి గద్దెనెక్కిన మోడీ సర్కార్ విభజన రాజకీయాలకు పాల్పడుతూ దేశాన్ని రెండు వర్గాలుగా చీల్చేందుకు కుట్రలు పన్నుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ బలంగా ఉన్న రాష్ట్రాల్లో దళితులపై భౌతిక దాడులు, మహిళలపై లైంగికదాడులు పెరగడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. బుల్లెట్ నడిపాడని, పెండ్లిలో గుర్రంపై ఊరేగాడని దళితుల చేతులు, కాళ్లు నరికిన అమానుష చర్యలే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఆదివాసుల్లో మత భావాల్ని జొప్పించి వారి కాళ్ల కింద ఉన్న ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు చేస్తున్న కుట్రలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమాలు రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ఇంక్విలాబ్ పుస్తక అనువాదకులు, ఎస్వీకే మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ మాట్లాడుతూ భగత్‌సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడిన యోధుడు మాత్రమే కాదనీ, స్వాతంత్ర్యానంతరం దేశం ఎలా ఉండాలనే దానిపై అధ్యయనం చేసిన మేధావి అని కొనియాడారు. " బాంబులు, తుపాకులు విప్లవం కాదు. ప్రజల జీవితాల్లో మౌలిక మార్పు రావడమే విప్లవం. నేను నా జీవిత చరిత్రను రాయాలనుకోవడం లేదు... ప్రపంచ చరిత్రను రాయాలనుకుంటున్నాను" అని భగత్‌సింగ్ చెప్పిన మాటలే ఆయన ఆలోచనలకు అద్దం పడుతున్నాయని వ్యాఖ్యానించారు. పుస్తక అనువాదకులు జి.రఘుపాల్ మాట్లాడుతూ దేశాన్ని మత ప్రాతిపదికన ప్రజల్ని విభజిస్తున్న నేటి తరుణంలో ఇలాంటి పుస్తకాలు మరింతగా రావాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నవతెంగాణ పబ్లిషింగ్ హౌస్ ఎడిటర్ కె.ఆనందాచారి మాట్లాడుతూ భారత దేశంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి సాహిత్యం రావాల్సిన అవసరం ఎంతో ఉందని వ్యాఖ్యానించారు. భగత్‌సింగ్‌ను త్యాగశీలిగా మాత్రమే కాకుండా, దేశాన్ని గొప్పగా మలచాలనే మేధావిగా చూడాలని పేర్కొన్నారు. కుల, మత రహిత సమాజం కోసం ఆయన చివరి వరకు తపించారని కొనియాడారు. నవతెలంగాణ బుక్‌హౌస్ జనరల్ మేనేజర్ ఆర్.వాసు కార్యక్రమానికి స్వాగతం పలకగా, మేనేజర్ డి.కృష్ణారెడ్డి వందన సమర్పణ చేశారు.

ట్రంప్, పుతిన్ మధ్య భేటీ ఖరారు కాలేదు

వెల్లడించిన క్రెమ్లిన్

రియాద్ : అమెరికా అధ్యక్షుడు ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య సమావేశానికి ఎలాంటి తేదీ నిర్ధారించలేదని క్రెమ్లిన్ అధికారులు మంగళవారం తెలిపారు. రియాద్‌లో రష్యా, అమెరికా అధికారులు జరిపిన చర్చలకు హాజరైన పుతిన్ విదేశాంగ వ్యవహారాల సలహాదారుడు యూరి యుష్‌కొవ్ రష్యా చానెల్‌తో మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఈ సమావేశంలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గి లావ్‌రోవ్, అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో సహా ఇరు దేశాల అధికారులు పాల్గొన్నారు.

వచ్చే వారం ఇరు నేతల సమావేశం జరగకపోవచ్చని, దీనిపై ఇంకా ఇరు దేశాల ప్రతినిధి బృందాలు కసరత్తు చేయాల్సి వుందని యుష్‌కొవ్ చెప్పారు. రష్యా, అమెరికా మధ్య సంబంధాలు మెరుగుపరుచుకోవడంపై, ఉక్రెయిన్‌లో యుద్ధానికి స్వస్తి పలకడంపై ఇరు దేశాల చెందిన ఉన్నతాధికారులు మంగళవారం రియాద్‌లో సమావేశమయ్యారు.

విద్యార్థినిపై లైంగికదాడి

'బేటీ బచావో' ప్రసంగానికి ప్రశంస

ఆ తర్వాత 11రోజులకు దారుణం

దేశానికే మోడలైన గుజరాత్‌లో దారుణం

అహ్మదాబాద్/పలన్పూర్ : గుజరాత్‌లోని సబర్కాంత లో గల గ్రామ పాఠశాలలో జనవరి 26న జరిగిన బేటీ బచావో.. బేటీ పఢావో కార్యక్రమంలో ఆ పాఠశాల విద్యార్థిని చేసిన ప్రసంగానికి అందరూ మారుమోగేలా చప్పట్లు కొట్టారు. కానీ అదే పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడే తనపై లైంగికదాడికి పాల్పడ్డాడుజ. దేశానికే మోడల్ గుజరాత్ అంటూ ప్రధాని మోడీ ఓ పక్క గొప్పలు చెబుతుండగా ..అక్కడ ఎవరికీ భద్రతలేదని మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి.

అసలేం జరిగింది..?

సబర్కాంతలోని ఓ పాఠశాలలో చదువుతున్న పదిహేనేండ్ల బాలిక "ఆడపిల్లలను రక్షించడం, విద్య అంశాల ప్రాముఖ్యత"పై గణతంత్ర దినోత్సవం రోజున ఉత్సాహభరితమైన వాతావరణంలో అద్భుతమైన ప్రసంగం చేసింది. దీంతో ఆమెను ఎంతోమంది మెచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆ బాలిక "నేను పోలీసు అధికారి కావాలని అనుకుంటున్నాను. సైన్స్ , గణితం నాకు ఇష్టమైన సబ్జెక్టులు. నా బోర్డు ఫలితాల ఆధారంగా నేను నా విద్యా ప్రవాహాన్ని ఎంచుకుంటాను" అని చెప్పింది. ఈ కార్యక్రమం జరిగిన 11 రోజులకు ఫిబ్రవరి 7న అదే పాఠశాల ఉపాధ్యాయుడు తన పుట్టినరోజు వేడుకల పేరుతో ఆ బాలికను హెూటల్‌కు రప్పించి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చెప్పిన మాట వినకపోతే బోర్డు పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరించాడనే ఆరోపణలూ ఉన్నాయి.

కుటుంబంలో ఎవరెవరు ఉన్నారంటే..

ఆ బాధిత బాలిక తన తండ్రి, సోదరితో కలిసి ఉంటోంది. వారు వ్యవసాయ కార్మికులు. ఈ దారుణం జరిగిన సంగతి తెలిశాక ఆమెను ఓదార్చేందుకు ప్రతిరోజూ జనం, బంధువులు వచ్చేవారు. అయితే 'ఆమె చదువుకు అంతరాయం కలిగించడం మాకు ఇష్టం లేదు. "ఆమె ధైర్యం , దృఢ సంకల్పం పట్ల మేము చాలా గర్వపడుతున్నాం.

ముందున్న సవాళ్లతో సంబంధం లేకుండా, మేము ఆమెకు ప్రతి అడుగులోనూ మద్దతు ఇస్తాం" అని ఆమె మామ అన్నారు.

"మా భవిష్యత్ తరం వ్యవసాయ కార్మికులుగా కష్టపడి పనిచేయాలని మేము కోరుకోవడం లేదు. మేము భూస్వాములం కాదు. చదువు ప్రాముఖ్యతను గ్రహించాం" అని ఆ బాలిక మామ నొక్కి చెప్పారు. అయితే ఆ చిన్నారి ధైర్యానికి వచ్చిన ప్రశంసలు ఆ కుటుంబానికి మాత్రమే పరిమితం కాదు. ఆ అమ్మాయి చాలా తక్కువ సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు తడబడే లెక్కలేననీ ఇది ఎంతో మందికి స్థితిస్థాపకతకు ఒక ఆదర్శంగా నిలుస్తుందని పలువురు తెలిపారు. ఈ సందర్భంగా గ్రాంట్-ఇన్-ఎయిడ్ పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఆమె ధైర్యాన్ని ప్రశంసించే వారి జాబితాలో పెరుగుతున్నారు. "ఆమె ఎప్పుడూ తరగతులను కోల్పోని ఒక తెలివైన విద్యార్థి. కనీసం చెప్పాలంటే, ఈ సవాలుతో కూడిన సమయాల్లో ఆమె ధైర్యం , స్థితిస్థాపకతతో వేస్తున్న విధానం స్ఫూర్తిదాయకం" అని ప్రిన్సిపాల్ చెప్పారు.

తనపై దారుణం జరిగినా..పరీక్షలకు సన్నద్ధం

తనపై లైంగికదాడి జరిగినా ఆ విద్యార్థిని కుంగిపోలేదు. తన కుటుంబ పరిస్థితులు గమనించి తనకైన గాయాన్ని ఎదుర్కొని అసాధారణ స్థితి నుంచి రాబోయే బోర్డు పరీక్షలపై దృష్టిపెట్టింది. తనపై దాడి జరిగిన మూడు వారాల తర్వాత ఫిబ్రవరి 27 నుంచి జరగనున్న పరీక్షలకు సిద్ధమవుతున్నట్టు తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు టీచర్‌ను అరెస్టు చేశారు.



సంపాదకీయం

అవినీతి ప్రమాదకరం

అవినీతి ప్లేగ్ కన్నా భయంకరంగా వ్యాపిస్తోంది. అది దేశంలోని అన్ని అంగాలకు సోకింది. ఇప్పుడది ప్రభుత్వాన్నే శాసిస్తోంది. అది చెప్పినట్టుగా పాలకులు తలలూపాల్సి వస్తోంది. తమ గురువులకు కావా ల్సిన పనిని అవినీతి భూతం చేయించిపెడుతోంది. తాజాగా ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ విడుదల చేసిన 2024 అవినీతి భావన సూచిక కూడా ఇదే రుజువు చేసింది. అవినీతిలో భారతదేశం 180 దేశాలతో పోలిస్తే 96వ స్థానంలో ఉంది. దేశంలో అవినీతి ర్యాంక్ 1995 సంవ త్సరం నుండి 2024 వరకూ సగటున 78.03గా ఉంది. అది 2024లో గరిష్ట స్థాయికి...అంటే 96.00కి చేరింది. 1995లో ఈ ర్యాంక్ 35.00గా ఉంది.

ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతీయుల ప్రభ వెలిగిపోతున్నదనీ, విశ్వగురుగా అవతరించిందనీ సుప్రభాత గీతా లతో మేల్కొంటున్నాం. అవినీతిని, నల్లధనాన్ని తరిమి కొట్టడమే లక్ష్యంగా మోడీజీ మహత్తర విజయాలు సాధించారని ఒకవైపు కీర్తిస్తుంటే ఈ సూచిక వివరణ భిన్నంగా ఉంది. అసలు అవినీతిపై ఇంతగా సమరం చేస్తున్నాను గనకే తనను ప్రత్యర్థులు వేటాడుతున్నారనీ ఆయన చేసిన భావోద్వేగ ప్రకటనలతో భజనపరులు బాధపడిపోతుంటారు. అవినీతిని అరికడతాం.. పూర్తిగా రూపుమాపుతాం అని మోడీ 2014లో చెప్పినా, ఇప్పుడు మాట్లాడుతున్నా అసలు ఆపింది లేనేలేదు. ఇంతచేస్తే పై స్థాయిలో అవినీతిని ఎందుకు అరి కట్టలేకపోతున్నారంటే సమాధానం ఉండదు. ఒకవేళ తమకు రాజకీయంగా ఇబ్బందులు వచ్చినప్పుడు, అవినీతికి ప్రజలు వ్యతిరేకంగా తిరగబడుతున్న సమయంలో రాజకీయ ప్రత్యర్థులపై ఆరోపణలు చేసేసి.. తప్పుకుంటారు. పెద్దనోట్ల రద్దు సమయంలో ఇలానే జనాన్ని రోడ్లపై నెట్టేసి అవినీతిపరులకు ఏ రకంగా ద్వారాలు తెరిచింది చూశాం. అవినీతిని అడ్డుకోవడం ప్రస్తుత పాలకులకు ఇష్టం లేదు. మరింత పెంచి పోషిస్తూ రాజకీయ పబ్బానికి వాడుకోవడమే బీజేపీ ప్రభుత్వానికి కావాల్సింది. అవినీతి, కార్పొరేట్లు, మతం ఈ మూడింటితోనే దేశ రాజకీయాలను, ప్రభుత్వాన్ని, రాష్ట్రాలను మోడీ ప్రభుత్వం శాసిస్తోంది.



బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం, అస్మదీయులకు ప్రజాసంపదను దోచి పెట్టడంలో గత ప్రభుత్వాల కంటే బీజేపీ ప్రభుత్వం మించి పోయింది. తమకు మేలు చేసిన వారి అవినీతి కుంభ కోణాలు బయటపడినా వారికి అండగా నిలబడింది. వందలు, వేల కోట్ల రూపాయల కుంభకోణాలు బయట కొచ్చినా విజయ్‌మాల్యా, నీరవ్‌మోడీ లాంటి దొంగలను దగ్గరుండి దేశం దాటించింది. బీజేపీ నేతలు ప్రభుత్వ రంగాలను పూర్తిగా అనిల్ అంబానీ, గౌతమ్ అదానీ వంటి పెద్ద పెద్ద పెట్టుబడిదారులకు దగ్గరుండి దోచిపెడుతున్నారు. అనేక చోట్ల అవినీతి జరిగిందని తెలిసినా చర్యల్లేవు. అవినీతికి దూరంగా ఉండాలని మోడీ చెబుతారు. కానీ తమ హయాంలో జరుగుతున్న అవినీతి కుంభ కోణాల గురించి మాత్రం పెదవి విప్పరు. ఎన్నికల బాండ్ల రూపంలో కార్పొ రేట్ల నుంచి అత్యధికంగా విరాళాలు పొందింది బీజేపీనే. ఆ విషయంలో మరే పార్టీ దరిదాపుల్లోకి లేదు. ఆ డబ్బు అంతా అవినీతికరమైనదే. ఆ డబ్బుతోనే ప్రతిపక్షపార్టీల ప్రజాప్రతినిధులను కొనుగోలు చేయడం, ప్రభుత్వాలను పడకొట్టడం చేసింది. ఎన్నికల బాండ్లను వ్యతిరేకించిన ఏకైక పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే. విరాళాలు అందించిన కార్పొరేట్ సంస్థలకు మోడీ లబ్ది చేకూర్చారు. రైతుల రుణాలు మాఫీ చేయడానికి చట్టం వర్తించదు. అదే కార్పొరేట్లు నష్టపోతే వారి బ్యాంకు రుణాలను ఒక్క కలం పోటుతో రద్దు చేశారు.

విమానాల కుంభకోణం, బొగ్గు, విద్యుత్ అవినీతి... ఇలా ఎన్ని బయటపడినా మోడీ పాలనలో అవినీతి సర్వసాధారణం అయింది. అంతర్జాతీయంగా మోడీ ఆప్తుడైన అదానీ అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపలేదు. పైగా ఆయనపై కేసు లేకుండా చేయడం కోసం అమెరికా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ఆ దేశంలోని విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమ లును నిలిపివేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ట్రంప్ కూడా పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో అదానీ అవినీతిపై మాట్లాడేందుకు నిరాకరించారు. ప్రత్యర్థుల మీద ఏ చిన్న ఆరోపణలు వచ్చినా ఈడీ, సీబీఐ వంటి ప్రభుత్వ సంస్థలను ప్రయోగించి మోడీ ప్రభుత్వం ఇబ్బందులు పాలు చేస్తోంది చూస్తూనే ఉన్నాం. అవినీతి విషయంలో సీరియస్‌గా లేకుంటే, దేశాభివృద్ధిని దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్య విలువల క్షీణత, అస్థిరత, మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమవుతోందని నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. స్వచ్ఛమైన పాలన, అవినీతి రహితమైన పాలన అని గొప్పలు చెప్పుకోవడం తప్ప పేరుకు పోయిన అవినీతిని అరికట్టకపోగా కార్పొరేట్ల అనుబంధంతో మరింత అవినీతికి ఆస్కారం ఇస్తున్న ప్రభుత్వంగా మనముందు నిలబడింది. పెరుగుతున్న అవినీతి దేశాభివృద్ధికి ఆటంకంగా మారింది.

> విమానాల కుంభకోణం, బొగ్గు, విద్యుత్ అవినీతి... ఇలా ఎన్ని బయటపడినా మోడీ పాలనలో అవినీతి సర్వసాధారణం అయింది. అంతర్జాతీయంగా మోడీ ఆప్తుడైన అదానీ అవినీతి భాగోతం అమెరికాలో బయటపడినా ఆయన పరివారం పెదవి మెదపలేదు. పైగా ఆయనపై కేసు లేకుండా చేయడం కోసం అమెరికా అధ్యక్షుడిని ప్రభావితం చేసి ఆ దేశంలోని విదేశీ అవినీతి కార్యకలాపాల చట్టం అమ లును నిలిపివేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నారంటే అవినీతి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ట్రంప్ కూడా పెద్ద రియల్ ఎస్టేట్ వ్యాపారి కావడంతో అదానీ అవినీతిపై మాట్లాడేందుకు నిరాకరించారు.

ఉక్రెయిన్‌పై క్షణక్షణానికి మారుతున్న మాటలు


ఎం.కోటేశ్వరరావు

అమెరికా అధినేత డోనాల్డ్ ట్రంప్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఫిబ్రవరి 12న జరిపిన ఫోన్ సంభాషణ ప్రపంచంలో ఎంతో ఆసక్తి రేపింది. ఉక్రెయిన్ సమస్య పరిష్కారానికి చర్చలు జరపనున్నట్లు ప్రకటించాడు. పరస్పర విరుద్ధ వార్తలు, వ్యాఖ్యానాలు, విశ్లేషణలు, ఉక్రెయిన్ సంక్షోభం ముగింపు గురించి నేతలు చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే అసలేం జరుగుతోందని సామాన్యుడు ఎటూ తేల్చుకోలేని స్థితి. ఒక ప్రకటన, పరిణామం వాస్తవం అనుకుంటే తలెత్తే సందే హాలెన్నో. మంగళవారం నాడు ఇది రాసిన సమయానికి వచ్చిన వార్తల ప్రకారం సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లో అమెరికా -రష్యా ఉన్నత ప్రతినిధి వర్గాలు భేటీ అవుతున్నాయి. డోనాల్డ్ ట్రంప్-వ్లదిమిర్ పుతిన్ కూడా అక్కడి చేరుకోవచ్చని వార్త. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ బుధవారం నాడు అక్కడికి చేరుకోనున్నారు. ముగ్గురూ అక్కడ భేటీ కావచ్చంటున్నారు. ఐరోపాకు చర్చల్లో ఎలాంటి ప్రమేయం ఉండదనే ఊహాగానాల పూర్వరంగంలో సోమవారం నాడు పారిస్‌లో కొన్ని దేశాల నేతలు సమావేశం జరిపి పరిస్థితిని సమీక్షించారు. ఉక్రెయిన్‌పై 2022 ఫిబ్రవరి 24న రష్యా సైనిక చర్య ప్రారంభమైంది. వేగంగా మారుతున్న పరిణామాలను చూస్తే నాలుగో ఏడాదిలో ప్రవేశించకముందే దానికి ముగింపు పలుకుతారా? ఈ సమస్యను ఇంత సులభంగా పరిష్కరించే అవకాశం ఉంటే మూడేండ్లు ఎందుకు కొనసాగించినట్లు ? కోట్లాది మంది జనాలను, అనేక దేశాలను ఎందుకు ఇబ్బందులు పెట్టినట్లు? దీనికి ఎవరిది బాధ్యత? ఎంతో సం క్లిష్టమైన ఈ వివాదం ఒక్క భేటీతో నాటకీయంగా ముగుస్తుందా? చర్చల పేరుతో కొత్త ఎత్తుగడలకు ప్రాతిపదిక వేస్తున్నారా?

జెలెన్‌స్కీ, ఐరోపా సమాఖ్యతో నిమిత్తం లేకుండానే చర్చలు జరిపి ఒక ముగింపు పలుకుతామని అమెరికన్లు చెప్పారు. తమతో నిమిత్తం లేకుండా జరిగే చర్చలను అంగీకరించేది లేదని జెలెన్‌స్కీ ప్రకటించాడు. పుతిన్ అబద్దాల కోరు, అసలు తమకు చర్చల గురించి సమాచారమే లేదన్నాడు. ముసాయిదా ప్రతిపాదనల్లో తమ భద్రతకు ఎలాంటి హామీ లేదన్నాడు. తమకూ అంగీకారం కాదని ఐరోపా దేశాలు స్పష్టం చేశాయి. మరి జెలెన్‌స్కీ సతీసమేతంగా రియాద్ ఎందుకు వస్తున్నారంటే " అది ఎప్పుడో నిర్ణయించిన పర్యటన " అని అతగాడి ప్రతినిధి వివరణ ఇచ్చాడు. రష్యా-ఉక్రెయిన్ ఖైదీల మార్పిడి గురించి చర్చలు జరిపేందుకు జెలెన్‌స్కీ ఆదివారం నాడు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ చేరుకున్నాడు. సౌదీ పర్యటన గురించి గతంలో ఎలాంటి వార్తా లేదు. ఎవరి ప్రమేయం లేకుండా చర్చలు జరుగుతాయని ట్రంప్ సలహాదారులు స్పష్టంగా చెప్పారు. దానికి పూర్తి విరుద్దంగా శాంతి చర్చల్లో జెలెన్‌స్కీ పాల్గొంటారని ఆదివారం నాడు డోనాల్డ్ ట్రంప్ చెప్పినట్లు రాయిటర్స్ వార్త పేర్కొన్నది. ఐరోపా నుంచి వ్యతిరేక స్పందన వెలువడటంతో అమెరికా మాట మార్చింది.సౌదీలో చర్చలకు అమెరికా ప్రతినిధివర్గ నేత మార్క్ రూబియో సిబిఎస్ టీవీతో మాట్లాడుతూ అసలు పుతిన్ నిజంగా చిత్తశుద్ధితో ఉన్నాడా లేదా అన్నది పరీక్షించేందుకు చర్చలను ముందుకు తెచ్చామని, నిజమైన సంప్ర దింపుల్లో ఉక్రెయిన్, ఐరోపాకు భాగస్వామ్యం ఉంటుందని చెప్పాడు. ఎందుకంటే రష్యాపై ఆంక్షల్లో ఐరోపా కూడా ఉందన్నాడు. పైకి ఏమి చెప్పినప్పటికీ అమెరికా అధికారులు ప్రయివేటు సంభాషణల్లో ఐరోపా వారితో మీ అంగీకారం లేకుండా ఏదీ జరగదని చెబుతున్నట్లు మీడియా పేర్కొ న్నది. ఏ రోటి దగ్గర ఆ పాట పాడినట్లు వ్యవహరిస్తున్నారా ? దీన్ని చూస్తుంటే పరిణామాలు ఏ మలుపు తిరిగేదీ ఊహించలేము.

ట్రంప్ ఫోన్ సంభాషణకు ముందు జరిగిన పరిణామాలను సింహావలోకనం చేసుకోవాల్సి ఉంది. ఉక్రెయిన్ పోరులో తాము చేసిన సాయం లేదా చేసిన ఖర్చును తిరిగి చెల్లించే స్థితిలో లేనందున ప్రతిగా టిటానియం, యురేనియం, లిథియం వంటి 500 బిలియన్ల విలువగల ఖనిజ సంపదలున్న ప్రాంతాల్లో సగం తమకు అప్పగించాలని అమెరికా బేరం పెట్టింది. దాని కోసం తన ఆర్థిక మంత్రి స్కాట్ బిసెంట్‌ను కీవ్ పంపిన సంగతి తెలిసిందే ప్రస్తుతం రష్యా, దాని అనుకూల శక్తుల ఆధీనంలో ఉన్న నాలుగో వంతు భూ భాగంలో ఈ ఖనిజాలు ఉన్నాయి. సంక్షోభానికి ముందు ఉన్న ప్రాంతాలు తిరిగి కావాలని కోరుకోవద్దని కూడా ట్రంప్ యంత్రాంగం జెలెన్‌స్కీకి సూచించింది. అలాంటపుడు ఖనిజాల గురించి ఎందుకు బేరం పెట్టినట్లు? రష్యాను అడ్డుకొనేందుకు ఐరోపా దేశాలు కూడా పెద్ద మొత్తంలో ఖర్చు చేశాయి. ఖనిజాలతో అమెరికా తన ఖర్చుతాను రాబట్టుకుంటే తమ సంగతేమిటని అవి ప్రశ్నిస్తాయి. అయితే సంక్షోభం ప్రారంభమైన తరువాత ఐరోపా దేశాలు 300 బిలియన్ డాలర్ల విలువగల రష్యన్ ఆస్తులను స్తంభింప చేశాయి. వాటిని స్వాధీనం చేసుకోవటం గురించి కొందరు ఆలోచనలు చేస్తు న్నారు. దీనికి రష్యా అంగీకరించే సమస్యే ఉత్పన్నం కాదు. 2014లో రష్యా స్వాధీనం చేసుకున్న క్రిమియా ద్వీపకల్పంతో సహా ఆక్రమిత ప్రాంతాలన్నింటినీ తమకు అప్పగించాలని జెలెన్‌స్కీ డిమాండ్ చేశాడు. ఒక వైపు చర్చల గురించి సిద్ధమవుతూనే రష్యా తన దాడులను కొనసాగిస్తూనే ఉంది. ఉక్రెయిన్ ప్రతిఘటన కూడా



> కొద్ది నెలలు, వారాల క్రితం వరకు కూడా రష్యాను నిలువరించేందుకు ఏం చేయాలి? ఎలాంటి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందించాలి అని తర్జన భర్జనలు పడిన ఐరోపా నేతలు, వ్యూహకర్తలు ఇప్పుడు ట్రంప్ తెచ్చిపెట్టిన పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని మల్లగుల్లాలు పడుతున్నారు. తాము విధించిన ఆంక్షలతో బలహీనపడిన పుతిన్ నాయకత్వాన్ని మరింతగా ఎలా ఒంటరిపాటు చేయాలా అని చూశారు.ట్రంప్ చర్యతో పుతిన్ ఆ స్థితి నుంచి తాత్కాలికంగా అయినా బయటపడ్డారు. దీని అర్థం ఎవరిదారి వారు చూసుకోవటం అని కాదు.ఇప్పుడున్న పరిస్థితిలో అమెరికా-ఐరోపాలకు పరస్పర సహకారం అవసరం. మమ్మల్ని, మా భద్రతను అర్థాంతరంగా ఎలా వదిలి వెళతారని అడిగితే ఐరోపా మరింత చులకన అవుతుంది. అమెరికా పట్టు మరింతగా దాని మీద బిగుస్తుంది.

సాగుతోంది.

'నువ్వొకందుకు పోస్తే నేనొకందుకు తాగాను' అన్నట్లుగా పుతిన్ చాలా జాగ్రత్తగా స్పందిస్తున్నాడు. ఎవరూ ఎవరిని నమ్మే స్థితిలో లేరు. అమెరికా - ఐరోపా యూనియన్ మధ్య ఉన్న మిత్ర వైరుధ్యం ప్రస్తుతానికి శత్రు వైరుధ్యంగా మారు తుందని చెప్పలేము గానీ ట్రంప్ -పుతిన్ ఫోన్ చర్చల తరువాత తేడా మరింత పెరిగింది. అలాగైతే ఏం చేయాలి ఇలా జరిగితే ఏం చేద్దామనే సంప్రదింపులు ఐరోపాలో ప్రాథమికంగా ప్రారంభమయ్యాయి. ఇప్పుడు ఐరోపా దేశాలన్నింటికీ కలిపి ఎంత మిలిటరీ ఉందో అంతకంటే ఎక్కువగా రష్యా కలిగి ఉంది. అందువలన ఆచితూచి అడుగేస్తున్నాయి. అది వాటి బలహీనత అయితే దాన్ని సొమ్ము చేసుకోవాలని చూడటం అమెరికా బలం. అమెరికాకు అగ్రపీఠం అనే తన అవగాహనను ట్రంప్ మరింత ముందుకు తీసుకుపోయేట్లయితే ఐరోపాకు దానితో ఘర్షణ పడటం లేదా లొంగిపోవటం తప్ప మరొక మార్గం లేదు. అమెరికా బలహీనతలు కూడా తెలిసినందున ఐరోపా ధనిక దేశాలు అంత తేలికగా సాగిల పడతాయని చెప్పలేము. ప్రపంచ బలాబలాల్లో కొత్త సమీకరణకు తెరలేచే అవకాశాలు కూడా ఉన్నాయి. అదే జరిగితే అమెరికా ఏకాకి అవుతుంది, దానికి సిద్ధపడుతుందా ? అలాంటి అవకాశమే లేదని చెప్పవచ్చు.

'ఐరోపా మీద డోనాల్డ్ ట్రంప్ దాడి' అంటూ ఎకనమిస్టు పత్రిక ఒక వ్యాఖ్యా విశ్లేషణ చేసింది. ఉక్రెయిన్ మీద ఒక ఒప్పందం చేసుకొనేందుకు పుతిన్‌కు ట్రంప్ పంపిన ఆహ్వానం నాటో కూటమిని గందరగోళంలోకి నెట్టిందని పేర్కొన్నది. ఐరోపా భద్రతకు తామింకే మాత్రం ప్రాథమిక హామీదారుగా ఉండేది లేదంటూ ముందుగా అమెరికా రక్షణ మంత్రి పేట్ హెగ్‌సేత్ చేసిన ప్రకటన షాకిచ్చింది. కొద్ది గంటల తర్వాత పుతిన్‌తో సంప్రదింపుల గురించి ట్రంప్ ప్రకటిం చాడు. ఆ తర్వాత వార్షిక మ్యూనిచ్ భద్రతా సమావేశంలో ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నొప్పించే రీతిలో ఐరోపా మీద దాడి చేశాడు.ఉక్రెయిన్ గురించి మాట్లాడాల్సిన వాన్స్ తన ప్రసంగమంతా ఐరోపా మీద కేంద్రీకరించాడు.ఐరోపాకు ఉందని చెబుతున్న ముప్పు రష్యా నుంచి కాదు, అంతర్గతంగానే ఉందన్నాడు. దాని అర్థం వలసల సమస్య. పుండు మీద కారం చల్లినట్లుగా ఉక్రెయిన్‌లో అమెరికా రాయ బారి కెయిత్ కెలోగ్ కుండబద్దలు కొట్టినట్లు మాట్లాడాడు. సంప్రదింపుల్లో ఐరో పాకు స్థానం ఉంటుందా? అన్న ప్రశ్నకు అది జరుగుతుందని అనుకోవటం లేద న్నాడు. దీంతో ఐరోపా భద్రత తమ కళ్ల ముందే కుప్పకూలుతుందా అన్నట్లుగా అనేక మంది నేతలు, అధికారులు భావించినట్లు ఎకనమిస్టు వర్ణించింది. ట్రంప్ ప్రతిపాదించిన చర్చలు ఎవరి అజెండా మేరకు జరుగుతాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. వస్తున్న వార్తలన్నీ పుతిన్ డిమాండ్లకే అమెరికా అంగీకరించవచ్చని సూచిస్తున్నాయి.ఒక వేళ నిజంగా అదే జరిగితే రానున్న రోజుల్లో ఏ ఒక్కదేశం కూడా అమెరికా మాటలు, హామీల మీద ఆధారపడి వ్యవహరించే అవకాశాలు మరింతగా కుచించుకుపోతాయి. ఇంతవరకు దాన్ని నమ్మి బాగుపడిన దేశం లేదనే అభిప్రాయాన్ని మరింతగా బలపరిచినట్లు అవుతుంది. ప్రపంచాన్ని తమ గుప్పెట్లో పెట్టుకోవాలని చూస్తున్న అమెరికా సామ్రాజ్యవాదులు ఆత్మహత్యకు పాల్పడ తారా? సోమవారం నాడు ఫ్రెంచి అధ్యక్షుడు మక్రాన్ ఎంపిక చేసిన కొన్ని దేశా లతో పారిస్‌లో సంప్రదింపులు జరిపాడు. వాటి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

మూడేండ్లుగా ఉక్రెయిన్ శాంతి చర్చలను సాగనివ్వని అమెరికన్లు ఆకస్మికంగా ఎందుకు రష్యాతో సంప్రదింపులకు సిద్ధపడుతున్నారు జెలెన్‌స్కీ? ఒకటి ఐరోపాలోని నాటో కూటమి దేశాలు అవసరమైతే రంగంలోకి దిగుతామని కబుర్లు చెబుతున్నప్పటికీ నేరుగా ఉక్రెయిన్ తరఫున యుద్ధంలో పాల్గొనే అవ కాశాలు లేవు. వేల కిలోమీటర్ల దూరం నుంచి అమెరికా సేనలు వచ్చి రష్యాతో తల పడేందుకు సిద్ధం కాదు. ఆఫ్ఘనిస్తాన్ తాలిబాన్లకే సలాంగొట్టి కాళ్లు గడ్డాలు పట్టు కుని ప్రాణాలు అరచేత పట్టుకొని వెళ్లిన వారు అణుశక్తి రష్యాతో తలపడగలరా? రష్యా తొలి నుంచీ కోరుతున్నదేమిటి ? గతంలో తమకు హామీ ఇచ్చినట్లుగా ఉక్రె యిన్‌కు సభ్యత్వమిచ్చి నాటో కూటమి ఆయుధాలను తమ ముంగిట్లో ఉంచ కూడదు. సంక్షోభానికి ముందు ఉన్న సరిహద్దులు, ప్రాంతాల గురించి ఉక్రెయిన్ మరచిపోవాలి.శాంతి పరిరక్షణ, మరొక పేరుతో నాటో కూటమి దళాలు తమ సరి హద్దులో తిష్టవేయకూడదు. ఉక్రెయిన్ మిలిటరీపై పరిమితులు పెట్టాలి. స్వాతంత్ర్యం ప్రకటించుకున్న ఉక్రెయిన్‌లోని ప్రాంతాలకు అంతర్జాతీయ గుర్తింపు ఇవ్వాలి. ఏ విషయంలోనూ రాజీ పడేందుకు పుతిన్ సిద్ధంగా లేడని ఐరోపా గూఢచారులు నివేదించినట్లు వార్తలు. పుతిన్ షరతుల మేర ఒప్పందం కుదుర్చుకుంటే అమెరికాకు వచ్చేదేముంది? వారు మరీ అంత అమాయకులా?

కొద్ది నెలలు, వారాల క్రితం వరకు కూడా రష్యాను నిలువరించేందుకు ఏం చేయాలి? ఎలాంటి ఆయుధాలను ఉక్రెయిన్‌కు అందించాలి అని తర్జన భర్జనలు పడిన ఐరోపా నేతలు, వ్యూహకర్తలు ఇప్పుడు ట్రంప్ తెచ్చిపెట్టిన పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలా అని మల్లగుల్లాలు పడుతున్నారు. తాము విధించిన ఆంక్షలతో బలహీనపడిన పుతిన్ నాయకత్వాన్ని మరింతగా ఎలా ఒంటరిపాటు చేయాలా అని చూశారు.ట్రంప్ చర్యతో పుతిన్ ఆ స్థితి నుంచి తాత్కాలికంగా అయినా బయటపడ్డారు. దీని అర్థం ఎవరిదారి వారు చూసుకోవటం అని కాదు.ఇప్పుడున్న పరిస్థితిలో అమెరికా-ఐరోపాలకు పరస్పర సహకారం అవసరం. మమ్మల్ని, మా భద్రతను అర్థాంతరంగా ఎలా వదిలి వెళతారని అడిగితే ఐరోపా మరింత చులకన అవుతుంది. అమెరికా పట్టు మరింతగా దాని మీద బిగుస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన సమయంలో మాదిరి పశ్చిమ ఐరోపా ఆర్థికంగా బలహీనంగా లేదు. గడచిన ఏడు దశాబ్దాల్లో మొత్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థలన్నీ సమస్యలను ఎదుర్కొంటున్నప్పటికీ పశ్చిమ ఐరోపా పరిస్థితి మెరుగుపడింది. అందుకే ఫ్రాన్సు, జర్మనీ పాలకవర్గాలు స్వంతంగానే భద్రతను చూసుకోగలమనే సంకేతాలను పంపుతున్నప్పటికీ మొత్తంగా ఐరోపాను ఆదుకొనేంత ఆర్థిక శక్తి వాటికి లేదు. మొత్తమ్మీద ప్రపంచ రాజకీయాల గురించి మీడియాలో గతంలో ఎన్నడూ లేని చర్చ జరుగుతోంది. సౌదీలో ఏం జరగనుంది? తురుపు ముక్కలను ఎవరు ఎలా ప్రయోగిస్తారు.వేచి చూడాల్సిందే!

> 'ఐరోపా మీద డోనాల్డ్ ట్రంప్ దాడి' అంటూ ఎకనమిస్టు పత్రిక ఒక వ్యాఖ్యా విశ్లేషణ చేసింది. ఉక్రెయిన్ మీద ఒక ఒప్పందం చేసుకొనేందుకు పుతిన్‌కు ట్రంప్ పంపిన ఆహ్వానం నాటో కూటమిని గందరగోళంలోకి నెట్టిందని పేర్కొన్నది. ఐరోపా భద్రతకు తామింకే మాత్రం ప్రాథమిక హామీదారుగా ఉండేది లేదంటూ ముందుగా అమెరికా రక్షణ మంత్రి పేట్ హెగ్‌సేత్ చేసిన ప్రకటన షాకిచ్చింది. కొద్ది గంటల తర్వాత పుతిన్‌తో సంప్రదింపుల గురించి ట్రంప్ ప్రకటిం చాడు. ఆ తర్వాత వార్షిక మ్యూనిచ్ భద్రతా సమావేశంలో ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ నొప్పించే రీతిలో ఐరోపా మీద దాడి చేశాడు.ఉక్రెయిన్ గురించి మాట్లాడాల్సిన వాన్స్ తన ప్రసంగమంతా ఐరోపా మీద కేంద్రీకరించాడు.

అది ఫిబ్రవరి 17వ తేదీ. 1600 సంవత్సరం. ఇటలీ లోని రోమ్ నగరం, కాంపోడి ఫియోరి కూడలి. అక్కడికి ఖగోళ సిద్ధాంతకర్త, గణిత శాస్త్రజ్ఞుడు అయిన బ్రూనోను రెక్కలు విరిచి కట్టి తీసుకొచ్చారు. నాలుకకు చుట్టిన తీగ విప్పేసి, చివరిసారి అడిగారు. "తప్పులన్నీ ఒప్పుకో! ప్రాణభిక్ష పెడతాం!" అన్నారు రోమన్ మత న్యాయస్థానం పెద్దలు. బ్రూనో తల అడ్డంగా తిప్పాడు. తను ఏ తప్పు చేయలేదని నిర్భయంగా చెప్పాడు. శిక్ష అనుభవించడానికి సిద్ధమన్నట్లుగా నిలబడ్డాడు. 'నేను చెప్పిన నిజాలు తరతరాలుగా మీలాంటి మూర్ఖుల్ని తొలుస్తూనే ఉంటాయి' అన్న మనో నిబ్బరం ఆయనది. మత న్యాయస్థానం అధికారులు, రాజ్యాధినేతలు అందరూ ఆత్రంగా ఎదురు చూశారు. ఆ చివరి క్షణంలోనైనా దాసోహం అంటాడేమోనని ఆశపడ్డారు. కాని, వారి ఆశ నిరాశే అయ్యింది. సత్యస్థాపన కోసం తను ఎలాంటి శిక్షకైనా సిద్ధమేనన్నట్లు, వారివైపు బ్రూనో జాలిగా చూశాడు. 'ఏమిటీ విచిత్రం? గాలీ వెలుతురూ లేని చీకటి గదిలో ఏడేళ్ళు బంధించినా, రోజూ చిత్ర హింసలు పెట్టినా, క్రమం తప్పకుండా మానసికంగా వేధించినా బ్రూనోలో ఏ మాత్రం మార్పు రాలేదేమని మతాధికారులు ఆశ్చర్యపోయారు. వారి పైశాచికత్వానికి వారే భయపడ్డారు. అయితే ఆ పైశాచిక ప్రవృత్తిని బ్రూనోకు అంటగట్టారు. ఇతను మనిషి కాదు, సైతానుగా మారిపోయాడు. సైతాను రక్తం భూమి మీదపడితే అరిష్టం సంభవిస్తుంది-అని తీర్మానించుకున్నారు. మూఢత్వంలోంచి క్రూరత్వంలోకి జారిపోయారు.

బ్రూనో సజీవ దహనం అతిపెద్ద మానవ తప్పితం


Giordano Bruno.

అప్పటివరకు మత విశ్వాసకులు భూమి కేంద్రకమని, దాని చుట్టూ సూర్యుడు తిరుగుతున్నాడని విశ్వసించేవారు. అది తప్పని, సూర్యుని చుట్టూ భూమి తిరుగుతోందని బ్రూనో చెప్పాడు. ఈ విషయం అంతకు ముందు నికొలస్ కోపర్నికస్ (1473-1543) చెప్పిందే. దాన్ని బ్రూనో బలపరిచాడు. అంతేకాదు. ఈ భూమి లాంటి "భూములు" (గ్రహాలు) ఇంకా ఉన్నాయన్నాడు. ఈ విశ్వానికి ఆదీ, అంతం ఉన్నాయని మత విశ్వాసకులు బోధిస్తూ ఉంటే, అలాంటివేమీ లేవన్నాడు బ్రూనో. మొత్తానికి సూర్య కేంద్రక సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం, క్రైస్తవ సన్యాసి అయి ఉండి క్రీస్తుకు, బైబిల్‌కు వ్యతిరేకంగా ప్రశ్నలు గుప్పించడం, విమర్శించడం నాటి రోమన్ మత న్యాయస్థానం వారికి ఆగ్రహం తెప్పించింది. మానవీయ విలువల్ని మంటగలుపుతూ నాటి మత పెద్దలు బ్రూనోకు శిక్ష విధించారు. మనిషి, మనిషిని మనిషిగా గుర్తించక పోవడం చరిత్రలో అతి దారుణంగా నమోదైంది.

బ్రూనో (1548-17 ఫిబ్రవరి 1600) ఫిలిప్పో బ్రూనోగా ఇటలీ, నాఫ్లస్ రాజ్యం, నోలాలో పుట్టాడు. కవిగా, తత్వవేత్తగా, గణిత శాస్త్రజ్ఞుడిగా పేరు సంపాదించుకున్నా, ఖగోళ సిద్ధాంతకర్తగా ప్రపంచ ప్రఖ్యాతు డయ్యాడు. ఆధునిక వైజ్ఞానిక పరికరాలు లేని రోజుల్లో, టెలిస్కోపులు, అబ్జర్వేటరీలు లేని రోజుల్లో కొన్ని వైజ్ఞానిక విషయాలు కచ్చితంగా చెప్పగలిగాడంటే ఆయన ఎంతటి మేధావో మనం అంచనా వేసుకోవాలి. చుక్కలు చాలా దూరంలో ఉన్న సూర్యుళ్ళు అని మొదట చెప్పిన వాడాయన. తరువాత కాలంలో ఆయన చెప్పిన అంశాల్ని ఆధునిక పరిశోధనలు ధృవీకరించాయి. స్వయం ప్రకాశితాలు, వేడినిచ్చే కొన్ని 'సూర్యుళ్ళు నిశ్చలంగా ఉన్నాయని, వాటి చుట్టూ తిరిగే వాటినే 'భూముల'ంటున్నామని, అవి వెలుగునూ, వేడిని సూర్యుల నుండి స్వీకరిస్తున్నాయని బ్రూనో ప్రకటించాడు.

వైజ్ఞానికంగా ప్రపంచం ఏమీ సాధించని రోజుల్లోనే బ్రూనో లాంటి వాళ్లు గట్టిగా నిలబడి మూఢనమ్మకాల్ని నిరసించారు. ప్రాణ త్యాగానికి సిద్ధమయ్యారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు మత పెద్దలు పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తూ అబద్ధాలను నిజాలుగా భ్రమింపచేస్తున్నారు. జనాన్ని మూఢత్వంలో ముంచి ఉంచుతున్నారు. బ్రూనో వారసుల అవసరం ఈ నాడు కూడా ఉంది. ఇప్పటికీ భూమినే కేంద్రంగా తీసుకుని, లెక్కలు కడు తున్న అజ్ఞాన పండితుల్ని జనం తిరస్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. మనమిప్పుడు ఆస్ట్రాలజీ కాదు, ఆస్ట్రానమీ తెలుసుకోవాలి! బ్రూనో జ్ఞాపకార్థం పదిహేడు ఫిబ్రవరి సత్యాన్వేషణ దినంగా పరిగణిస్తున్నాం!

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మైనార్టీలు ఈ దేశ పౌరులు కాదా?బడ్జెట్‌లో ఎందుకింత వివక్ష?


అబ్దుల్ సత్తార్
7382619029

"సబ్‌కా సాత్..సబ్‌కా వికాస్" మోడీ ప్రభుత్వం చాలా గొప్పగా చెప్పుకుంటున్న నినాదం. దేశంలో తమ ప్రభుత్వం అందరిదనీ, ఆదర్శ మైనదని, సంక్షేమాన్ని ఇచ్చేదని వల్లె వేస్తున్నది. కానీ, ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మైనార్టీలను పూర్తిగా విస్మరించింది. కేంద్ర బడ్జెట్ మొత్తం రూ.50.47 లక్షల కోట్లు. ఇందులో మైనార్టీల సంక్షేమానికి కేటాయిం చింది కేవలం 0.05 ఆరు శాతం. ఇది చాలా నామమాత్రం. మైనార్టీలకు సంబం ధించిన స్కాలర్‌షిప్ కేటాయింపులకు కోత పెట్టడం నుంచి మొదలకుంటే ఫ్రీ కోచింగ్ స్కీమ్, స్కిల్ డెవల ప్మెంట్, ఎంప్లాయ్‌మెంట్ పథకాలు అన్నింటా మోడీ సర్కార్‌ది చిన్నచూపే. బడ్జెట్‌లో నిధులు కేటాయించ కుండా వికాస్ ఎలా సాధ్య మనేది ప్రశ్న? 2023- 24 బడ్జెట్‌లో ఫ్రీ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు రూ.433 కోట్లివ్వగా ఆ తర్వాత ఏడాది దీనికి కోత పెట్టి 326.16 కోట్లు కేటాయి ంచింది. ఇప్పుడేమో కేవలం 195.70 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపు కుంది. దేశంలో దాదాపు ఇరవై కోట్ల మంది ముస్లిం జనాభా ఉంటే, వారికి సరిపడా కేటాయింపులు లేక పోవడం ఆందోళనకరం. కేటాయించిన వాటిని కూడా ఖర్చు పెట్టకపోవడం మరీ తీవ్రమైన అన్యాయం. 2023 -24లో ఖర్చు పెట్టింది కేవలం రూ.95.83 కోట్లు, ఆ తర్వాత ఏడాది మరింత తగ్గించి కేవలం 90 కోట్లతోనే సరిపెట్టింది.

మైనార్టీ సముదాయాల పిల్లల భవిష్యత్తు చదువుతో ముడిపడి ఉందని సచార్ కమిటీ, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్లు 2010-11లోనే సిఫార్సులు చేశాయి. మైనా ర్టీలు విద్యాపరంగానే కాదు ఆర్థికపరంగా కూడా వెనక బడ్డారని, ఈ సమయంలో పిల్లల చదువును ప్రోత్స హించడం ద్వారా వారి ప్రగతికి తోడ్పడటం, దేశ అభివృద్ధికి కూడా చాలా అవసరమని చెప్పాయి. ఈ విషయాలన్నీ మోడీ సర్కార్‌కు పట్టదు. మైనార్టీ పిల్లల చదువులను కూడా నిర్లక్ష్యం చేస్తున్నది. 2025-26 బడ్జెట్‌లో ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్స్‌లో కోత పెట్టింది. పోస్ట్ మెట్రిక్స్ స్కాలర్ షిప్‌ల విషయంలోనూ ఇదే పరిస్థితి. ఈసారి బడ్జెట్‌లో 65 శాతం వరకు కోత విధించింది. మెరిట్, ప్రొఫెషనల్, టెక్నికల్ చదువులను ఉద్దేశించినవాటికి గతేడాది రూ.33.60 కోట్లు కేటాయిస్తే ఈసారి కేవలం 7.34 కోట్లు మాత్రమే కేటాయించింది. విదేశీ చదువులకిచ్చే రుణాల విషయం లోనూ ఇదే వైఖరి. గతేడాది రూ.15.30 కోట్లు కేటాయిస్తే, ఈసారి 8.16 కోట్లు మాత్రమే ఇచ్చింది. ఈ ఏడాది కేటాయింపులే సరిపోవంటే అందులో నిధుల విడుదల, ఖర్చు పెట్టడం కూడా తక్కువ గానే ఉండే అవకాశం ఉంది. ఎందు కంటే, మైనార్టీలకు కేటాయి ంచిన గత రెండు, మూడు బడ్జెట్‌ల్లోనూ ఇదే పరిస్థితి. ఇది మైనార్టీ పిల్లలను విద్యకు దూరం చేయడమే తప్ప వేరే కాదు.

> చదువులకు స్కాలర్‌షిప్‌ల మద్దతు లేకపోతే పేదరికంలో రోజు కష్టపడే కుటుంబాలు, అసంఘటిత రంగ కార్మికులు పిల్లలను చదివించు కోవడం కష్టం. 2023-24లో రూ. 1689 కోట్లు బడ్జెట్లో కేటాయి ంచగా రూ.500 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేసింది. కానీ ఖర్చు పెట్టింది మాత్రం రూ. 428.74 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఇదే స్కీముల కోసం కేటాయించింది రూ.678.03 కోట్లు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రాజ్యాంగబద్ధం కాదని కోర్టులో అప్పటి ప్రభుత్వం కేసు వేయగా ఏండ్లపాటు కేంద్రమిచ్చే స్కాలర్‌షిప్‌లు ఆ రాష్ట్రంలో అందించ లేదు. దీన్నిబట్టి చూస్తే మోడీ మైనార్టీల చదువుల పట్ల వ్యతిరేకంగా ఉన్నారనేది స్పష్టమవుతున్నది.

మరోవైపు మదర్సాల పట్ల వ్యతిరేక ప్రచారం జరుగుతున్నది. 2023-24 బడ్జెట్‌లో మదర్సాల స్కీముల కేటాయిం పులు 93 శాతం తగ్గించింది. ఆ తర్వాత



ఏడాది కేవలం రూ. రెండు కోట్లివ్వగా ఈ ఏడాది పూర్తిగా తగ్గించింది. 2024- 25లో మోడీ ప్రభుత్వం మొత్తం ఆరు స్కీములకు గాను రూ.1575.72 కోట్లు కేటాయిస్తే, అందులో విడుదల చేసింది కేవలం 517.20 కోట్లు మాత్రమే. ఖర్చు ఎంత చేశారన్నది తెలియదు. దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల పిల్లల చదు వులకు స్కాలర్‌షిప్‌లు ఉప యోగమో అలాగే మైనార్టీల పిల్లలకు కూడా అంతే అవసరం. చదువులకు స్కాలర్‌షిప్‌ల మద్దతు లేకపోతే పేదరికంలో రోజు కష్టపడే కుటుంబాలు, అసం ఘటిత రంగ కార్మికులు పిల్లలను చదివించుకోవడం కష్టం. 2023-24లో రూ. 1689 కోట్లు బడ్జెట్లో కేటాయించగా రూ.500 కోట్లు నిధులు మాత్రమే విడుదల చేసింది. కానీ ఖర్చు పెట్టింది మాత్రం రూ. 428.74 కోట్లు మాత్రమే. ఈ ఏడాది ఇదే స్కీముల కోసం కేటాయించింది రూ. 678.03 కోట్లు. మోడీ గుజరాత్ ముఖ్య మంత్రిగా ఉన్న సమయంలో ముస్లిం విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు రాజ్యాంగబద్ధం కాదని కోర్టులో అప్పటి ప్రభుత్వం కేసు వేయగా ఏండ్ల పాటు కేంద్రమిచ్చే స్కాలర్‌షిప్‌లు ఆ రాష్ట్రంలో అందించలేదు. దీన్నిబట్టి చూస్తే మోడీ మైనార్టీల చదువుల పట్ల వ్యతిరేకంగా ఉన్నారనేది స్పష్టమవుతున్నది.

ఇంకోవైపు ఇటీవల వక్ఫ్ బిల్లుపై కేంద్రం పార్లమెంటులో చర్చ లేవనెత్తింది. తర్వాత జాయింట్ పార్లమెంటరీ కమిటీ జరిపి మళ్లీ ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నది. వక్ఫ్ సమస్యల పరిష్కా రానికి బిల్లు తెచ్చామని చెప్పకుంటున్న కేంద్రం బడ్జెట్‌లో దాని కోసం ఎలాంటి కేట యింపులు చేయ లేదు. ఖౌమి వక్ఫ్‌బోర్డ్ తర్కీయాతి స్కీం ఇందులో ఒకటి. ఒక బోర్డు నిర్వహిస్తున్న ఆస్తులన్నింటినీ డిజిటలైజ్ చేయడానికి ఉద్దేశించిన స్కీమ్. అలాగే షహరీ సంపత్తి వికాస్ యోజన మరో స్కీమ్. వక్ఫ్ సంస్థలు, వక్ఫ్ బోర్డులకు, వక్ఫ్ ఆస్తుల అభివృద్ధి కోసం, వడ్డీ రహిత రుణాలివ్వడానికి ఉద్దేశించిన స్కీమ్. ఈ రుణాల ద్వారా పట్టణాల్లో ఉన్న వక్ఫ్ భూములపై ఆర్థికంగా లాభ దాయకమైన కట్టడాలు అంటే బిజినెస్ కాంప్లెక్సులు, కల్యాణ మండపాలు, ఆస్పత్రులు, కోల్డ్ స్టోరేజ్ యూనిట్లు వగైరా నిర్మించి ఈ ఆస్తులను వినియోగంలోకి తీసుకు రావడం ఉద్దేశం.ఈ రెండు స్కీమ్‌లు గతంలో వేర్వేరుగా ఉండేవి. కానీ 2020-21లో ఈ రెండు స్కీములను కలిపి ఒకటి చేశారు. 2023- 24లో కేవలం రూ.17 కోట్లు కేటాయిస్తే ఇందులో రూ.8కోట్లు మాత్రమే విడుదల చేసి కేవలం ఖర్చుచేసింది మాత్రం పదిలక్షలు. తర్వాత సంవత్సరం రూ.16 కోట్లు కేటాయించి ఖర్చు పెట్టింది రూ.3.7 కోట్లు మాత్రమే. ఈ ఏడాది రూ.13 కోట్లు కేటా యించగా ఇందులో ఎంత ఖర్చు చేస్తారో కూడా తెలియని పరిస్థితి. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్‌కు సంబం ధించిన విషయాల్లో నయి మంజిల్, లీడర్‌షిప్ డెవలప్మెంట్ ఆఫ్ మైనార్టీ వుమెన్, హమారీ ధరోహర్ వంటి స్కీములను పూర్తిగా నిలిపేసింది.

యూపీఎస్సీ, ఎస్సెస్సీ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల పరీక్షల కోసం మైనార్టీ పిల్లలకు తోడ్పడే కార్యక్రమాలు కూడా ఆగిపోయాయి. మౌలానా ఆజాద్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ నేషనల్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్ఎండిఎఫ్‌సి) కేటాయింపులు పడిపోయాయి. కొంత మంది గతంకంటే ఎక్కువిచ్చామని చెబుతున్నా అంకెలు కూడా అలాగే కనిపిస్తున్నాయి. గతేడాది రూ.3183 కోట్లు కేటాయిస్తే ఈసారి 3350 కోట్లు కేటా యించింది. 167కోట్లు పెరిగినప్పటికీ వాటిని ఖర్చు చేసేవరకు నమ్మకం లేదు. ఎందుకంటే, ఇప్పటివరకు మైనార్టీ సంక్షేమానికి కేటాయించిన నిధులు సగానికి సగం ఖర్చు చేయలేదు. గతేడాది మైనార్టీల కోసం రూ. 3183.24 కోట్లు ప్రకటించి, మళ్లీ రూ.1868.18 కోట్లుగా సవరించింది. ఈసారి ఏమవు తుందోనన్న ఆందోళన మైనార్టీలను వేధిస్తోంది. అయితే ఇక్కడ గమ నించాల్సిన ముఖ్యమైన విషయమేమి టంటే కేంద్రం ఉద్దేశ పూర్వ కంగానే మైనార్టీ వర్గాలను బలహీన పరిచేయత్నం చేస్తున్నది. అందుకే ఏడాదికేడాది కేటాయింపుల్లోనూ కోతలు విధిస్తున్నది. ఈ పదకొండు సంవత్సరాల బడ్జెట్‌ను చూస్తే ఎవరికైనా అర్థమవుతుంది. ఈ విధా నాల్ని సహించబోమని మైనార్టీ ప్రజలు గళ మెత్తాలి. మేము కూడా ఈ దేశ పౌరులమేనని, మాకూ హక్కులున్నాయని చాటిచెప్పాలి. మైనా ర్టీలకు కేటాయించిన అరకొర బడ్జెట్‌ను సవరించి, వాటిని సంక్షేమానికి ఖర్చు చేసే వరకు ఉద్యమించాలి.

ప్రమాద బాధితున్ని పరామర్శించిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటల

నవతెలంగాణ-బోనకల్

ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ప్రస్తుతం ఖమ్మంలోనే ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్న గుగులోతు వసంతరావుని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ మంగళవారం పరామర్శించారు. గుగులోతు వసంతరావు ఖమ్మం జిల్లా భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షుడు గుగులోతు నాగేశ్వరావుకు సోదరుడు కావడంతో జిల్లాకు వచ్చిన భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సభ్యుడు, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆసుపత్రికి వెళ్లి వసంత రావును పరామర్శించారు. వైద్యులను వసంతరావు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడుతూ కొంతమంది నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎదురుగా వస్తున్న వారికి నష్టం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ రోడ్డు మార్గంలో వెళ్లేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సృజన్ హాస్పిటల్ అధినేత డాక్టర్ ప్రసాద్‌తో మాట్లాడి గుగులోతు వసంతరావుకు సంబంధించి ఆరోగ్య విషయాలు తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన కోరారు. ఆసుపత్రిలో పలు ఇబ్బందులతో బాధపడుతున్న మరి కొంతమంది రోగులను ఈటెల పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది శుభాస్ రెడ్డి, శనంపూడి సైది రెడ్డి, ఎమ్మెల్సీ, జిల్లా ఇన్చార్జి చడా శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణ, డాక్టర్ శీలం పాపారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, జిల్లా ఉపాధ్యక్షులు బోయినపల్లి చంద్రశేఖర్, ఖమ్మం అసెంబ్లీ ఇంచార్జ్ అల్లిక అంజయ్య ఉన్నారు.



ఆర్టీసీ సిబ్బందికి శిక్షణా తరగతులు

- సిబ్బంది ప్రయాణికుల పట్ల మర్యాదతో ప్రవర్తిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలి
- ఆర్టీసీ మేనేజర్ యు.రాజ్యలక్ష్మి

నవతెలంగాణ-సత్తుపల్లి రూరల్

ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తిస్తూ సంస్థ అభివృద్ధికి సిబ్బంది పాటుపడాలని సత్తుపల్లి డిపో మేనేజర్ యూ రాజ్యలక్ష్మి సిబ్బందిని కోరారు. మంగళవారం సత్తుపల్లి డిపోలో సిబ్బందికి నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బందిలో నైపుణ్యం పెంపొందిస్తూ సొంతదారుని భావన కల్పించి సంస్థ అభివృద్ధికి ఉపయోగపడే విధంగా శిక్షణ తరగతులు ఉంటాయని, ఆమె తెలిపారు. ప్రతి ఒక్క సిబ్బంది బాధ్యతాయుతంగా ఐక్యతతో పనిచేస్తే సంస్థ అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు వివిధ విభాగాల సిబ్బందికి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను ఏ విధంగా సాధించాలనే విషయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్, వివిధ లఘు చిత్రాల ద్వారా సిబ్బందికి వివరించారు. ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, నైపుణ్యంతో వృత్తిలో రాణించడం, సమిష్టిగా ఎలాంటి సమస్య అయినా ఎదుర్కొనే విధంగా సిబ్బంది నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఆమె కోరారు. సిబ్బందికి సొంతదారుని భావన కలిగే విధంగా ఉదాహరణలతో కూడిన ఆటలను ఆడించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



బోనకల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-బోనకల్

బోనకల్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మండల ప్రత్యేక అధికారి కడారు విజయభాస్కర్ రెడ్డి, తహసీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి వారు మధ్యాహ్న భోజనాన్ని చేశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. దీంతో విద్యార్థులు సంతృప్తికరమైన సమాధానం అధికారులకు చెప్పారు. ప్రతిరోజు మెనూ ప్రకారమే తమకు భోజనం పెడుతున్నారని భోజనం విషయంలో తాము ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోవటం లేదని అధికారులకు విద్యార్థులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన విషయంపై రాష్ట్ర ప్రభుత్వం చాలా కఠినంగా ఉందని మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టకపోయినా మధ్యాహ్న భోజన కార్మికులపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. నాణ్యమైన భోజనం, కూరలు విద్యార్థులకు పెట్టాలని వారికి సూచించారు. మధ్యాహ్న భోజన విషయంపై ఉపాధ్యాయులు ప్రతిరోజు తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గిర్దావర్ -1 గుగులోతు లక్ష్మణ్, ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అట్లూరి గోపీచంద్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

వరి గడ్డి వాము దగ్ధం

నవతెలంగాణ -కూసుమంచి

గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో, వరి గడ్డి వాము దగ్ధం అయిన ఘటన మండల పరిధిలోని, గైగోళ్ళపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం గ్రామానికి చెందిన సన్నకారు రైతు బొడ్డు మల్సూర్ తన పశువుల కోసం ఇంటివద్ద వరి గడ్డి వాము పెట్టుకున్నాడు. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడిద అయిందని తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకున్నారు. దీంతో తనకు రూ.50వేల రూపాయల నష్టం జరిగిందని, ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.


వేమన శతకం పద్యం గళార్చనలో విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-కల్లూరు

సత్తుపల్లి జేవియర్ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా గార్లపాటి పాపచలం, బొల్లేపల్లి సత్యనారాయణ రాజు ట్రస్టు సౌజన్యంతో గార్లపాటి రామకృష్ణ, బొల్లెపల్లి మధు సూదన్‌రాజు ఆధ్వర్యంలో 'వేమన శతక పద్య గళార్చన' పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్లూరు మండలం ఎన్ఎస్‌సి ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయురాలు శ్రీలక్ష్మి, తమ పాఠశాల విద్యార్థులు మెరుగు హర్షిని, మెరుగు గౌతమి, పిట్టల వైష్ణవి, లింగాల భాగ్యలక్ష్మి లింగాల శ్రీ లక్ష్మీ, ఉమా రేణుక, చదల శైలజ, మెరుగు అవంతిక ప్రతిభ చాటటంతో కల్లూరు మండలం విద్యా శాఖ అధికారి పి.నివేదిత చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ చెంచు రత్నయ్యకు డాక్టరేట్

నవతెలంగాణ-ఖమ్మం



నగరంలోని ఎస్ఆర్‌బిజిఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలలో జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న బంగారు చెంచురత్నయ్యకు తిరుపతి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రకటిస్తూ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిక ఉత్తర్వులు జారీ చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా ప్రకటనలో తెలిపారు. ఎస్వి యూనివర్సిటీ జూవాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ ఏ.ఉషారాణి పర్యవేక్షణలో "ఆర్సినిక్ ఇండ్యూస్డ్ టాక్సీ సిటీ అండ్ ఇట్స్ బయో కెమికల్ ఎఫెక్ట్ ఆన్ ది సెలెక్టెడ్ టిష్యూస్ ఆఫ్ మెల్ ఆల్బినో ర్యాట్" అనే అంశంపై పరిశోధనా సిద్ధాంత గ్రంధాన్ని సమర్పించారు. ఈసందర్భంగా చెంచురత్నయ్యకు పలువురు అభినందనలు తెలిపారు.

ఖమ్మంలో నకిలీ వైద్యుడు

తనిఖీల్లో గుర్తించిన డీఎంహెచ్ఓ



నవతెలంగాణ ఖమ్మం కార్పొరేషన్

స్థానిక కమాన్ బజార్ నందు గల పెయిన్ రిలీఫ్ ఆక్యూ పంకచర్ ఆస్పత్రిని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.కళావతి బాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా ఎలా ప్రాక్టీస్ చేస్తారని ప్రశ్నించారు. ఆ సమయంలో డాక్టర్‌గా చెప్పబడుచున్న పి.విజయభాస్కర్ పత్తా లేకుండా పోవడం గమనర్హం. అతనికి వైద్యుడిగా అర్హతలు లేవని గుర్తించి, సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తగిన అర్హతలు లేకుండా వైద్యం చేయటం నేరమని, అర్హత ఉంటే అలోపతిక్ చట్ట ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించాకొని ప్రాక్టీస్ చేయాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ లేకుండా ప్రాక్టీస్ చేస్తే చట్ట పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ సైదులు, డాక్టర్ చందునాయక్, డెమో సాంబశివరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.







మిర్చి ధరపై 'కన్నెర్ర'





ఖమ్మం మిర్చి ధరలపై సీపీఐ(ఎం) కన్నెర్ర చేసింది. క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం), ఏఐకేఎస్, తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మహాధర్నా నిర్వహించింది. ఎర్రజెండాలు చేతపట్టి పెద్ద ఎత్తున రైతులు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. దీనిలో భాగంగా తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు మాట్లాడుతూ క్వింటాల్ మిర్చికి రూ.25వేల మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యం

- ప్రజా సమస్యలపై మిలిటెంట్ పోరాటాలు
- పార్టీలోకి యూత్ భారీ చేరికలు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు



నవతెలంగాణ-ఖమ్మం

రానున్న ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికలే లక్ష్యంగా ప్రజా సమస్యలపై మిలిటెంట్ పోరాటాలు చేసి, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అధిక స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. మంగళవారం ఖమ్మంలోని ముస్తఫా నగర్ సెంటర్‌లో సీపీఐ(ఎం) సభ జరిగింది. ఈ సందర్భంగా పార్టీలో భారీ సంఖ్యలో చేరిన యూత్ సభ్యులకు మెడలో ఎర్ర జెండా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా నగరంలో భూ ఆక్రమణలు, భూకబ్జాలు, అభివృద్ధి పేరుతో నాసిరకం పనులు, సామాన్య పౌరులపై దాడులు లాంటివి సంఘటనలు జరిగినప్పుడు కేవలం సీపీఐ(ఎం) నాయకులే మాత్రమే వాటికీ వ్యతిరేకంగా పోరాటాలు చేసి అక్రమ కేసులు ఎదుర్కొన్నారని స్పష్టం చేశారు. గత ఖమ్మం మున్సిపల్ నాటి కాలంలో చిర్రవూరి లక్ష్మీనర్సయ్య, సమీనా అఫ్రోజ్ మున్సిపల్ ఛైర్మన్‌లుగా పనిచేసి నీతిగా, నిజాయితీగా పరిపాలన అందించారని తెలిపారు. ఖమ్మం నగరం అభివృద్ధి కోసం సీపీఐ(ఎం) అధికారంలో ఉన్నప్పుడు ప్రణాళికాబద్ధంగా అభివృద్ధికి కృషి చేశారని పేర్కొన్నారు. తర్వాత కాలంలో అధికారంలోకి వచ్చిన పార్టీలు అభివృద్ధిని గాలికి వదిలేసి ప్రజలపై భారాలు వేశారని విమర్శించారు. ఖమ్మం నగరంలో ప్రజా సమస్యలపై నికరంగా, నిజాయితీగా గత కొన్ని సంవత్సరాలుగా రోజు వారి ఆందోళన చేసి పలు సమస్యలు పరిష్కారం కోసం కృషి చేసిన పార్టీ సీపీఐ(ఎం) మాత్రమే చేసిందని వారు స్పష్టం చేశారు. రానున్న కాలంలో కూడా నగరంలో సమస్యలు పరిష్కారం కావాలంటే, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులను ప్రజలు గెలుపించుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. నగరంలో జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని తెలిపారు. ప్రజల కోసం, ప్రజల మధ్యే వుంటూ పోరాటాలు చేసే అభ్యర్థులకు ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. నగరంలో అనేక ప్రజా సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం చేయడంలో అధికారులు విఫలం అయ్యారని విమర్శించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించే వారికి మాత్రమే ఓటు వేసి గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం.ఏ జబ్బర్, ఎస్కే మీరా సాహిబ్, షేక్ బషీర్, వన్ టౌన్ కార్యదర్శి ఎస్కే నాగులు మీరా, నాయకులు హర్షా (చింటూ), చింతల రమేష్, కూరపాటి శ్రీను, ఎస్కే బేగం, భాగం అజిత, పి.రవి, ఎస్కే సత్తార్, ఆర్.నాగరాజు, అంబటిపూడి సుధాకర్, వొమ్మినేని రాంబాబు, పి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీఈవోగా బాధ్యతలు చేపట్టిన రంజిత్ కుమార్

నవతెలంగాణ-కల్లూరు

మండల ఎంపీఈవోగా రంజిత్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీఈఓ ఏనుగు సురేష్ బాబు తల్లాడ మండలానికి బదిలీ కావడంతో గత మూడు నెలల నుండి ఖాళీగా ఉంది. వేంసూర్ మండలంలో పనిచేస్తున్న రంజిత్ కుమార్ బదిలీపై కల్లూరు వచ్చి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు పుష్పగుచ్చాలు అందించి అభినందించారు.

ఏఐసిహెచ్ఆర్ మండల అధ్యక్షులుగా నాగేశ్వరావు నియామకం

నవతెలంగాణ-కల్లూరు



ఏఐసిహెచ్ఆర్ మండల అధ్యక్షులుగా ఎస్.నాగేశ్వరరావు మంగళవారం నియామకం అయ్యారు. అందులో భాగంగా ఏఐసిహెచ్ఆర్ ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు వినుకొండ శ్రీనివాసరావు నియామక పత్రాన్ని అందజేశారు. మానవ హక్కులకు ఇబ్బందులు కలిగినట్లయితే అన్ని విధాలుగా వారికి సహకరిస్తామని శ్రీనివాసరావు అన్నారు. న్యాయపరంగా చట్టపరంగా సలహాలు సూచనలు చేస్తామని ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటామని చెప్పారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే సండ్ర

నవతెలంగాణ-వేంసూరు

మండలంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పలు గ్రామాలలో పర్యటించి వధూవరులను ఆశీర్వదించారు. లచ్చన్న గూడెం, మర్లపాడు, కుంచపర్తి తదితర గ్రామాలలో శుభకార్యాల యందు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. సండ్రతోపాటు మాజీ ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, బిఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు గుత్తా శ్రీనివాసరావు, కరుణ ప్రసాద్, గొర్ల రామ్మోహన్ రెడ్డి, గండ్ర సోమిరెడ్డి, దూబ శ్రీనివాసరెడ్డి, మిరియాల ప్రసాద్ తదితరులు ఉన్నారు.



వేమన శతక పద్య గళార్చనలో... రికార్డు సృష్టించిన టాలెంట్ స్కూల్ విద్యార్థులు

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా సత్తుపల్లిలో గార్లపాటి పాపాచలం, బొల్లేపల్లి సత్యనారాయణరాజు, గండ్ర రామిరెడ్డి-లక్ష్మీకాంతమ్మ స్మారక ట్రస్టులు, ఆశ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేమన శతక పద్య గళార్చనలో స్థానిక టాలెంట్ స్కూలుకు చెందిన 140మంది విద్యార్థులు 100 పద్యాలను ఏకకంఠంతో గళార్చన చేసి ఉభయ తెలుగు రాష్ట్రాలలోనే రికార్డు సృష్టించారు. వేమన పద్య గళార్చన ద్వారా విద్యార్థులలో తెలుగు భాష పట్ల అభివృద్ధి కనబడిందని తల్లిదండ్రులు కూడా సంతృప్తి వ్యక్తపరిచారని స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు, జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. గోపి, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత బొల్లేపల్లి మధుసూదనరాజు, విశ్రాంత గ్రంథ పాలకులు రామకృష్ణ, నిర్వాహకుల చేతుల మీదుగా టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రశంసా పత్రాలను అందుకున్నారు. వేమన పద్య శతక గళార్చనలు ప్రతిభ కనబరిచిన టాలెంట్ స్కూల్ విద్యార్థులకు ఆ పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. అభినందన కార్యక్రమంలో యాజమాన్య బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆన్ లైన్ ట్రేడింగ్ పేరుతో ఘరానా మోసం

- ఖమ్మం కేంద్రంగా దళారుల దందా
- కోట్లల్లో మునిగిపోయామంటూ బాధితుల ఆందోళన

నవతెలంగాణ-ఖమ్మం


అమాయికుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకొని మోసాలకు పాల్పడుతున్నారు కొంత మంది కంత్రి గాళ్లు. ఖమ్మం జిల్లాలో భారీ స్కాం వెలుగులోకి వచ్చింది. మిడిల్ క్లాస్ అండ్ మాస్ పబ్లిక్‌ను టార్గెట్ చేసుకొని కోట్లల్లో నిందితులు దోచేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం అనంతసాగర్‌కు చెందిన గంటేల నవీన్, నజీర్, పాషా అనే ముగ్గురు వ్యక్తులు రియల్ ఎస్టేట్ కంపెనీ ప్రారంభించారు. ఆ తర్వాత మెటాఫ్లక్స్ పేరుతో ఆన్ లైన్ ట్రేడింగ్ బిజినెస్ పెడుతున్నామని ప్రజలను నమ్మించారు. దీని ప్రధాన కార్యాలయం దుబాయ్‌లో ఉందని నమ్మించారు. ఖమ్మంలోని ఓ చర్చి పాస్టర్ బాబు జంగాల ప్రకాష్ సాయంతో ప్రజలకు దగ్గర అయ్యారు. ఆయన సాయంతో పలు ప్రాంతాలకు చెందిన క్రిస్టియన్‌లను మెటా ఫ్లక్స్‌లో భాగస్వాములు చేశారు. కంపెనీ నిర్వాహకుడిగా చెప్పుకున్న నవీన్‌కు పాస్టర్ బాబు జంగాల ప్రకాష్ సమీప బంధువు కావడంతో వాళ్ల పని సులువు అయింది. ఇన్వెస్ట్ మెంట్ చేస్తే రోజూ 1 పర్సంట్ ప్రాఫిట్ వస్తుందని ప్రచారం చేశారు. నెలలో 20 రోజులు అమౌంట్ వస్తుందని నమ్మించారు. 1లక్ష రూపాయలు పెట్టుబడి పెడితే 10 నెలల్లో డబుల్ అమౌంట్ వస్తుందని చెప్పారు. కంటిన్యూగా పెట్టుబడి పెట్టిన వారికి దుబాయ్, గోవా ట్రిప్పులకు తీసుకెళ్తామని ఆఫర్లు చేశారు. దీంతో స్థానికులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఇన్వెస్ట్ చేయడమే తప్ప ఇన్‌కమ్ రావడంలో లేదని బాధితులు గ్రహించారు. దీనిపై మెటాఫ్లక్స్ నిర్వాహకులను ప్రశ్నిస్తే, క్వశ్చన్ చేస్తే రౌడీలతో బెదిరించారని బాధితులు చెబుతున్నారు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులను బాధితులు ఆశ్రయించగా మెటాఫ్లక్స్ నిర్వాహకుల మోసం బయటపడింది. ఏకంగా కోట్ల రూపాయలు దోచేశారని తేలింది. ఖమ్మం ఖానాపురం హవేలీ పోలీస్ స్టేషన్లో ఈనెల 14న భాస్కర్ అనే వ్యక్తి నవీన్, నజీర్‌లపై లిఖిత పూర్వక ఫిర్యాదు చేయడంతో ఖా నాపురం హవెల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

దివ్యాంగుల వ్యాపార నైపుణ్య శిక్షణ తరగతులు ప్రారంభం

- సంపాదించిన దానిలో సమాజ సేవకు ఖర్చు చేయాలి
- ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దోసపాటి చంద్రశేఖర్

నవతెలంగాణ-నేలకొండపల్లి

ప్రతి ఒక్కరూ తాము సంపాదించిన ఆదాయంలో కొంత సమాజ సేవకు ఖర్చుపెట్టినప్పుడే జీవితానికి సార్ధకత లభిస్తుందని ప్రముఖ వ్యాపారవేత్త ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు దోసపాటి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ(ఎం) కార్యాలయంలో దివ్యాంగుల ఆర్థిక బలోపేతానికి ఎస్బిఐ వారి సౌజన్యంతో ఆర్సిపి, అండ్ ఎస్ఆర్డిఎస్, టిడి జేఏసి సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడవ బ్యాచ్ దివ్యాంగుల వ్యాపార నైపుణ్య శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవయే మాధవ సేవగా భావించిన తాను దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం తాను సంపాదించిన దానిలో కొంత దివ్యాంగుల సేవకు వారు వ్యాపారంలో రాణించేందుకు తన తల్లిదండ్రుల పేరుమీద పదిమంది దివ్యాంగులకు వడ్డీ లేని రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి దివ్యాంగుడు ఉచితాల వైపు చూడకుండా కష్టపడి ఆత్మస్థైర్యంతో ఎదగాలన్నారు. అందుకే వడ్డీ లేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగులు ఏ సహాయం కోరిన వ్యక్తిగతంగాను, వాసవి క్లబ్ ద్వారా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. శిక్షణ తరగతుల ప్రారంభోత్సవ సభకు అధ్యక్షత వహించిన టిడి జేఏసీ చైర్మన్ పివీ చలమయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్క దివ్యాంగుడు ఎవరి దగ్గర చేయి సాచకుండా స్వశక్తిగా ఎదిగేందుకు సమాజంలో గౌరవంగా జీవించడానికి తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రముఖ విద్యావేత్త శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు వ్యాపార నైపుణ్య శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రజా నాయకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి కోసం ఎల్లవేళలా తమ వంతు కృషి చేస్తామన్నారు. ఎస్ఆర్డిఎస్ వ్యవస్థాపకులు గడ్డం రాంబాబు మాట్లాడుతూ నేలకొండపల్లిలోని దివ్యాంగులు వ్యాపార నైపుణ్య శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో రాణిస్తూ జిల్లాకే స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారన్నారు. నేలకొండపల్లి మండలం దివ్యాంగులకు ఆదర్శంగా ఉంటుందని, క్రమశిక్షణకు ఐక్యతకు మారుపేరుగా నిలుస్తుందన్నారు. నేలకొండపల్లి మండలంలోని దివ్యాంగులకు తాను ట్రైనింగ్ ఇవ్వడం ఎంతో ఆసక్తిగా, ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రైనర్ సాయి, 50 మంది దివ్యాంగులు పాల్గొన్నారు.



సీపీఐ(ఎం) నాయకుడు సత్యనారాయణరెడ్డికి పరామర్శ

నవతెలంగాణ- కూసుమంచి



మండలంలోని పాలేరు గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు యడవల్లి సత్యనారాయణరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు..విషయం తెలుసుకున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి తోటకూరి రాజు, పాలేరు మాజీ సర్పంచ్ యడవల్లి మంగమ్మ జిల్లా నాయకులు యడవల్లి రమణారెడ్డి, మండల కమిటీ సభ్యులు పందిరి వీరారెడ్డి, కర్ణబాబు, వీరభద్రారెడ్డి, మన్య, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

హై టెన్షన్ తీగల వద్ద మంటలు పెట్టవద్దు...

తహశీల్దార్ రాం ప్రసాద్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



హై టెన్షన్ తీగల వద్ద రైతు సోదరులు మంటలు పెట్టవద్దని ఖమ్మంరూరల్ తహసీల్దార్ పిల్లి రాంప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం రూరల్ మండలంలో పలు ప్రాంతాల్లో నుంచి హైటెన్షన్ తీగలు వెళ్తున్నాయని, ఆ తీగల కింద తీగల దగ్గరలో వరి, పత్తి, మిరప, కంది, చెరుకు తదితర పంటలను కోసిన తర్వాత మిగిలిన చెత్తను, వ్యర్థ పదార్థాలకు నిప్పు పెట్టడం వలన పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉన్నదని రాం ప్రసాద్ తెలిపారు. హై టెన్షన్ వైర్‌కు దగ్గరలో ఎటువంటి పంటలు, చెట్లు, మొక్కలు నాట రాదని విజ్ఞప్తి చేశారు. తీగల కింద వ్యవసాయ బావులు తవ్వడం, పొడవైన లోహపు పైపులు, లారీలు, ట్రాక్టర్లు, ఎద్దుల బండ్లు తీగల కింద నుంచి తీసుకపోవద్దని విజ్ఞప్తి చేశారు. మంటల వలన ప్రమాదం సంభవిస్తే ప్రభుత్వ రంగ ఆస్తులు నష్టపోవడమే కాకుండా భారీ స్థాయిలో ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని రైతు సోదరులు, వ్యవసాయ కూలీలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యుత్ ప్రవాహమునకు ఎటువంటి అంతరాయం ఏర్పడినా 08742-296822, 8333988856, 6300136282 నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

సింగరేణి దిగొచ్చే వరకు దీక్షలు ఆగవు

- అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బాధితులు
- 9వ రోజుకు చేరిన సైలో బంకరు బాధితుల దీక్షలు
- ఎన్నికల కోడ్ ముగిశాక ఉధృతం కానున్న ఆందోళనలు..?

నవతెలంగాణ-సత్తుపల్లి



ప్రాణాంతక కాలుష్యాన్ని వెదజల్లుతున్న సైలో బంకరును మనదగ్గర నుంచి తీసేసే వరకు దీక్షలు కొనసాగుతాయని కిష్టారంలోని అంబేద్కర్‌నగర్, బీసీ కాలనీ సైలో బంకరు బాధితులు స్పష్టం చేశారు. సైలో బంకరును తీసెయ్యాలని, అది జరగని యెడల పునరావాసమైనా ఇప్పించాలని కోరుతూ సైలో బంకరు కాలుష్య బాధితులు చేపట్టిన నిరవధిక దీక్షల కార్యక్రమం మంగళవారం నాటికి 9వ రోజుకు చేరింది. దీక్షలు ప్రారంభమై 9 రోజు దాటినా సింగరేణి సంస్థ పట్టించుకోక పోవడంతో దీక్షాపరులు ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటి వరకు శాంతియుతంగా, సామరస్యంగా జరుగుతున్న దీక్షల కార్యక్రమం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిశాక ఉధృతమయ్యే అవకాశాలు గోచరిస్తున్నాయి. సోమవారం దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపిన సీపీఐ(ఎం) జిల్లా నాయకుల సూచనల మేరకు మానవ హక్కుల కమిషన్, పొల్యూషన్ బోర్డు ఫిర్యాదులు చేయడంతో పాటు కలెక్టర్, డిప్యూటీ సీఎం, అవసరమైతే ముఖ్యమంత్రిని కలిసి తమ గోడును వెలిబుచ్చేందుకు బాధితులు సన్నద్ధమవుతున్నారు. ఈ కార్యక్రమంలో దీక్షల కమిటీ ముఖ్య బాధ్యులు పాలకుర్తి నాగేశ్వరరావు, పాలకుర్తి ప్రభుదాస్, కడారి మదీన, మారోజు నాగేశ్వరరావు, మారోజు శ్రీను, పాలకుర్తి రాజు, వాడపల్లి కోటేశ్వరరావు, కొండా నాగరత్నం, రామాల నాగమణి పాల్గొన్నారు.

దళితులకిచ్చిన హామీలను అమలు చేయాలి

- 23న జరిగే పాలేరు నియోజకవర్గ కెవిపిఎస్ సదస్సుకు జాన్ వెస్లీ రాక
- కెవిపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్

నవతెలంగాణ-ఖమ్మం

ఎన్నికల ముందు దళితులకిచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 23న ఉదయం 10 గంటలకు నాయుడుపేట చౌరస్తాలోని రామ్ లీలా ఫంక్షన్ హాల్‌లో జరిగే పాలేరు నియోజకవర్గ స్థాయి సదస్సుకు కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ హాజరు కానున్నారని, ఈ సదస్సులో దళితులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి నందిపాటి మనోహర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఖమ్మంలోని ఎన్నెస్పి క్యాంప్‌లోని ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు పాపిట్ల సత్యనారాయణ అధ్యక్షతన పాలేరు నియోజక వర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మనోహర్ మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 77 ఏళ్లు గడుస్తున్న నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు, హత్యలు, కుల వివక్ష దాడులు కొనసాగుతూ సామాజిక అణచివేతలకు గురవుతున్నాయని వారు పేర్కొన్నారు. పాలకుల చిత్తశుద్ధి లేకపోవడంతో నేటికీ దళిత వాడల అభివృద్ధికి ఏ మాత్రం నోచుకోవడం లేదని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన ఇందిరమ్మ అభయహస్తం 12 లక్షల రూపాయలను తక్షణమే ప్రతి దళిత కుటుంబానికి ఇవ్వాలని, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు ఇవ్వాలని కోరుతూ జరిగే పాలేరు నియోజక వర్గ స్థాయి సదస్సుకు పెద్ద సంఖ్యలో దళితులు పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. సమావేశంలో పాలేరు డివిజన్ నాయకులు బండి రమేష్, కొమ్ము శ్రీనివాస్, మహేందర్, పగిడిపల్లి వెంకట్రావు, సోమపంగు రాము, పొట్టపింజర స్టాలిన్, ఆరెంపుల ఉప్పలయ్య, సారయ్య, వరకుమార్ తదితరులు పాల్గొన్నారు.





సర్వజ్ఞ విద్యార్థులకి బంగారు పతకాలు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలోని వీడివోస్ కాలనీలో సర్వజ్ఞ పాఠశాలలో 2వ తరగతి చదువుతున్న విద్యార్థులు జి.కర్ణిక, జి.త్రినయన్ రోలర్ స్కేటింగ్ కాంపిటీషన్‌లో ప్రతిభను చాటుకున్నారని పాఠశాల డైరెక్టర్ ఆర్‌వి.నాగేంద్రకుమార్ తెలిపారు. తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ వారు హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ తెలంగాణ ర్యాంకింగ్ ఓపెన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్షిప్ 2024లో ఖమ్మం జిల్లా తరుపున సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు జి.కర్ణిక, జి.త్రినయన్ బంగారు, వెండి పతకాలు గెలుచుకున్నారని అన్నారు. స్కేటింగ్ కాంపిటీషన్‌లో బంగారు, వెండి పతకాలతో అద్భుతమైన విజయం సాధించిన తమ ప్రతిభావంతులైన క్రీడాకారులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వారి అంకితభావం, కృషి, క్రీడా స్ఫూర్తి మమ్మల్ని ఎంతగానో గర్వపడేలా చేశాయని అన్నారు. ఈ విజయాలు విద్యార్థుల నిబద్ధతకు తమ సిబ్బంది అందించిన అద్భుతమైన శిక్షణకు నిదర్శనమన్నారు. డైరెక్టర్ కే.నీలిమ మాట్లాడుతూ సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు చదువుల్లో, ఆటల్లో, క్రమశిక్షణలో అన్ని రంగాలలో విజయాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పవిత్ర, ఉపాధ్యాయులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రం పరిశీలన

నవతెలంగాణ - బోనకల్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బోనకల్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి కడారు విజయభాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ అనిశెట్టి పున్నం చందర్ మంగళవారం పరిశీలించారు. అదే విధంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయవలసిన వసతులను అందుకు అనుగుణంగా ఉన్న స్థలాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలోకి ఓటర్లు వెళ్లే మార్గాన్ని కూడా పరిశీలించారు. ఎన్నికల రోజు పోలింగ్ కేంద్రంలో ఏయే మౌలిక వసతులు ఏర్పాటు చేయాలనే దాని మీద కూడా పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేస్తున్నట్లు వారు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు, ఆటంకాలు ఎదురుకాకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. వారి వెంట గిర్దవర్ వన్ గుగులోతు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

మిర్చిబోర్డు ఏర్పాటు చేయాలి

- రైతు సంఘం, సీపీఐ ఆధ్వర్యంలో మిర్చిమార్కెట్‌లో ఆందోళన

నవతెలంగాణ-ఖమ్మంకార్పొరేషన్



పడిపోతున్న మిర్చిధరలను దృష్టిలో ఉంచుకొని తక్షణం మిర్చిబోర్డును ఏర్పాటు చేయాలని తెలంగాణా రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. గత ఏడాదితో పోల్చినప్పుడు ఈ ఏడాది సగానికి పడిపోయాయని, పెట్టుబడులు గత ఏడాదికంటే రెంటింపయ్యాయని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం, భారత కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఆందోళన నిర్వహించారు. మిర్చి కొనుగోళ్లను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. మిర్చిమార్కెట్ను ముట్టడించే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. రైతులకు పోలీసులకు మధ్య స్వల్ప తోపులాట జరిగింది. పెద్ద సంఖ్యలో రైతులు హాజరుకావడంతో విధిలేక పోలీసులు మార్కెట్లోకి అనుమతించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ యరగర్ల హన్మంతరావు ఆందోళనకారుల దగ్గరకు వచ్చి అధికారులు, వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేస్తామని ధర పెంపునకు సంబంధించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మెన్ మహ్మద్ మౌలాన, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దొండపాటి రమేష్, కొండపర్తి గోవిందరావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు యత్రాబాబు, జిల్లా కార్యవర్గసభ్యులు శింగునర్సింహారావు, పోటు కళావతి, మిడికంటి చిన్న వెంకటరెడ్డి, రావి శివరామకృష్ణ, జాగర్లమూడి రంజిత్, ఏపూరి రవీంద్రబాబు, మందడపు రాణి రైతు సంఘాల నాయకులు పుచ్చకాయల సుధాకర్ పాల్గొన్నారు.

పాలడుగు ప్రభుత్వ పాఠశాలకు సామగ్రి వితరణ

నవతెలంగాణ-వైరా



కొత్తగూడెంకు చెందిన సింగరేణి కాలరీస్ పద్మావతి ఫైవ్ ఇంక్లైన్ యూనియన్ ఖని ఏజెంట్ రవీందర్, మేనేజర్ శ్యాం ప్రసాద్, వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని పాలడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు ప్రోత్సాహకంగా రూ.50 వేల విలువైన వస్తు సామగ్రిని అందచేశారు. ఈ సందర్భంగా యూనియన్ వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ మాట్లాడుతూ సింగరేణి కాలరీస్ యూనియన్ లో సుమారు 1000 మంది సభ్యులు ఉన్నారని, ప్రతి ఒక్కరూ చెమటోడ్చి, భూగర్భ ఖనిలో పనిచేస్తూ మాకొచ్చే జీతం నుండి కొంత డబ్బు సేకరించి ప్రతి ఐదు నెలలకు ఒకసారి అనేక ప్రభుత్వ పాఠశాలలకు, చిన్నపిల్లలకు, బీద స్థితిలో ఉన్నవారికి యూనియన్ ద్వారా సహాయం చేస్తున్నామని అందులో భాగంగా పాలడుగు పాఠశాలను ఎంపిక చేసుకోవడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ శ్రద్ధగా చదువుకుని కార్పొరేట్ పాఠశాలకు దీటుగా ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై ఇమ్మానియేల్, ఎఐటియుసి ఫిట్ సెక్రటరీ హుమాయిన్, ఐఎన్టియుసి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సాంబమూర్తి, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ రాజయ్య, హెచ్‌ఎంఎస్ బ్రాంచ్ సెక్రటరీ హనీఫ్, కమిటీ సభ్యులు భూక్య రమేష్, కుర్రా రమేష్, దేవ్ సింగ్, కుమార కృష్ణ, చిట్టిబాబు, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర దేవాలయానికి మైకు యూనిట్ వితరణ

నవతెలంగాణ - బోనకల్



మండల పరిధిలోని ఆళ్లపాడు గ్రామంలోని సీతారామచంద్ర దేవాలయానికి ఆళ్లపాడు గ్రామానికి చెందిన మన తెలంగాణ దినపత్రిక విలేకరి పారా శ్రీనివాసరావు పదివేల రూపాయలు విలువ చేసే యాంపిల్ ప్లేయర్, మైక్ సెట్ మంగళవారం దేవాలయ నిర్వాహకులకు ఉచితంగా అందజేశారు. అదే విధంగా కర్నాటి అనిల్ 2500 రూపాయల విలువ కలిగిన రెండు మైకులను ఉచితంగా అందజేశారు. మైక్ యూనిట్ను పారా సంగయ్య రూ.1200, తోటకూర వెంకటేశ్వరరావు రూ.500 కలిపి మైక్ యూనిట్ కొనుగొలు చేసి అందజేశారు. సీతారామచంద్ర దేవాలయ అభివృద్ధికి సహకరించిన దాతలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ డైరెక్టర్ కందుల పాపారావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు దాత తోటకూర వెంకటేశ్వరరావు, ఆళ్లపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు బుంగ రాములు, సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య, షేక్ నాగులు మీరా, మంద రామారావు, గుడిద వెంకటేశ్వర్లు, మరీదు రాంబాబు, మల్లాది లింగయ్య, సురభి వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత సౌర విద్యుత్‌ని సద్వినియోగం చేసుకోవాలి

- వైరా విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ బండి శ్రీనివాసరావు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని రావినూతల గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులకు సౌర విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలను వైరా డిఈ బండి శ్రీనివాసరావు విద్యుత్ వినియోగదారులకు మంగళవారం వివరించారు. ఈ సందర్భంగా రావినూతల గ్రామంలో విద్యుత్ వినియోగ దారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బోనకల్ మండలంలోని ప్రతి ఒక్క గ్రామానికి, ప్రతి ఒక్క ఇంటికి, వ్యవసాయ మోటార్లకు ఉచిత సౌర విద్యుత్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యుత్ మీటర్ ఉన్న ప్రతి ఒక్కరు వ్యవసాయం మోటర్ ఉన్న ప్రతి ఒక్కరు తమ ఆధార్ కార్డులు, ఫోన్ నెంబరు, కరెంట్ బిల్లు, వ్యవసాయ మోటార్ బిల్లు, వ్యవసాయం భూమి సర్వే నెంబరు, విద్యుత్ శాఖ వారు వచ్చినప్పుడు చూపించాలని కోరారు. కార్యక్రమంలో వైరా అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ కిరణ్ కుమార్ బోనకల్ విద్యుత్ శాఖ ఏఈ తోకల మనోహర్, లైన్స్పెక్టర్‌లు జి.నరసింహారెడ్డి, పుట్టా రవి కిరణ్, అక్కిసెట్టి వెంకటేశ్వర్లు, లైన్మెన్లు ఎండి జమీర్ పాషా, కే.నాగరాజు, అసిస్టెంట్ లైన్మెన్లు పాత కోటి అర్జున్, పసుపులేటి రమేష్, ముత్తినేని క్రాంతి కుమార్, అనిమల్స్ పోతురాజు తిరుపతిరావు, నంద్రు సురేష్ బాబు, తగరం రమేష్, గ్రామస్తులు వట్టికొండ రామకృష్ణ, కొమ్మినేని ఉపేంద్ర, బోయినపల్లి రామయ్య, టేక్ జానీ, ఎర్రగాని నాగేశ్వరరావు, మరీదు పుల్లయ్య పాల్గొన్నారు.

తూతూమంత్రంగా సామాజిక ప్రజావేదిక

నవతెలంగాణ-ముదిగొండ



మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) పనులపై మంగళవారం ముదిగొండ స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన సామాజిక ప్రజావేదిక తూతుమంత్రంగా కొనసాగింది. అధికారుల హడావుడి తప్ప ప్రజా వేదిక లక్ష్యం పక్కదారి పట్టింది. 25 గ్రామపంచాయతీలలో 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు 3 కోట్ల 85 లక్షల ఈజీఎస్ పనులు జరగగా సామాజిక తనిఖీ నిర్వహించి కేవలం రూ.11వేలు అధికారులు దిద్దుబాటు చర్యలంటూ రికవరీ చూపించటం గమనార్హం. ఈజీఎస్ పనుల్లో లక్షల్లో అవకతవకలు జరిగాయని ఉపాధి కూలీల నుండి విమర్శలు వినిపిస్తున్నాయి. ఈజీఎస్ అధికారులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయితీ కార్యదర్శులు సామాజిక తనిఖీ బృందంతో అవగాహన ఏర్పరచుకొని గోల్ మాల్ అయిన ఈజీఎస్ నిధులను బయటికి పోక్కకుండా ఆడిట్ బృందాన్ని మామూళ్లగా చేశారని ఆరోపణలున్నాయి. ఈ ప్రజావేదికలో డీఆర్డిఏ అదనపు పీడీ చుంచు శ్రీనివాసరావు, ఏపీడి శ్రీదేవి, ఆడిట్ అధికారి పవన్, ఏపీఓ అడపాల రంగనాయకమ్మ, అంబుడ్సమాన్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

గురుకుల అధ్యాపకురాలు శశికళకు డాక్టరేట్

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



మండలంలోని మద్దులపల్లి పంచాయతీ పరిధిలోని కోదాడ క్రాస్ రోడ్డు వద్ద గల తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల నందు ఆంగ్ల అధ్యాపకురాలుగా పనిచేస్తున్న బూడిపాటి యస్.శశికళకు కాకతీయ యూనివర్సిటీలో ఆంగ్ల విభాగంలో ఆర్టిక్యూలేటింగ్ డిస్సెంట్ ఏ స్టడీ ఆఫ్ దళిత్ నవల్స్ ఇన్ ఇంగ్లీష్ ట్రాన్స్ లేషన్ అనే అంశంపై పీహెచ్డీ చేశారు. ప్రొఫెసర్ కె.పురుషోత్తం పర్యవేక్షణలో పీహెచ్డీ పూర్తి చేసి డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శ్రీనివాసశర్మ, అధ్యాపకులు శశికళను సోమవారం ఘనంగా అభినందించారు. జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, విద్యార్థినీ, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

'అటానమస్' కళాశాలగా 'సాయిస్ఫూర్తి'కి గుర్తింపు

- ప్రకటించిన యూజీసీ/జేఎన్‌టీయూహెచ్
- వసతులు, సామర్థ్యం, బెస్ట్ ఫ్యాకల్టీ కల్పనతోనే
- కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి
- అభినందనలు తెలిపిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి

నవతెలంగాణ-సత్తుపల్లి





సత్తుపల్లి మండలం గంగారం సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాల స్వయం ప్రతిపత్తి కళాశాలగా (అటానమస్) యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్/జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (యూజీసీ/జేఎన్‌టీయూహెచ్) నుంచి గుర్తింపు లభించింది. కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడంపై మంగళవారం ఆ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ దాసరి ప్రభాకరరెడ్డి వివిధ ఇంజినీరింగ్ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు ఉన్న సామర్థ్యత, ఆధునిక మౌలిక వసతులు, అనుభవం కలిగిన అధ్యాపకుల కృషి ద్వారానే కళాశాలకు ప్రతిష్టాత్మక అటానమస్ గుర్తింపు లభించిందని ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడం ద్వారా మారుతున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా పాఠ్యాంశాలు, కోర్సులను మార్చుకొనే అవకాశం ఉంటుందన్నారు. అటానమస్ కళాశాలగా గుర్తింపు వచ్చిన నేపథ్యంలో తమకు మరింత బాధ్యత పెరిగిందన్నారు. మేక్ ఇన్ ఇండియా నినాదంతో తమ కళాశాల ద్వారా సరికొత్త ఉద్పాదనలు తయారుచేసే స్థాయికి విద్యార్థులకు సాయిస్ఫూర్తి కళాశాల తోడ్పాటును అందించడం జరుగుతుందన్నారు.

అభినందనలు తెలిపిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి

సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడంపై ఆ కళాశాల చైర్మెన్, హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారధిరెడ్డి, విపాసన ఎడ్యుకేషనల్ ట్రస్ట్ బండి అన్విద వర్చువల్‌గా కళాశాలకు చెందిన అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

సాంకేతిక విజ్ఞానం, పరిశ్రమలతో సంబంధాలు పెంపొందుతాయి: ప్రిన్సిపాల్ వీఎస్ఆర్ కుమారి

కళాశాలకు అటానమస్ గుర్తింపు రావడం ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక విజ్ఞానాన్ని మెరుగు పర్చుకోవడంతో పాటు పరిశ్రమలతో సత్సంబంధాలు పెంపొందుతాయని కళాశాల ప్రిన్సిపాల్ ఊటుకూరి శేషారత్నకుమారి అన్నారు. విద్యార్థుల ఆకాంక్షలకు అనుగుణంగా విద్యా విధానంలో మార్పులు చేసుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. సొంతంగా పరీక్షల నిర్వహణ చేసుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ డీఎస్వీ కృష్ణారెడ్డి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

చెడును వీడి 'ఖుర్ఆన్' మార్గంలో పయనించాలి

- జేఐహెచ్ మహిళా విభాగం అధ్యక్షురాలు దౌలతున్నీసాబేగం
- సంప్రదాయం, దానధర్మాలు చేయడం అభినందనీయం
- సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి
- రంజాన్ మాస స్వాగత కార్యక్రమం

నవతెలంగాణ-సత్తుపల్లి



సకల చెడులకు దూరంగా ఖుర్ఆన్ చూపిన మార్గంలో ముస్లిం సమాజం పయనించాలని జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సత్తుపల్లి అధ్యక్షురాలు దౌలతున్నీసాబేగం అన్నారు. రంజాన్ మాస రానున్న సందర్భంగా స్థానిక లక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాలులో మంగళవారం జరిగిన రంజాన్ మాసం-స్వాగతం అంశంపై ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. మంచిని, మానవత్వాన్ని పెంచి సమాజంలో శాంతి సామరస్యాన్ని పెంచే రంజాన్ మాసానికి మనమందరం ఘనంగా స్వాగతం పలకాలన్నారు. మరణాంతరం శాశ్వత స్వర్గం పొందడానికి రంజాన్ మాస ఉపవాసాలు తప్పని సరిగా పాటించాలన్నారు. మానవాళి సృష్టికర్త అయిన దేవుడు ఒక్కడేనని, పుట్టిన ప్రతి జీవికి మరణం అనేది తథ్యమన్నారు. చావు పుట్టుకల నడుమ జీవిత మార్గాన్ని ఆమె వివరించారు.

ముస్లింల సంప్రదాయం, దానధర్మాలు అభినందనీయం: ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్

ముస్లింల సంప్రదాయం, రంజాన్ మాసం సందర్భంగా ప్రతిఒక్క ముస్లిం దానధర్మాలు చేయడం అభినందనీయమన్నారు. ముస్లిం అంటేనే శాంతిని నెలకొల్పేవారని అంటారని ఎమ్మెల్యే అన్నారు. సభలో పాల్గొన్న ముస్లిం మహిళలందరికి ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. జేఐహెచ్ రాష్ట్ర కార్యదర్శి ఇస్రత్‌భాను సాహెబా మాట్లాడుతూ రానున్న రంజాన్ మాసంలో శాంతి సౌభ్రాతృత్వం పెంచి మానవులంతా కలిసిమెలిసి జీవించేలా ఆ పైవాడు దీవించాలని కోరారు. కార్యక్రమంలో జేఐహెచ్ జిల్లా అధ్యక్షురాలు అస్మా అంజుమ్ సాహెబా, ఫౌజియా బేగం, రీనా, మోతీ సాహెబ్, పర్వీన్ సాహెబా పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | ఫిబ్రవరి 19, 2025 | www.navatelangana.com



మిర్చి క్వింటాలకు రూ.25 వేలు మద్దతు ధర ఇవ్వాలి

- కొత్తగూడెం కేంద్రంగా మార్కెట్ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి
- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

నవతెలంగాణ-పాల్వంచ రూరల్

మిర్చి ధర రోజు రోజుకి పడిపోతున్న నేపథ్యంలో కింటా మిర్చి రూ.25 వేలు మద్దతు ధర నిర్ణయించాలని, అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మార్కెట్ లేకపోవడం వల్ల మిర్చి రైతులు తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నారని, కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం అల్లూరి సెంటర్లో మంచి కంటి భవన్లో జరిగిన పాల్వంచ మండల తెలంగాణ రైతు సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మిర్చి సాగుకి ఎకరానికి రెండు లక్షల పైన ఖర్చు వస్తుందని, నేడు మిర్చికి క్వింటా రూ.12, 13 వేలకి పడిపోవటం వల్ల మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు. మిర్చి రైతులు అప్పుల నుంచి బయట పడాలంటే నేడు రూ.25వేల క్వింటా ధర ప్రభుత్వ నిర్ణయిస్తే తప్ప పరిష్కారం లేదని ఆయన చెప్పారు. గతంలో రూ.26 వేలు కూడా మిర్చి క్వింటా అమ్మిందని, నేడు సగానికి పడిపోవడం వల్ల రైతాంగం ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతుందన్నారు. జిల్లాలో 30 వేల ఎకరాల్లో మిర్చి సాగు అవుతుందన్నారు. సాగైనా మిర్చీని అమ్ముకోవడానికి మార్కెట్ లేకపోవడం వల్ల రైతులు ఖమ్మం, వరంగల్ లాంటి మార్కెట్లకి వెళ్ళటానికి వేలాది రూపాయలు ట్రాన్స్పోర్ట్ ఖర్చు అవుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కొండబోయిన వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పాకల వెంకట్రావు, భూక్యా లాలు, వినోద, అచ్చయ్య, సైదులు, శ్రీను, దేవా తదితరులు పాల్గొన్నారు.



బూర్గంపాడు : మిర్చి పంటకు గిట్టుబాటు ధరను ప్రభుత్వం కల్పించాలని సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. క్వింట మిర్చి కనీసం మద్దతు ధర రూ.25000 వేలు ఉండాలని ఆయన అన్నారు. ఈ రేటు రాకపోతే రైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాదని, ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి పెట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. రైతులు మద్దతు ధర వచ్చే అంతవరకూ మిర్చి రైతులు ఆందోళన పోరాటంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

మున్సిపాలిటీ భౌగోళిక, సామాజిక ముఖ చిత్రానికి రూపం

- పలు సూచనలు చేసిన కమిషనర్ సుజాత



నవతెలంగాణ-అశ్వారావుపేట

అశ్వారావుపేట మున్సిపాల్టీ సామాజిక, భౌగోళిక ముఖ చిత్రానికి (మ్యాప్) రూపకల్పన కార్యాచరణ ముమ్మరంగా సాగుతుంది. ఈ మేరకు మంగళవారం నమూనా పటాన్ని టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాసరావు, కమిషనర్ సుజాతకు చూపించారు. ఆమె పలు కీలక సూచనలు చేసారు. 2011 జనాభా లెక్కల ప్రకారం 31,696 జనాభాతో, 2025 జనవరి 1 వరకు ఓటర్లు తుది జాబితా ప్రకారం 22 వార్డులు, 16 పోలింగ్ స్టేషన్‌లు, 17039 ఓటర్లుగా రూపొందించారు. ప్రతిపాదిత 22 వార్డులకు గాను సరాసరి జనాభా 1441, ఓటర్లు 778లు విభజించారు. ఈ లెక్కలు ప్రకారం మున్సిపాల్టీ ముఖచిత్రం (మ్యాప్) రూపొందనుందని కమిషనర్ సుజాత హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సీసీ చావా రవి, కార్యదర్శులు కోటమర్తి శ్రీరామమూర్తి, బంగారు సందీప్, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాలు భవిష్యత్ లక్ష్యాలకు మార్గదర్శకాలు

- పరీక్షలంటే భయపడొద్దు
- జిల్లాలో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలి
- కలెక్టర్ జితేష్ వి.పాటిల్

నవతెలంగాణ-కొత్తగూడెం




పదవ తరగతి ఫలితాలు విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలు సాధించడానికి మార్గదర్శకాలని, పరీక్షాలంటే భయ పడవద్దు అని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మంగళవారం కొత్తగూడెం పట్టణంలోని అంబేద్కర్ భవన్ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు ప్రేరణ, శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. పదవ తరగతి ఫలితాల్లో ఎన్ని మార్కులు వస్తాయి అని విద్యార్థులు ఆలోచించకుండా వారి భవిష్యత్తు లక్ష్యాలను చేరుకోవడానికి కష్టపడి చదవాలన్నారు. కేవలం పదవ తరగతి మాత్రమే ప్రామాణికంగా తీసుకోరాదని, పదవ తరగతి అనేది ఒక మెట్టు మాత్రమే అని తర్వాత అనేక కోర్సులు చేయాలన్నారు. నిరంతరం కష్టపడుతూ ఉంటే లక్ష్యాలను సాధించుకోవచ్చని తెలిపారు. తాను కూడా విద్యార్థి దశలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నానని, పదవ తరగతి చదువుకునేటప్పుడు ఒక మంచి ఇంజనీర్ అవుదామని అనుకున్నాను, తర్వాత నా లక్ష్యాలను మార్చుకొని పట్టుదలతో చదివి ఐఏఎస్ సాధించానని తన అనుభవాన్ని విద్యార్థులతో కలెక్టర్ పంచుకున్నారు. విద్యార్థులు ఒక మంచి జీవితం కోసం ప్రేరణ కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు అన్ని రకాల పుస్తకాలు, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ హవర్స్, ప్రతిభావంతులైన ఉపాధ్యాయులను నియమించి నిపుణులతో ప్రేరణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. పరీక్షలకు కొన్ని రోజులే సమయం ఉన్నందున సమయాన్ని వృధా చేయవద్దన్నారు. విద్యార్థులు టీవీ, ఫోన్, సోషల్ మీడియా లాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులు పై ప్రత్యేక దృష్టి సాధించాలని, హాస్టల్లో విద్యార్థులను హాస్టల్ వార్డెన్లు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించి జిల్లాలో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా శిక్షణ అందించాలని కలెక్టర్ అన్నారు. అనంతరం విద్యాశాఖ రిసోర్స్ పర్సన్‌లు సైదులు, నాగరాజు శేఖర్, నాగరాజు, విజయ భాస్కర్, శ్యాం చందర్ రావు లు విద్యార్థులకు శిక్షణ తరగతుల్లో వివిధ సబ్జెక్టుల్లో మెలకువలు నేర్పారు.

ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారిని అనసూయ, ఏఎస్‌డబ్ల్యూఓలు హనుమంతరావు, సునీత, హెచ్‌డబ్ల్యూఓలు గజ్వేల్ శ్రీనివాస్, పద్మావతి, శశిరేఖ, కౌసల్య, రామ నరసయ్య, స్వప్న, నరసింహారావు, పార్వతి శశికళ, హేమంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం ప్రయాణం ప్రశ్నార్థకం

- కుంగిన హై లెవెల్ వంతెనలు • ప్రారంభం కాని బ్రిడ్జిల పనులు • వరదల కాలంలో ప్రయాణం ప్రాణ సంకటం

నవతెలంగాణ-చర్ల



ఈ ఏడాది వర్షాకాలంలో చర్ల నుండి భద్రాచలం వెళ్లాలన్న, చర్ల నుండి వరంగల్, హైదరాబాదు వంటి పట్టణాలకు వెంకటాపురం రోడ్డులో చేరుకోవాలన్నా ప్రయాణం ప్రశ్నార్థకమని పలువురు వాపోతున్నారు. సుమారు 30 సంవత్సరాల క్రితం ములుగు జిల్లా వెంకటాపురం మండలం ఏకన్న గూడెం ఎదురుగుట్టల మధ్యలో రాళ్లవాగుపై నిర్మించిన హై లెవెల్ వంతెన రెండు చోట్ల కుంగడంతో అటుగా ప్రయాణం చేసే ప్రయాణికులు ఇప్పటికే నానా అవస్థలు పడుతున్నారు. 30 ఏళ్ల క్రితం తిరిగే వాహనాల సామర్థ్యాన్ని అనుసరించి నిర్మించిన బ్రిడ్జి పై నుండి ఓవర్ లోడ్ ఇసుక లారీలు తిరగడం వలన నిక్షేపంలా ఉన్న బ్రిడ్జి కాస్త రెండు చోట్ల కుంగిపోయి అత్యంత ప్రమాదకరంగా మారిది. ఈ ప్రాంత ప్రభుత్వ అధికారులు రహదారి మళ్లించి రాళ్ల వాగులో నుంచి ప్రస్తుతం తాత్కాలికంగా ప్రయాణం సాగే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే రాళ్ల వాగు వద్దకు బస్సు చేరుకున్నాక ప్రయాణికులను కిందకి దింపి వాగు దాటాక ప్రయాణికులను బస్సులోకి ఎక్కించుకోవడం జరుగుతుంది. ఈ నాలుగు మాసాలు పూర్తయి వర్షాలు పడ్డాక ప్రయాణం ప్రస్తుతార్థకంగా మారుతుందని, నిత్యం ఆ దారి వెంట తిరిగే ప్రయాణికులు పెదవిరుస్తున్నారు. చర్ల నుంచి వెంకటాపురం వెళ్లడానికి సుమారుగా 50 నిమిషాలు పట్టవలసి ఉండగా ప్రస్తుత పరిస్థితుల్లో గంటన్నర నుండి రెండు గంటల వ్యవధి పట్టడంతో అటుగా వెళ్లే ప్రయాణికులు, ఉద్యోగస్తులు నానా అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే దుమ్ముగూడెం మండలం తూరుబాక సమీపంలో కల్వర్టు సైతం కుంగిపోవడంతో రహదారి మళ్లించవలసి వచ్చింది. ఇక్కడ సైతం వర్షాకాలంలో ప్రయాణం ప్రాణ సంకటంగా మారుతుందని పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. కొద్దిపాటి వర్షానికి రెండు చోట్ల కూడా వాహనాలు తిరిగే పరిస్థితి ఉండకపోవడం జరుగుతుందని ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి ముందుచూపుతో రెండు బ్రిడ్జిల నిర్మాణం చేపట్టకపోతే నిండు వర్షాకాలంలో ప్రాణం పోయినా ప్రయాణం సాగని దుస్థితి నెలకొంటుందని ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందుతున్నారు.



కుంగిన బ్రిడ్జిలను తొలగించి నూతన వంతెనలు నిర్మించకపోతే వర్షాకాలంలో ప్రయాణాలు అత్యంత దారుణంగా ఉంటాయని విద్య, వైద్యం కొనసాగే పరిస్థితి ఉండదని ప్రజలు మండిపడుతున్నారు. ఇకనైనా భద్రాచలం ఐటీడీఏ పీవో, కలెక్టర్ ఈ వంతెనలపై దృష్టి సారించి టెండర్లు పిలిచి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఐటీఐ విద్యార్థులను కూలీలుగా మారుస్తున్న సింగరేణి

- గాడి తప్పుతున్న అప్రెంటిషిప్ వ్యవస్థ

నవతెలంగాణ-మణుగూరు



సింగరేణి విస్తరణ వలన భూములు కోల్పోయిన నిర్వాసితులు కుటుంబాల ఐటీఐ విద్యార్థులు, పాలకుల అవలంబిస్తున్న విధానాల వలన కుటుంబ ఆర్థిక వ్యవస్థ చిద్రమై పోతుంది. ఆర్థిక బాధలు ఒకవైపు, రోగాలు, రొప్పులు కుటుంబ వ్యవస్థ బతకడమే భారమవుతున్న ఈ రోజుల్లో ఉన్నత చదువులు చదవలేక ఆశల్ని చంపుకొని తక్కువ కాలంలో కుటుంబానికి, తల్లిదండ్రులకు ఆర్థికంగా అండగా ఉండి బతకడం కోసం ఐటీఐ ప్రత్యామ్నాయ మార్గంగా యువత ముందుకు సాగుతున్న తరుణంలో సింగరేణిలో అప్రెంటిసిప్ వ్యవస్థ గాడి తప్పుతున్నది. అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ సింగరేణిలో అప్రెంటిస్షిప్ వ్యవస్థ పేరుతో కూలీలుగా మారుస్తున్నారు. అయితే ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు ట్రైనింగ్ నేర్పించేందుకు ఒక టెక్నీషియన్నే అటాచ్ చేస్తారు. వారి ద్వారా తమ నైపుణ్యాన్ని పెంపొందించుకొని ప్రభుత్వ ఉద్యోగాలను మరి ప్రభుత్వ కంపెనీలలో పనిచేసే అవకాశాలు వస్తూ ఉంటాయి. కానీ దానికి భిన్నంగా సింగరేణిలో అప్రెంటిషిప్ చేస్తే విద్యార్థులను హమాలీ కూలీల కన్నా అధ్వాన్నంగా చూస్తున్నారు. ఏ పనైనా సరే చేపిస్తున్నారు. అసలు చదువుకున్న దానికి ఇక్కడ అప్రెంటిస్షిప్‌కి సంబంధమే లేదు. శుక్రవారం అప్రెంటిస్ నేర్చుకునే విద్యార్థులు హమాలీ పని చేశారు. సిమెంట్ బస్తాలు, లారీల నుండి గోడౌనుకు డౌన్లోడ్ చేయించారు. సేఫ్టీ డిపార్ట్మెంట్‌కు అప్రెంటిస్ విద్యార్థులకు సంబంధమే లేదు. కూలీలు రాకపోతే గోడలు కట్టిస్తున్నారు. బురద ఎత్తిస్తున్నారు. సింగరేణిలో టెక్నీషియన్ ట్రైనింగ్ కాలంలో స్టైఫండ్ అవకాశం ఉన్నది. కేంద్ర ప్రభుత్వం 4000 సదరు, కంపెనీ 4500 మొత్తం 8500 చెల్లించాల్సి ఉంటుంది. స్టైఫండ్ రెగ్యులర్గా ఇవ్వాల్సి ఉంటుంది. ఆరు నెలలకు ఒకసారి కూడా ఇవ్వడం లేదు. సింగరేణిలో అప్రెంటిషిప్ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన అప్రెంటిషిప్ చేయించాలని, రెగ్యులర్గా స్టైఫాయిడ్ ఇప్పించాలని, కార్మికులు కార్మిక సంఘాల నాయకులు హెచ్చరిస్తున్నారు.

విద్యార్థి ఆత్మహత్య

- ఆలస్యంగా వెలుగులోకి..

నవతెలంగాణ-కొత్తగూడెం

ఒకే పాఠశాలలో చదువుతున్న (15) ఏండ్ల లోపు బాలిక, బాలుడు మధ్య ఏర్పడ పరిచయం, ఫోన్ చాటింగ్ వరకు వెళ్లింది. ఇది గమనించిన బాలిక తండ్రి బాలుడిని హెచ్చరించిన కారణంలో బాలుడు భయాందోళనకు గురై పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రచారం సాగుతున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి మండలంలోని చుంచుపల్లి తండాలో ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. కొత్తగూడెం రైటర్స్ బస్తీ, చుంచుపల్లి పాఠశాలలో ఓకే స్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న బాలికతో చాటింగ్ చేసిన తొమ్మిదో తరగతి విద్యార్థి, కుటుంబ సభ్యుల బెదిరింపులతో భయపడిపోయి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబసభ్యులు బావురు మంటున్నారు. ఏర్పడ్డ పరిచయం కారణంగా ఇద్దరి మధ్య టెలిఫోన్ చాటింగ్ ప్రారంభమైంది. ఇది పెద్దలకు తెలియడంతో బాలిక తండ్రి బాలుడిని ఫోను ద్వారా మందలించడం జరిగిందని సమాచారం. దీని తీవ్రంగా పరిగణించిన బాలుడు శనివారం గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం గుర్తించిన కుటుంబసభ్యులు అతన్ని వెంటనే ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం బాలుడు (15) మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కోల్ ఇండియా మహిళా అథ్లెటిక్స్ పోటీలు

- ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- విలేకరుల సమావేశంలో సింగరేణి జీఎం పర్సనల్ అండ్ వెల్ఫేర్ కవిత నాయుడు

నవతెలంగాణ-కొత్తగూడెం



సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ క్రీడా పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుందని ఈ నెల 22, 23 తేదీల్లో కొత్తగూడెం ప్రకాశం స్టేడియం వేదిక కానున్నట్లు సింగరేణి జీఎం పర్సనల్ అండ్ వెల్ఫేర్, ఐఆర్ కవితా నాయుడు వెల్లడించారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి ఏడాది దేశంలోని బొగ్గు ఉత్పత్తి సంస్థలు ఈ కోల్ ఇండియా క్రీడల్లో పాల్గొంటాయని తెలిపారు. కోల్ ఇండియా స్థాయిలో నిర్ణయించిన ప్రకారం సింగరేణి సంస్థకు ఈ సారి పురుష, మహిళ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణకు అవకాశం లభించిందని తెలిపారు. కోల్ ఇండియా స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు సింగరేణి సంస్థ అన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దేశంలోని 10 రాష్ట్రాలకు చెందిన బీసీసీఎల్, సీఐఎల్, సీసీఎల్, సిఎంపిడిఐ, ఇసీఎల్, ఎన్‌సీఎల్, ఎస్ఇసీఎల్, ఎంసీఎల్, డబ్ల్యూసీఎల్, ఎస్సీసీఎల్ బొగ్గురంగ సంస్థల క్రీడాకారులు పాల్గొంటున్నారని వెల్లడించారు. క్రీడాకారులకు అన్ని రకాల వసతి, భోజన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఆయా రాష్ట్రాల క్రీడాకారుల ఆహారపు అలవాట్లకు అనుగుణంగా వారికి భోజనం, అల్పాహారం ఏర్పాటు చేస్తున్నామన్నారు. పట్టణంలోని వివిధ హోటల్లు, సింగరేణి గెస్ట్ హౌస్లలో క్రీడాకారులకు వసతి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో సుమారు 320 మంది అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొంటారన్నారు. ఈనెల 22వ తేదీన జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని సింగరేణి ఈఎంఎం డైరెక్టర్ సత్యనారాయణ ప్రారంభిస్తారని, 23వ తేదీన జరిగే క్రీడల ముగింపు కార్యక్రమంలో సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.బలరాం పాల్గొని క్రీడాకారులకు బహుమతులు అందజేస్తారని తెలిపారు. మొత్తంగా 38 ఈవెంట్లతో అథ్లెటిక్స్ పోటీలను కట్టు దిట్టమైన ఏర్పాట్ల మధ్య నిర్వహించేందుకు సింగరేణి యాజమాన్యం చర్యలు తీసుకుంటుందని వివరించారు. ఈ విలేకర్ల సమావేశంలో వివైజీఎర్ వెల్ఫేర్ జి.రాజేంద్రప్రసాద్, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ హైస్కూల్లో స్థానిక సమస్యలు పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రూ.20లకు డైట్ చార్జీలు పెంచాలని, పేరుకు పోయిన సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బయ్యా అభిమన్యు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు మంద నాగకృష్ణ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యకర్తల సమావేశంలో అభిమన్యు మాట్లాడుతూ ప్రభుత్వ హైస్కూల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు డైట్ చార్జీలు కేవలం రోజుకి రూ.8లు మాత్రమే ఇస్తున్నారు. వీటివలన విద్యార్థులకు ఏమాత్రం నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. కావునా విద్యార్థులు శారీరకంగా ఎదిగే దశలో ఉన్నటువంటి విద్యార్థులకు సరైన పౌష్టికమైన విలువలు కలిగినటువంటి ఆహారం అందించకుండా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. ఖాళీగా ఉన్నటువంటి ఉపాధ్యాయుల పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం పూట స్టడీ అవర్స్ సందర్భంగా స్నాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రామ్ చరణ్, అఖిల్, సాయి జిల్లా కమిటీ సభ్యులు వంక అఖిల్, పి.పవన్, ఉదయ్ పాల్గొన్నారు.

నేడు కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌పై నిరసనలు

నవతెలంగాణ-ఇల్లందు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్పొరేట్ అనుకూలంగా, కార్మిక, కర్షక, పేద ప్రజల వ్యతిరేక బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 19న వామపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని వామపక్షాల నేతలు పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేవరకొండ శంకర్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఆలేటి కిరణ్, న్యూ డెమోక్రసీ పట్టణ కార్యదర్శి ఎండి.రాసుద్దిన్, మాస్ లైన్ జిల్లా నాయకులు నాయిని రాజు తదితరులు మంగళవారం ఇల్లెందు న్యూ డెమోక్రసీ కార్యాలయంలో నిర్వహించిన వామపక్షాల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, భీమా రంగంలో 100% ఎఫ్డిఐ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంనకు 50% నిధులు కేటాయింపులు పెంచి పట్టణాలకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వైద్య, విద్యా రంగాలకు జీడీపీ 3 శాతం చొప్పున కేటాయించాలని, ఎస్సీ, ఎస్టీ రంగాలకు మహిళ, శిశుసంక్షేమ కేటాయింపులు పెంచాలని వారు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ పట్టణ నాయకులు డి.మోహన్ రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బంధం నాగయ్య, సీపీఐ(ఎం) పట్టణ నాయకులు తాళ్లూరి కృష్ణ, వజ్జ సురేష్, ఎం.మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

డబుల్ అమౌంట్ చెల్లించాలి

- టీఎస్ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ డిమాండ్

నవతెలంగాణ-ఇల్లందు





టీఎస్ ఆర్టీసీ కార్మికులకు, ఉద్యోగులకు పవర్ శిక్షణకు స్పెషల్ అఫ్లో క్లాసులకు హాజరు అయ్యేవారికి ఆరోజును డబల్ డ్యూటీగా పరిగణించి వారికి డబుల్ డ్యూటీ అమౌంట్ చెల్లించాలని టీఎస్ఆర్టీసీ ఎస్ డబ్ల్యూఎఫ్ ఇల్లందు డిపో కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐవి, జేవి చారి మాట్లాడారు. కార్మికులు, ఉద్యోగులకు 'పవర్ శిక్షణ' పేరుతో వివిధ అంశాల పై ఒక్కరోజు శిక్షణ ఇవ్వాలని యాజమాన్యం నిర్ణయం చేసిందన్నారు. కార్మికులకు శిక్షణ ఇవ్వడం పట్ల వ్యతిరేకంగా లేమని, శిక్షణ ఇచ్చే అంశాలు కార్మికుల నైపుణ్యాలు పెంచే విధంగా ఉండాలన్నారు. స్పెషల్ అఫ్/ఆఫ్‌లలో కూడా కార్మికులు యాజమాన్యం నిర్వహించే క్లాస్‌లకు హాజరు కావాలని, అందుకు గాను రూ.200 మాత్రమే ఇస్తామని నోటీసు బోర్డులు వేయడాన్ని కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. వర్కర్స్‌ను బలవంత పెట్టవద్దని, కుటుంబ అవసరం ఉందన్న వారిని మినహాయించాలని డిమాండ్ చేస్తుదన్నారు.

ఆకట్టుకునేలా గ్రంథాలయ అధునాతన భవనం

- విశ్రాంత ఉద్యోగులుగా తమ వంతు సహకారం అందిస్తాం

నవతెలంగాణ-కొత్తగూడెం

గ్రంథాలయం కోసం ఏర్పాటు చేసిన నూతన భవనం కార్పొరేట్ స్థాయిలో ఆకట్టుకునేలా ఉందని విద్యానగర్ కాలనీ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కొల్లు నాగేశ్వరరావు, కార్యదర్శి సురేష్ కుమార్ అన్నారు. మంగళవారం కొత్తగూడెంలోని నూతన గ్రంథాలయ భవనాన్ని సందర్శించిన వారు అందుబాటులోనికి తెచ్చిన సదుపాయాలు సౌకర్యాలపై స్పందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా కార్పొరేట్ స్థాయిలో చక్కటి వాతావరణం ఆహ్లాదకరమైన పరిస్థితుల్లో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ నూతన భవనంలోని ఏర్పాట్లు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయని తెలిపారు. పాఠకులకు చదువుకునేందుకు అన్ని రకాల పుస్తకాలను అందుబాటులోకి తేవడం గమనార్హం అని చెప్పారు. గ్రంథ పాలకురాలుగా పనిచేస్తున్న మణి మృధుల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి అనునిత్యం అందుబాటులో ఉంటూ సహకారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బి.కేశవరావు, రాములు, శివరామ కృష్ణ, గురుమూర్తి, సాంబయ్య, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాల విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

- సింగరేణి స్కూల్ కరస్పాండెంట్ డీజీఎం (పర్సనల్) రమేష్

నవతెలంగాణ-మణుగూరు



విద్యార్థుల సృజనాత్మకమైన అంశాలపై నిర్వహించబడిన ప్రతిభా పాటవాలు ప్రదర్శించారని సింగరేణి పాఠశాల కరస్పాండెంట్ డీజీఎం పర్సనల్ మేనేజర్ సలగల రమేష్ తెలిపారు. పోటీలలో బహుమతులు పొందిన విద్యార్థులకు పివి కాలనీ సింగరేణి స్కూల్ విద్యార్థుల అభినందన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన తొలి అడుగు ఫౌండేషన్ వారు నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్‌లో పాఠశాల విద్యార్థులు ఎస్.ఇంతియాజ్ (ఇంక్ ఫ్రమ్ స్మోక్) అనే అంశానికి ప్రథమ స్థానం సాధించి రూ.4000 నగదు బహుమతి, షీల్డ్ గెలుచుకున్నాడు. అలాగే ఎస్.హంస నందిని (బయో డీగ్రేడబుల్ శానిటరీ ప్యాడ్) అనే అంశానికి జిల్లా స్థాయిలో తృతీయ స్థానం షీల్డ్, రూ.1000 నగదు బహుమతి సాధించింది. ఈ సందర్భంగా బహుమతి పొందిన విద్యార్థులకు బహుమతి అందజేస్తూ రమేష్ మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలలో వైజ్ఞానిక అంశాలలో సంపూర్ణ అవగాహన పెంచుకొని ఇదే విధంగా విజేతలుగా నిలుస్తూ సింగరేణి పాఠశాల కీర్తిని మరింతగా పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్ కే.మమతా, యూ.రజితలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ మస్తానయ్య, ఆర్.కళ్యాణి, ఎం.వేణు, టి.వెంకన్న, ఎం.కృష్ణ బాబు తదితరులు పాల్గొన్నారు.



25 కేజీల బియ్యం వితరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

యశోదా ఫౌండేషన్ సేవా సమితికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వారు భద్రాచలం డివిజన్ కార్యాలయంలో 25 కేజీల బియ్యం మంగళవారం వితరణగా అందజేశారు. భద్రాచలం డివిజన్ అధ్యక్షులు బందు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ఎల్.వి.ప్రసాద్, కోశాధికారి కృష్ణమూర్తి, జిల్లా గౌరవ అధ్యక్షులు ఎంవిఎస్ఎస్ నారాయణ ఆధ్వర్యంలో అందజేసినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి యశోదా ఫౌండేషన్కు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డి.కృష్ణమూర్తి, నాళం సత్యనారాయణ, సిహెచ్ సుబ్బయ్య చౌదరి, ఎస్.రాజబాబు, టి.శివ ప్రసాద్, ఐలయ్య, విష్ణు, మొలకల సుబ్రహ్మణ్యం, మాదిరెడ్డి రామ్మోహనరావు, చుక్కా రాంబాబు, బి.రాజు, సుబ్బారావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

- న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మధు

నవతెలంగాణ-ఇల్లందు



గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలు అధికారం వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు విమర్శించారు. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మంగళవారం గుండాల మండలం శెట్టుపల్లిలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అల్లూరి సెంటర్లో న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు బచ్చల సారయ్య అధ్యక్షత నిర్వహించిన సభలో మధు మాట్లాడారు. రాబోయే స్థానిక ఎన్నికలలో పాలకులకు ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ నెల 20న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ప్రదర్శన, సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎట్టి నర్సింహారావు, మల్యాల మల్లేష్, ఇర్ప రాజేష్, పుణెం శ్రీను, లింగయ్య, రవీందర్ రెడ్డి, కల్తీ మల్లయ్య, ఈర్సా బుచ్చయ్య, నర్సయ్య, బొర్రా విక్రమ్, కుంజా స్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఎఫ్ లెక్కలు చెప్పాలని వినతి

నవతెలంగాణ-ఇల్లందు

2023 జూన్ నుండి కన్వేయన్స్ డ్రైవర్ల పీఎఫ్ లెక్కలు తేల్చాలని ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ టీయూసీఐ రాష్ట్ర అధ్యక్షులు, షేక్ యాకుబ్ షావలి డిమాండ్ చేశారు. సింగరేణి గని కార్మికుల భవిష్యనిధి, కోఆర్డినేషన్ సమావేశానికి ఇల్లందు వైసీఓ క్లబ్‌కు సీఎం పీఎఫ్ ప్రతినిధి బృందం వచ్చారు. ఈ మేరకు మంగళవారం ప్రతినిధి బృందానికి వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టు కార్మికుల 2022 నుండి, లెక్కలు చూపడం లేదని వెంటనే వారి లెక్కలు చూపించే విధంగా చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు సిద్ధమవుతారని వారు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ సీఎం పీఎఫ్ లెక్కలు మార్చి ఎకనామిక్ కాగానే వారు లెక్కలు ఇల్లందు జీఎంఆఫీస్‌కి పంపిస్తామని తెలియజేశారు. ఈ సమావేశంలో జీఎం పీసం కృష్ణ, పీఎఫ్ ఇన్స్పెక్టర్ చిరంజీవి, టీయూసీఐ ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదులో అశ్వారావుపేట ఐదో స్థానం

- కట్రంకు జ్ఞాపిక అందించిన నర్సింహులు

నవతెలంగాణ-అశ్వారావుపేట



ఇటీవల తెలుగుదేశం పార్టీ తెలంగాణలో చేపట్టిన పార్టీ సభ్యత్వ నమోదులో అశ్వారావుపేట నియోజకవర్గం ఐదో స్థానంలో నిలిచింది. ఈ సభ్యత్వం అందజేత హైద్రాబాద్ పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు బక్కని నర్సింహులు నియోజకవర్గం ఇన్‌చార్జి కట్రం స్వామి దొరకు ప్రశంసా పూర్వక జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా కట్రం స్వామి దొర సభ్యత్వం నమోదుకు సహకరించిన ఐదు మండల అధ్యక్షులకు ధన్యవాదాలు తెలియజేసారు.

నారాయణరావుపేటలో సమ్మక్క-సారలమ్మ జాతర

దుమ్ముగూడెం : మండల పరిధిలోని కొత్త నారాయణరావుపేట గ్రామంలో ప్రతి రెండేళ్లకు ఒకసారి నిర్వహించే సమ్మక్క, సారలమ్మ, కాళీమాత జాతర మహోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఆదివాసీ సంప్రదాయ పద్ధతులు, ఆదివాసీ గణాచార్యుల ధర్మ సంరక్షణ సమితి నిర్వహణలో సాగే ఈ జాతర మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మొదటిరోజు గంగపూజ కార్యక్రమాన్ని విశేషంగా నిర్వహించారు. నేడు సారలమ్మ గుర్రాల గుట్ట నుంచి గద్దెకు రానుండగా, గురువారం నిండు జాతర సందర్భంగా సమ్మక్క ఆలయానికి చేరే ఘట్టాలు ఉంటాయని, ఆదివారం అమ్మవార్లు తిరిగి గుట్టకు చేరుకునే ఏర్పాట్లు చేయనున్నట్లు గుడి పూజారి కురసం సోమయ్య, దేవరబాల కురసం బాయమ్మలు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై కమిషనర్‌కు ఫిర్యాదు

అశ్వారావుపేట : అశ్వారావుపేట మేజర్ పంచాయతీలో జరిగిన అక్రమ నిర్మాణాలు పై మున్సిపాల్టీగా మారాక కమిషనర్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ క్రమంలో మంగళవారం మున్సిపాల్టీ కమిషనర్ సుజాతకు గుర్రాల చెరువు రోడ్‌లో చందన రెసిడెన్స్‌లో అపార్ట్ మెంట్ కొనుగోలు దారుడు అయిన పాలడుగుల రమేష్ యజమాని, బిల్డర్ సంక ప్రసాద్ పై ఫిర్యాదు చేసాడు. మూడు ఫ్లోర్‌లకు అనుమతి పొంది అక్రమంగా నాలుగో ఫ్లోర్ నిర్మించి దాన్ని సైతం విక్రయించి కింద మూడు ఫ్లోర్‌ల అపార్ట్ మెంట్ వాసులకు కారిడార్ లేకుండా చేసాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఫిర్యాదు స్వీకరించిన కమిషనర్ సుజాత టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీనివాస రావుకు ఫిర్యాదు పరిశీలించి సంబంధిత నిర్మాణ దారుడికి నోటీస్‌లు పంపాలని ఆదేశించారు.

ఇందిరమ్మ మోడల్ నిర్మాణం పరిశీలన

నవతెలంగాణ-కరకగూడెం



మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ మోడల్ నిర్మాణాన్ని జిల్లా ప్రాజెక్టు అధికారి శంకర్, పినపాక నియోజకవర్గం హౌసింగ్ ఏఈ సత్యనారాయణ, తహసీల్దార్ నాగప్రసాద్, ఎంపీడీవో దేవ వర కుమార్‌తో కలిసి మంగళవారం పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం మోడల్ హౌస్ నిర్మాణం జరుగుతుందని, ఇది ప్రజలందరూ పరిశీలించి వారి ఇంటి స్థానంలో మంజూరైన లబ్ధిదారులు నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ప్రతి పేదోడి సొంతింటి కల నెరవేర్చడమే తమ ముందున్న లక్ష్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాంబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తులసి స్ఫూర్తితో ప్రజా పోరాటాలు

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ
- పట్టణ కమిటీ ఆధ్వర్యంలో తులసి 8వ వర్ధంతి

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను కదిలించి ప్రజా పోరాటాలు నిర్మించడమే అమరజీవి కామ్రేడ్ బండారు తులసికిచ్చే ఘన నివాళి అని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు అన్నారు. మహిళా శాఖ కార్యదర్శి ఐద్వా నాయకులు అమరజీవి కామ్రేడ్ బండారు తులసి 8వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మచ్చా వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టుల ప్రాధాన్యత మరింత పెరిగిందని అన్నారు. నేడు సమాజంలో పేదరికం, అసమానతలు, నిరుద్యోగం రోజురోజుకు పెరిగిపోతున్నాయని, ఈ సమస్యలపై మాట్లాడేది, పోట్లాడేది సీపీఐ(ఎం) మాత్రమేనని అన్నారు. దేశంలోని పాలకులు కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకు అనుగుణంగా నూతన ఆర్థిక విధానాలను అమలు చేస్తున్నారని, ప్రశ్నించిన వారిపై దేశద్రోహం ముద్రలు వేసి తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో దేశానికి కమ్యూనిస్టుల ఆవశ్యకత మరింత పెరిగిందని అన్నారు.

పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ మాట్లాడుతూ... కామ్రేడ్ తులసి పార్టీ మహిళా సంఘం కార్యకలాపాలతో పాటు బహుముఖ కార్యక్రమాలు వార్డు పరిధిలో నిర్వహించడంలో కీలకపాత్ర పోషించిందని అన్నారు. సీపీఐ(ఎం) అఖిలభారత మహాసభలు ఏప్రిల్ నెలలో జరగనున్నాయని ఈ మహాసభల్లో రానున్న కాలంలో పార్టీ తీసుకోవాల్సిన రాజకీయ నిర్మాణ ఎత్తుగడలపై పార్టీ కార్యకర్తలు తగు సూచనలు చేయాలని అన్నారు. ఇంకా పార్టీ సీనియర్ నాయకులు ఎలమంచి రవికుమార్, జీఎస్ శంకర్రావు, ఎంబి నర్సారెడ్డి, ఐద్వా జిల్లా నాయకులు ఎన్.లీలావతిలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే.బ్రహ్మాచారి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, సీనియర్ నాయకులు, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకట రామారావు, పి.సంతోష్ కుమార్, పట్టణ నాయకులు ఎం.వి.ఎస్ నారాయణ, జీవనజ్యోతి, కోరాడ శ్రీనివాస్, అజయ్ కుమార్, భూపేందర్, ఐద్వా నాయకులు పూర్ణ, ఏజే గౌతమి, నాగలక్ష్మి, రాధా, సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్యను పెంచాలి

- మునగ సాగును ప్రోత్సహించాలి
- ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ-అశ్వారావుపేట



కూలీల సంఖ్యను పెంచడంతో పాటు మునగ సాగును ప్రోత్సహించాలని ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్, ఎంజీ ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీఓ రామచంద్రరావుకు సూచించారు. మంగళవారం మండలంలోని రామన్నగూడెం, మల్లయిగూడెం, అనంతరం, గాండ్లగూడెం, బచ్చువారిగూడెం, వినాయకపురంలలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పనులు, మునగ సాగును వారిరువురు పరిశీలించారు. ఉపాధి కూలీలు హాజరు పెంచడంతో భూమిలేని నిరుపేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కలిగే అవకాశం ఉందని, మునగ సాగు ప్రోత్సాహంతో సన్నచిన్నకారు రైతులకు ఆదాయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో స్థానిక సిబ్బంది కృషి చేయాలని అన్నారు. వారి వెంట ఆయా పంచాయతీల కార్యదర్శులు, సాంకేతిక సహాయకులు, క్షేత్రస్థాయి సహాయకులు ఉన్నారు.

పురుగు మందులు, విత్తనాలు లైసెన్స్ షాపుల్లోనే కొనాలి

- జి.భానుమతి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి



పురుగు మందులు, విత్తనాల కొనుగోలు తప్పక లైసెన్స్ షాపుల్లోనే చేయాలని జిల్లా డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి గొల్లపూడి భానుమతి, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు స్థానిక రైతులకు సూచించారు. మంగళవారం వారు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో రైతులు, యువతకు వ్యవసాయం, మత్తు పదార్థాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విత్తనాలు, పురుగు మందులు కొన్న తర్వాత సంబంధిత షాపు నుంచి కచ్చితంగా రశీదు తీసుకోవాలని చెప్పారు. మండలంలోని పెద్ద వెంకటాపురం గ్రామం రైతుల అభ్యర్థన మేరకు త్రీఫేస్ కరెంట్, రోడ్డు సంబంధిత విషయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లి, తక్షణమే న్యాయం జరిగేటట్లుగా చూస్తామని చెప్పారు. అదేవిధంగా యువత మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, సన్మార్గం వైపు నడవాలని కోరారు. యువత చెడు అలవాట్లు దూరంగా ఉండాలని, వాహనాలకు లైసెన్సులు ఇన్సురెన్స్ ఉండాలని, మండలంలో 50 నుంచి 100 మంది లైసెన్స్ లేకుండా ఉన్నట్లయితే వారికి ఇన్సూరెన్స్ కంపెనీని పిలిచి ఇన్సూరెన్స్ కలిపిస్తామని తెలిపారు. అదేవిధంగా ఆర్టీఏ వారిని పిలిచి లైసెన్స్ సైతం ఇప్పించడం జరుగుతుందన్నారు. మారుమూల గ్రామాలలో జరిగే బాల్య వివాహాలను ప్రోత్సహించకూడదని, అలా ఎవరైనా జరిపితే, వివాహము చేసిన వారిపైన, ఆ వివాహానికి హాజరైన వారి పై చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. బాల, బాలికలను ఎవరైనా బాల కార్మికులుగా పనిలో చేర్చుకుంటే అటువంటి వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, స్థానిక పి.ఎల్.వి గుండె బోయిన రామకృష్ణ, వ్యవసాయ అధికారి అనీల్ కుమార్, ఏఈఓ ఆర్.విజయ్ వంశీ, ఏఎస్ఐ వెంకట్ రెడ్డి, వివిధ గ్రామాల రైతులు, గ్రామ పెద్దలు, యువకులు గొగ్గెల లక్ష్మయ్య, జార రాజేందర్, ఈసం వెంకయ్య, కుంట వెంకటరాములు, గౌరబోయిన సుబ్బారావు, నాగపాణి, కండె రామ్మూర్తి, గాదె రాజు, చెన్నయ్య, సందీప్, మహేష్, రవి, నవీన్, చందు, ప్రదీప్, శ్రీను, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థిని చదువు కోసం ఆర్థిక సాయం

- ఇష్టంతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి
- ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్యులు డాక్టర్ అక్కినేని లోకేష్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



భద్రాచల పట్టణంలో ఆదర్శనగర్ కాలనీకి చెందిన పేద విద్యార్థిని గుండిపూడి ఛార్మిల భద్రాచల పట్టణంలోని ఒక ప్రయివేట్ జూనియర్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతుంది. బాగా చదువుకోవాలన్న ఆకాంక్ష తపన ఉన్నా కూడా ఆర్థిక పరిస్థితి బాగోలేక చదువు కష్టంగా మారింది. గత కొంతకాలంగా తల్లిదండ్రుల ఆరోగ్యం బాగోలేక ఆర్థికంగా ఇబ్బంది పడుతుండటంతో విద్యార్థిని చదువు కష్టంగా మారడంతో మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ సురక్ష హాస్పిటల్ డైరెక్టర్ ప్రముఖ క్రిటికల్ వైద్య నిపుణులు డాక్టర్ అక్కినేని లోకేష్ చేతుల మీదుగా పేద విద్యార్థినికి రూ.23000 మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అక్కినేని లోకేష్ మాట్లాడుతూ...కష్టాల్లో ఉన్న పేద విద్యార్థినికి నేనున్నానంటూ ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించిన ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. అలాగే విద్యార్థిని ఉద్దేశించి మాట్లాడుతూ ఇష్టంతో కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నతమైన స్థాయిలో ఉండాలని కోరారు. అలాగే ఆర్థిక సహాయం అందించిన ఎస్ఎల్‌బీటీ పెయింట్స్ యజమానులు సెట్టి వేణు రాజ్, బీవీ సూర్య తేజ, అబ్దుల్ ఊఫర్‌లను, ట్రస్ట్ సభ్యులను అభినందించారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపకులు కొప్పుల మురళి మాట్లాడుతూ... పేద విద్యార్థినికి చదువుకోవాలని తపన ఆకాంక్ష ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పరిస్థితి మదర్ తెరిసా చారిటబుల్ ట్రస్ట్ దృష్టికి రావడంతో వెంటనే స్పందించి ట్రస్ట్ సభ్యులు రూ.8000, ఎస్-ఎల్‌బీటీ పెయింట్స్ రూ.10000, శ్రీ సురక్ష హాస్పిటల్ డాక్టర్ అక్కినేని లోకేష్, డాక్టర్ సూరపనేని శ్రీ క్రాంతిలు రూ.5000 సహకారంతో రూ.23 వేలు మొదటి సంవత్సరం చదువు కోసం అందజేశామని తెలిపారు. భవిష్యత్తులో డాక్టర్ అవ్వాలనే లక్ష్యంతో బాగా చదివి వైద్య విద్యలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు నిర్వాహకులు చోళ ఇన్సూరెన్స్ మేనేజర్ బాలరాజు, సాయికుమార్, కోమటిరెడ్డి, బూరం నవీన్, ఎడ్విన్ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

సమైక్య పోరాటాలతోనే సామాన్య రైతులకు న్యాయం

- ఏఐకేఎస్ రైతు మహాధర్నాకు ఆయిల్ ఫాం రైతుసంఘం సంఘీభావం

నవతెలంగాణ-అశ్వారావుపేట



భారతీయ చిన్న కమతాల రైతులకు సమైక్య పోరాటాల ద్వారానే హక్కులు సాధన సాధ్యం అవుతుందని ఆయిల్ ఫాం సాగు దారులు సంఘం రాష్ట్ర నాయకులు తుంబూరు మహేశ్వర రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ ఆధ్వర్యంలో మంగళవారం ఖమ్మం మిర్చి మార్కెట్‌లో తలపెట్టిన మిర్చి రైతుల మహాధర్నాకు తెలంగాణ ఆయిల్ ఫాం రైతు సంఘం సంఘీభావం తెలుపుతూ ఆయన మాట్లాడారు. ఒక్క మిర్చి వేసిన రైతులే కాక అన్ని రకాల పంటలు సాగుచేస్తున్న రైతులు సంఘటితం కావలసిన అవసరం ఉంది అని తెలిపారు. ప్రస్తుతం ఎండుమిర్చి క్వింటాళ్లకు రూ.13 వేలు ఉందని, రూ.25 వేలు పెంపుదల చేయాలని, మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోళ్ళు చేయాలని, మిర్చి బోర్డ్ ఏర్పాటు చెయ్యాలని రైతు సంఘ రాష్ట్ర నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు బొంతు రాంబాబు, సుదర్శన్, నున్న నాగేశ్వరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, బండి చక్రధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

- ఎస్ఓటు జీఎంకి సామాజిక సేవకులు వినతి

నవతెలంగాణ-మణుగూరు



ఏరియా ఎక్స్ ప్లోజివ్ విభాగం ఎస్ఎంఎస్ ప్లాంట్‌లో సింగరేణి ఎండీ ఎన్.బలరాం ఆదేశాలు కచ్చితంగా అమలు చేయాలని, భూ నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని సమాజ సేవకులు కర్నే బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఏరియా ఎస్ఓటు జీఎం డి.శ్యాంసుందర్‌కి వినతిపత్రం అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సుమారు పదిమంది వరకు కాంట్రాక్ట్ కార్మికులను, కొత్తగా వచ్చిన సింగరేణి ఎక్స్ ప్లోజివ్ క్యారియర్స్ డ్రైవర్‌లను నియమించుకున్నారని, కాంట్రాక్ట్ కార్మికులుగా నియమించుకున్న వారిలో సింగరేణి భూనిర్వాసితులు (పీడీఎఫ్)లు ఇద్దరు లేదా ముగ్గురు మించి లేరని అది కూడా ముగ్గురు మహిళలు మాత్రమే ఉన్నారన్నారు. మణుగూరు ఓసీ విస్తరణలో భూములు కోల్పోబోతున్న తిర్లాపురం గ్రామస్తులు అసలు లేనేలేరన్నారు. ఈ విషయమై గతంలో కూడా నేను ఏరియా యాజమాన్యానికి, ఎస్ఎంఎస్ ప్లాంట్ సింగరేణి అధికారులకు, సంబంధిత కాంట్రాక్టర్‌కి కూడా వినతి పత్రాలు అందజేసి ఉన్నానని తెలిపారు. ఈ విషయమై ఆరా తీయాలని అక్కడ అధికారులను కలిసి వివరణ అడగాలని, ఎస్ఎంఎస్ ప్లాంట్‌కి ఎప్పుడు వెళ్లినా అక్కడి ప్రస్తుత ఇన్‌చార్జి నన్ను ఒక దళితుడు, పాత్రికేయుడు అని కూడా చూడకుండా నోరు జారుతున్నారని, సెక్యూరిటీ వాళ్ళ ముందు చులకనగా మాట్లాడుతున్నారని ఆయన వాపోయారు. ఇప్పటికైనా ఏరియా జీఎం దృష్టి పెట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు.

స్పోర్ట్స్ దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని మైలారం గ్రామం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చినటువంటి స్పోర్ట్స్ దుస్తులను విద్యార్థులకు మంగళవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జోగా రాంబాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించి, ఆవశ్యకతను వివరించామన్నారు. ఈ దుస్తులు ప్రభుత్వం ఎంతో ఖర్చు పెట్టి ఉచితంగా పాఠశాల గిరిజన విద్యార్థులకు అందించడం చాలా గొప్ప విషయం అన్నారు. గిరిజన విద్యార్థులకు ఎన్నో వసతులు కల్పిస్తున్న ఐటీడీఏ పీఓ, డీడీలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.కుమార్ రాజా, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆదర్శ నాయకుడు అమరజీవి కామ్రేడ్ శ్రీనివాసరావు

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం

నవతెలంగాణ-కొత్తగూడెం

ఆదర్శ నాయకుడు అమరజీవి కామ్రేడ్ వేదగిరి శ్రీనివాసరావు ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్యలు పిలుపు నిచ్చారు. మంగళవారం వ్యకాస జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంచికంటిభవన్‌లో వేదగిరి శ్రీనివాసరావు 5వ వర్ధంతి సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి జిల్లా ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా పని చేశారన్నారు. అనేక కూలి పోరాటాలకు, భూమి పోరాటాలకు నాయకత్వం వహించిన ఆదర్శ నాయకుడని కొనియాడారు. అదేవిధంగా రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ కార్మికుల సమస్యలపై జరిగిన అనేక పోరాటాలలో ప్రత్యక్షంగా పాల్గొన్నారని తెలిపారు. భవిష్యత్తులో వేదగిరి స్ఫూర్తితో భూమి పోరాటాలు, కూలి పోరాటాలు, ఇండ్ల స్థలాల పోరాటాలు ఉధృతం చేస్తామని అదే ఆయనకిచ్చే ఘన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట బాల కృష్ణ, జబ్బ సంధ్య నసూర్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుండి పగడ్బందీగా కమిటీలు

- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు నరసింహులు
- అడక్ కమిటీ సభ్యులు ముద్రగడకు సన్మానం

నవతెలంగాణ-ఇల్లందు

గ్రామస్థాయి నుండి పార్టీ కమిటీ వేసుకొని మండలం, పార్లమెంట్ కమిటీ నిర్మాణం చేసుకొని రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు తెలిపారు. ఇల్లందు నియోజకవర్గం అత్యధికంగా పార్టీ సభ్యత్వ నమోదు చేసినందుకుగాను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కమిటీ, ఇల్లందు నియోజకవర్గ అడక్ కమిటీ సభ్యులు ముద్రగడ వంశీని ఘనంగా సన్మానించారు. ముద్రగడ వంశీని మెమొంటో ఇచ్చి సన్మానించారు. అనంతరం పొలిట్ బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు అరవింద్ కుమార్ గౌడ్, టీటీడీ బోర్డు సభ్యులు నన్నూరి నర్సిరెడ్డి, మహబూబాబాద్ పార్టీ పార్లమెంట్ కన్వినర్ కొండపల్లి రాంచందర్ రావు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

పట్టుదలతో ముందుకు సాగుతా : ముద్రగడ వంశీ

ఈ సందర్భంగా ముద్రగడ వంశీ మాట్లాడుతూ మెమొంటో ఇచ్చి సన్మానించిన పార్టీకి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఇంత మంచి అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కార్యక్రమాల్లో నిరంతరం ఇదే పట్టుదలతో ముందుకు సాగుతానని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, టీడీపీ సీనియర్ నాయకులు కారు నరసన్న అయ్యోరి నాగరాజు, కడారి నటరాజ్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి వేడుక జయప్రదం చేయండి

నవతెలంగాణ-కొత్తగూడెం

ఇల్లందు క్రాస్ రోడ్డు, లక్ష్మీదేవిపల్లి మండలం హరిత హోటల్ ప్రాంగణంలో జరిగే శ్రీశ్రీశ్రీ సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ 286వ జయంతి ఉత్సవాలకు బంజార జాతి బిడ్డలైన మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు మాజీ కౌన్సిలర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు, గిరిజన సంఘ గిరిజన నాయకులు, ప్రజా సంఘాల ఉద్యమకారులు, ఉద్యోగులు, విద్యార్థులు మేధావులు సంత్ శ్రీ సాధువులు అధిక సంఖ్యలో హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. బంజారాల ఆరాధ్యదైవం శ్రీశ్రీశ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ సమాజ శ్రేయస్సు కోసం చూపించిన మార్గం ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమానికి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా ఉన్నతాధికారులు గిరిజన సంఘాల నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూక్య శ్రీనివాస్, భూక్యా రాంబాబు, రమేష్ రాథోడ్, భానోత్ మోహన్, రమేష్ నాయక్, జర్పుల ఉపేందర్, బానోత్ సక్రు, శివ, గుగులోత్ భద్రు, మాలోత్ రామనాథం, ఉపేందర్, బట్టు ఉషన్, తదితరులు పాల్గొన్నారు.



పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర వైద్య అడిషనల్ డైరెక్టర్

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పిహెచ్సి) హైదరాబాద్ కోటి మెడికల్, హెల్త్ అడిషనల్ డైరెక్టర్(అడ్మిన్) ఆఫ్ పబ్లిక్ హెల్త్, టాస్క్ ఫోర్స్ ఖమ్మం జిల్లా టీం లీడర్ కె.శశిశ్రీ, డాక్టర్ ఎం.విజయ్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ (టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు)తిరుపతి, డ్రగ్ ఇన్స్పెక్టర్ (క్యాతుల్లాపూర్,టాస్క్ ఫోర్స్ టీం సభ్యులు) డిపిఓ దుర్గ, ఫార్మసిస్ట్ మోహన్,హెచ్వి ఖాదర్‌బి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పిహెచ్సిలో జరుగుతున్న ప్రసవాలు, ల్యాబ్, ఫార్మసీ, వాక్సిన్ గదులను పరిశీలించి పలు రికార్డులను తనిఖీ చేశారు. వైద్యాధికారి అంకం అరుణాదేవితో వారు మాట్లాడి పిహెచ్సి ఓపి వివరాలను అడిగి తెలుసుకొని పలు సలహా, సూచనలు ఇచ్చి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అంకం అరుణదేవి, ల్యాబ్ టెక్నీషియన్, రెడ్డిబోయిన రామారావు, పిహెచ్ఎన్ జీఎ రాణి, హెల్త్ సూపర్వైజర్స్ లత, పద్మావతి స్టాఫ్ నర్స్ కుమారి, ఫార్మసిస్ట్ సత్యవతి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్ష శిబిరాన్ని సందర్శించిన డిఎంఅండ్‌హెచ్‌ఓ

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మం జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో జరుగుచున్న విద్యార్థులకు కంటి పరీక్షలు ప్రత్యేక వైద్య శిభిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి కళావతి బాయి సందర్శించి కంటి పరీక్షల తీరును పరిశీలించి వైద్యులతో చర్చించారు. జిల్లాలో ఆర్‌బిఎస్‌కె టీమ్‌లో అప్తాలమిక్ ఆఫీసర్లు రెండు విడతలుగా అన్ని స్కూల్‌లో విద్యార్థులకు స్క్రీనింగ్ చేసి దాదాపు 3500 మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించి వారికి కంటి వైద్యులచే స్క్రీనింగ్ జరిపి అవసరమైన వారికి కళ్ళజోళ్ళు పంపిణి చేస్తామని ఆమె చెప్పారు. ఆపరేషన్ అవసరం అనుకుంటే హైదరాబాద్ పంపి వారికి తగిన చికిత్సలు అందిస్తామని చెప్పారు. పిల్లలకు పకడ్బందీగా వైద్యులు కంటి పరీక్షలు జరిపి వారి కంటి సమస్యలను గుర్తించాలని, తద్వారా వారికి కంటి సమస్యలు చేసి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజషన్ అధికారి డాక్టర్ చందునాయక్, డెమో సాంబశివరెడ్డి, కంటి వైద్యులు పాల్గొన్నారు .



ఉచిత పశు వైద్య శిబిరం విజయవంతం

నవతెలంగాణ-కల్లూరు

మండల పరిధిలోని వెన్నవల్లి గ్రామంలో పశుసంవర్ధక శాఖ, పశు గణాభివృద్ధి సంస్థ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత గోపాలమిత్ర పశు వైద్య శిబిరంని డాక్టర్ రోప్ కుమార్ ప్రారంభించారు ఈ శిబిరంలో 38 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్స, 46 దూడలకు నట్టల నివారణ మందు తాగించడం జరిగింది. డాక్టర్ రోప్ కుమార్ మాట్లాడుతూ పశువు ఈనిన మూడు నెలలకే మళ్లీ కట్టించాలి, కట్టించిన మూడు నెలలకే చూడు పరీక్ష చేయించాలి, ప్రతి పశువుకు మినరల్ మిక్చర్ ప్రతిరోజు అందించాలి అని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ వైద్యాధికారి డాక్టర్ కే.మమత, గోపాల్‌మిత్ర తుమ్మల వెంకటేశ్వర్లు, విఎల్‌ఓ శ్రీనివాసరావు, గోపాలమిత్రులు రమేష్, వెంకటేశ్వర్లు, విజయ్‌కుమార్, అప్పారావు, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కృష్ణ ప్రసాద్, శివకృష్ణ, హనుమంతరావు, విజయభాస్కర్, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.



ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉచితంగా కరాటే శిక్షణ


నవతెలంగాణ-ఖమ్మం

నగరంలోని ఇందిరానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి కరాటే మాస్టర్ హరీష్ విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రధానోపాధ్యాయులు అనుమతితో విద్యార్థులకు ఉచితంగా కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. ప్రతిభ కనబరిచే విద్యార్థులకు ఉచితంగా కరాటే దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మంజుల, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెన్‌కోలో అపరిష్కృత సమస్యలను పరిష్కరించండి

- 1104 యూనియన్ జెన్కో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే.కోటేశ్వరరావు, వి.దుర్గా అశోక్
- జెన్కో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-పాల్వంచ



జెన్కో ఉద్యోగ ఆర్టిజన్ కార్మికుల అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ జెన్కో రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కే.కోటేశ్వరరావు, వి.దుర్గా అశోక్ కోరారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్ సౌదాలోని సిఎండి ఛాంబర్‌లో ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ ప్రతులను డైరెక్టర్ (హెచ్‌ఆర్) అజయ్ డైరెక్టర్ (థర్మల్), లక్ష్మయ్య, డైరెక్టర్ (హైడల్ - ప్రాజెక్ట్స్) సచ్చిదానందంలకు సమస్యలు విన్నవించి వినతిపత్రం అందించారు. ఆర్టిజన్ ఉద్యోగ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని ప్రమోషన్ (అప్ గ్రేడ్) విషయాలలో త్వరలో నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. సీనియర్ ఫోర్ మెన్ పోస్టుల సాంక్షన్ ప్రభుత్వం ఇవ్వవలసి ఉందని, ప్రభుత్వానికి మరొక పర్యాయం నివేదిక పంపుతామని తెలిపారు. కారుణ్య నియామకాలలో డిప్లమో, బీటెక్ విద్యార్హత కలిగిన అభ్యర్థులకు సబ్ జూనియర్ పోస్టులు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. వైటిపిఎస్ ఉద్యోగుల నెలవారి మెడిసిన్స్ కొనుగోలుకి ప్రస్తుతం లక్ష రూపాయలు ఇస్తున్నారని, దానిని 3 లక్షలకు పెంచాలని కోరగా చీఫ్ ఇంజనీర్ తో చర్చించి న్యాయం చేస్తామని తెలిపారు. కేటిపిఎస్ నందు జి.టైప్ క్వార్టర్ల అలాట్మెంట్ హెచ్‌ఆర్‌పి విషయాన్ని త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. వైటిపిఎస్ దామరచర్ల ఉద్యోగుల బస్సు సౌకర్యాన్ని చీఫ్ ఇంజనీర్‌తో చర్చించి ఓ అండ్ ఎం ఉద్యోగులకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కేటీపీఎస్ 5, 6 దశ, కేటిపిపి తదితర థర్మల్, ఎంహెచ్ఎస్ పోచంపాడు తదితర ప్రాంతాలలో శాంక్షన్ పోస్టుల విషయంలో ప్రభుత్వం నుండి అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, ఫైల్ మూవ్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికులు రమేష్, ఉపేందర్‌లు పాల్గొన్నారు.

వరుస దొంగతనాలు

- బెంబేలెత్తుతున్న జనం
- సత్యనారాయణపురంలో చోరీ
- క్లూస్ టీంతో దర్యాప్తు

నవతెలంగాణ-చర్ల

మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆదివారం అర్ధరాత్రి చర్లలో బంగారు దుకాణంలో చోరి ఘటన మరువక ముందే తాజాగా సత్యనారాయణపురంలో మరోచోరి ఘటన వెలుగుచూడటం ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. సత్యనారాయణపురం గ్రామానికి చెందిన నడింపల్లి రామచంద్రరాజు కుటుంబం కొద్దిరోజుల క్రితం సొంత పని నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేరని గమనించిన దొంగలు తలుపును పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలను పగులగొట్టారు. బీరువాలో దాచి ఉంచిన బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు నగదును దొంగిలించారు. సిఐ రాజువర్మ, ఎస్ఐ నర్సిరెడ్డి చోరీ ప్రాంతానికి చేరుకొని విచారణ సాగించారు. కొత్తగూడెం నుండి క్లూస్ టీంను పిలిపించి ఆధారాలను సేకరించారు.



ఆధునిక పద్ధతులతో సాగు లాభదాయకం

- పొలాలకు సబ్సిడీ సోలార్ మోటార్లు
- ఆందోళనవద్దు...అర్హులందరికీ ఇళ్లు
- కారేపల్లి మండలంలో పర్యటించిన కలెక్టర్

నవతెలంగాణ-కారేపల్లి



ఆధునిక పద్ధతులు పాటిస్తే సాగు లాభసాటిగా ఉంటుందని ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కారేపల్లి మండలంలో చీమలపాడులో కలెక్టర్ పర్యటించారు. చీమలపాడులో వెంకటేశ్వర్లు రైతుకు చెందిన పామాయిల్ తోట, శ్రీనివాసరావుకు చెందిన డ్రాగన్ ఫ్రూట్ తోటలను కలెక్టర్ పరిశీలించారు. పంటలు, విద్యుత్, ఇతర సమస్యలపై పంట పొలాల వద్ద కూర్చొని రైతులతో ముచ్చటించారు. పంటలకు సాగునీటి వసతి, పంటల దిగుబడి, ధర గిట్టుబాటు అవుతుందా అంటూ పలు అంశాలను రైతుల నుండి రాబట్టి పలు సూచనలు చేశారు. అటవీ ప్రాంతం కావటంతో పంట చేలకు విద్యుత్ మోటర్ కనెక్షన్లు లేకపోవటాన్ని గమనించి కలెక్టర్ పొలాల వద్ద సబ్సిడీతో మోటార్లకు సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడతామన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన ప్రతి రైతుకు సోలార్ ప్యానల్స్ దశల వారీగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆయిల్ పామ్ సాగుతో చాలా లాభాలు ఉన్నాయని, అయిల్ పామ్ తొలి మూడేండ్లు అంతర్ పంటల ద్వారా ఆదాయం సంపాధించవచ్చని, ఆయిల్ పామ్ పంట దిగుబడి ప్రారంభమైన ప్రతి ఏడు రూ.లక్షకు తగ్గకుండా రైతులకు ఆదాయం వస్తుందన్నారు. డ్రాగన్ ఫ్రూట్ పంటకు కోతుల సమస్య ఉందని, సోలార్ ఫెన్సింగ్ ద్వారా సమస్యను అధికమించవచ్చన్నారు. గ్రామాల్లో రోడ్డు సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకుని రాగా, అటవీ నిబంధనలకు లోబడి గ్రామాలలో అవసరమైన మట్టి రోడ్ల ఏర్పాటుకు ఉపాధి హామీ కింద చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. ఇందిమ్మ ఇండ్లు అనర్హులకు అందితే వివరాలు ఇవ్వాలని వారిపై చర్యలు చేపట్టుతామన్నారు. దశలవారికి అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయటం జరుగుతుందని భరోసా ఇచ్చారు. సన్న రకం వడ్ల బోనస్ నివేదికలు ప్రభుత్వానికి అందాయని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే నిధులు విడుదల చేయడం జరుగుతుందని తెలిపారు. రైతు రుణమాఫీ సాంకేతిక సమస్యలను పరిష్కరించి అర్హులైన రైతులందరికీ అందేలా చర్యలు చేపడతామన్నారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, సింగరేణి తహసిల్దార్ సంపత్ కుమార్, ఎంపీడీవో సురేందర్, విద్యుత్ శాఖ ఏడి ఆనంద్, ఏడీఏ కరుణ, ఉద్యానవన శాఖ అధికారి వేణు, ఏవో బీ.అశోక్‌కుమార్, ఏఈవో నరేష్, జీపీ సెక్రటరీ కె.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

మార్చినాటికి ట్రైబల్ మ్యూజియం ప్రారంభం

- ఐటీడీఏ పీఓ పి.రాహుల్

నవతెలంగాణ-భద్రాచలం రూరల్



ఐటీడీఏ ప్రాంగణంలో పర్యాటకుల కోసం సిద్ధం చేస్తున్న ట్రైబల్ మ్యూజియం పనులు చివరి దశకు చేరుకున్నాయని, మార్చి నెలలో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. మంగళవారం మ్యూజియం కమిటీ సభ్యులతో కలిసి మ్యూజియంలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. మ్యూజియం చుట్టూ డిజైన్‌గా తయారు చేసిన చెట్లను ఖాళీగా ఉన్న ప్రదేశాలలో అమర్చాలని మ్యూజియం ద్వారం నుండి మ్యూజియం వరకు వెదురుతో తయారుచేసిన లైట్ కలర్‌కు సంబంధించిన రంగులు అందంగా వేయించాలని బాక్స్ క్రికెట్ కు సంబంధించిన పనులు ఈనెల 25 వరకు గ్రౌండ్ వర్క్ పూర్తి కావాలని పది రోజులలో బాక్స్ క్రికెట్ గ్రౌండ్ పూర్తిస్థాయిలో నిర్మాణం జరగాలని అన్నారు. అలాగే మ్యూజియం సందర్శించడానికి వచ్చే సందర్శకులకు వివిధ రకాల తినుబండారాలకు సంబంధించిన స్టాల్స్‌కు ఏర్పాటు చేస్తున్న స్థలాన్ని వర్షాకాలంలో కూడా ఇబ్బందులు లేకుండా పూర్తిస్థాయిలో గ్రావెలింగ్ చేయాలని డీఈకి ఆదేశించారు. ఇంకా ఏమైనా మిగిలిపోయిన పనులు ఉంటే త్వరగా పూర్తి చేయాలని మ్యూజియం నిర్వహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, ఏటీడీఓ అశోక్ కుమార్, డీఎస్ఓ ప్రభాకర్ రావు, డిఈ హరీష్, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాలరావు, మ్యూజియం ఇంచార్జ్ వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమలలో శ్రమకొద్దీ ఫలితాన్ని సాధించవచ్చు

సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలు నెలకొల్పుకొని జీవనోపాధి పొందుతున్న యూనిట్ సభ్యులు ఐకమత్యంతో కలిసి మెలిసి క్రమశిక్షణతో పరిశ్రమలు నడుపుకుంటే సంబంధిత యూనిట్లు లాభాల బాటలో నడవడమే కాక మీరు ఉపాధి పొంది పదిమందికి ఉపాధి కల్పించవచ్చని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ అన్నారు. మంగళవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటిసిలో సెంట్రల్ ఇన్స్టిట్యూట్ టూల్స్ డిజైన్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ యూనిట్ సభ్యుల శిక్షణ శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, సీఈఓటిడి సంస్థ డైరెక్టర్ ఉదయ్ కుమార్, శిక్షకుడు విజయ్ కుమార్, జేడీఎం హరికృష్ణ, ఎంఎస్ఎంఈ యూనిట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన తహశీల్దార్

నవ తెలంగాణ-ఖమ్మంరూరల్

మండలంలోని గొల్లగూడెం వద్ద గల గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలను ఖమ్మంరూరల్ తహశీల్దార్ రాంప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజనశాలను, పరిసరాలను, మంచినీరు సౌకర్యాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రాంప్రసాద్ మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు, నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలకు ఏమైనా మౌలిక వసతులు కావాలంటే తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యవతి, మండల వ్యవసాయాధికారి ఉమా నగేష్, అసిస్టెంట్ డైరెక్టర్ విజయ లక్ష్మీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడల్లో జిల్లా ఖ్యాతిని చాటాలి

మంత్రి పొంగులేటి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి

నవతెలంగాణ-ఖమ్మం

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శరీర సౌష్టవానికి ఉపయోగ పడతాయని, ఆ క్రీడల్లో జిల్లా ఖ్యాతిని చాటాలని మంత్రి పొంగులేటి కార్యాలయ ఇంఛార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖమ్మం సర్ధార్ పటేల్ స్టేడియంలో రాజీవ్ గాంధీ మెమోరియల్ 17వ ట్రోఫీ టోర్నమెంట్‌ను దయాకర్ రెడ్డి, ప్రముఖ వైద్యులు పరుచూరి వెంకటేశ్వరరావు, డివైఎస్‌వో సునీల్ రెడ్డి ప్రారంభించారు. తొలుత క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు మహమ్మద్ మతీన్, జర్నలిస్ట్ జానిపాషా, సీనియర్ క్రీడాకారిణి అంజలిలు, జూనియర్ అసిస్టెంట్ నాగమణి, పుష్పగుచ్ఛంలు అందజేసి స్వాగతం పలికారు. గెలుపొందిన విజేతలకు రూలింగ్ ట్రోఫీని బాబురావు జ్ఞాపకార్థంగా బహుమతులు అందజేయ బడుతుందని మతీన్ పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు సురేష్, సిద్దు, నాగేశ్వరరావు, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు నిత్యావసరాలు అందజేత

నవతెలంగాణ-దుమ్ముగూడెం

మండలంలోని పెద్ద నల్లబల్లి గ్రామంలో గత రెండు రోజుల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన కణితి నాగమణి, అనిరెడ్డి వెంకన్న, భూక్య. లక్ష్మణ్ బాధిత కుటుంబాలకు ప్రముఖ కాంట్రాక్టర్ ఎండి హలీం ఖాన్ మంగళవారం నిత్యావసర వస్తువులు అందజేశారు. అగ్ని ప్రమాదం సంభవించిన విషయాన్ని మాజీ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు (శివాజీ) ద్వారా తెలుసుకున్న హలీమ్ ఖాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు, బట్టలు, గిన్నెలు ఇతర సామాగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో మట్టా శేఖర్ బాబు, పుట్ట శ్రీరామ్మూర్తి, కళాయి, పూసం దాసు, మట్టా కృష్ణ, తెల్లం రాజు, పాయం రాజేష్, మట్టా నరేంద్ర, తుర్రం రాజేష్, పాయం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

నేడు కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్పొరేట్ల అనుకూలంగా, కార్మిక, కర్షక, పేద ప్రజలకు వ్యతిరేకంగా ఉన్న బడ్జెట్‌ను నిరసిస్తూ ఫిబ్రవరి 19న వామపక్షాలు చేపట్టిన నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రేసు ఎల్లయ్య, సీపీఐ(ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సారంగపాణి, బట్టు ప్రసాద్‌లు పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన వామపక్షాల సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడుతూ.. వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని, భీమా రంగంలో 100% ఎఫ్.డి.ఐ ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి 50% నిధులు కేటాయింపులు పెంచి పట్టణాలకు వర్తింపజేయాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ మండల నాయకులు వజ్జ పగడయ్య, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు బత్తిని సత్యం పాల్గొన్నారు.

సమస్యలు తెలపండి.. పరిష్కరిస్తాం

- సీఎంపీఎఫ్ రీజినల్ కమీషనర్ యం.కనకమ్మ

నవతెలంగాణ-ఇల్లందు

పెన్షన్, సీఎంపీఎఫ్ సమస్యలు తమ దృష్టికి వచ్చే వాటిని సకాలంలో నివృత్తి చేస్తామని, సమస్యలు తెలపండని రీజినల్ కమీషనర్ సీఎంపీఎఫ్ యం.కనకమ్మ అన్నారు. ఉద్యోగులకు సమస్యలు ఉన్నట్లయితే నేరుగా సీఎంపీఎఫ్ కార్యాలయంలో సంప్రదించవలసినదిగా తెలిపారు. ఏరియాలోని సింగరేణి మాజీ ఉద్యోగుల పెన్షన్, సిఎంపిఎఫ్ సమస్యల పరిష్కారానికి స్థానిక వైసిఓఎ క్లబ్ నందు ఎంవీటీసీ ఆధ్వర్యంలో మంగళవారం జియం వి.కష్ణయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన సీఎంపీఎఫ్, త్రిపార్టైట్ కోఆర్డినేషన్ కమిటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమములో ఎస్ఓటు జీఎం రామస్వామి, సి.యం.పి.ఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ పిల్లి చిరంజీవి, డిజియం(పర్సనల్) జి.వి.మోహన్ రావు, డిజిఎం సివిల్ రవికుమార్, ఫైనాన్స్ మేనేజర్ కె.మధుబాబు, పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

అశ్వారావుపేట : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం తెల్లవారుజామున కొత్తగూడెం స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అశ్వారావుపేట శివారులో పట్టుకున్నారు. స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఎస్సై యయాతి రాజు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని అనంతారం గ్రామ శివారు లోగల వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అశ్వారావుపేటకు ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను ఎస్.బీ పోలీస్ పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించారు. పట్టుబడిన రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి, ట్రాక్టర్ డ్రైవర్లు అరవింద్, రాముపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



ఎంపీఎల్ సీజన్-2 క్రికెట్ టోర్నమెంట్ విజేత మర్కోడు

- విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు అందజేసిన మాజీ ఎంపీపీ మంజు భార్గవి

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల పరిధిలోని మర్కోడు గ్రామంలో గత పది రోజులుగా యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంపీఎల్ సీజన్ - 2 క్రికెట్ టోర్నమెంట్‌లో మంగళవారం ఆద్యాంతం హెూరాహెూరీగా జరిగిన ఫైనల్లో మర్కోడు గ్రామానికి చెందిన జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో గట్టిపోటీ ఇచ్చిన రంగాపూర్ గ్రామానికి చెందిన జట్టు రన్నరప్ గా నిలిచింది. స్థానిక మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ పార్టీ నాయరాలు కోండ్రు మంజు భార్గవి విజేతగా నిలిచిన జట్టుకు షీల్డ్, నగదును అందజేశారు. అదేవిధంగా రన్నరప్ జట్టుకు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు సుతారి కృష్ణ షీల్డ్, నగదును అందజేశారు. దీనికి గాను విజేత జట్టుకు రూ.16000/-లు వూకె కిషోర్ బాబు - కోండ్రు మంజు భార్గవి (మాజీ ఎంపీపీ) దంపతులు, రన్నరప్ జట్టుకు రూ.10వేలు కాంగ్రెస్ పార్టీ నాయకులు సుతారి కృష్ణ స్పాన్సర్ చేశారని, ఈ సందర్భంగా వారికి టోర్నీ నిర్వాహకులు తాళ్లపల్లి శేఖర్, ఏడుళ్ల నాగేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాజా మాజీ ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. క్రీడలతో క్రీడాకారుల మధ్య స్నేహ సంబంధాలు బలపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ కొమరం హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చంద్రం, వెంకన్న, టోర్నమెంట్ నిర్వాహకులు వినయ్, నాగేష్, క్రీడాకారులు, ఔత్సాహికులు పాల్గొన్నారు.

ప్రజాపాలన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జారె

నవతెలంగాణ-దమ్మపేట

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మండలంలోని గండుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి పలు సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులను జారె స్వీకరించారు. సత్వరమే సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ త్వరగా సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ పట్టా పాస్‌బుక్.. ఇనాం భూమి కబ్జా!

- బ్రాహ్మణపల్లి గ్రామస్తుల ఆరోపణ



నవతెలంగాణ- నర్సాపూర్

ఇనాం భూమిపై కన్నేసిన కొందరు పట్టా పాస్‌బుక్ సృష్టించి కబ్జా చేశారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి గ్రామ సమీపంలోని కొత్తచెరువు సమీపంలో సర్వే నంబర్ 63లో 25 ఎకరాల మూడు గుంటల భూమి ఉంది. దాన్ని కొంత మంది కబ్జా చేశారని గ్రామస్తులు పలువురు ఆరోపించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి దొంగ పాసుబుక్కులు సృష్టించి కబ్జా చేశాడని బ్రాహ్మణపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ భూమిని పోలీసుల సహకారంతో చదును చేస్తున్నాడని తెలిపారు. తమ గ్రామానికి చెందిన ఇనాం భూమిని ఎలా కబ్జా చేస్తావని అడిగితే పోలీసుల చేత భయభ్రాంతులకు గురి చేస్తున్నాడని చెప్పారు. హైదరాబాద్ చెందిన సదరు కబ్జాదారునికి తమ గ్రామానికి చెందిన కొందరు వత్తాసు పలుకుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు కలగజేసుకొని తమ గ్రామానికి చెందిన ఇనాం భూమిని కాపాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు రాజు, యాదయ్య, నర్సింలు, రాములు, నాగరాజు, రమేష్, అంజయ్య, నాగరాజు, రాములు, కిష్టా గౌడ్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఏసీబీ దాడులు

- రూ.30 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన రేంజర్, బీట్ ఆఫీసర్



నవతెలంగాణ-ఇల్లందు

ఆయనో గెజిటెడ్ ఆఫీసర్, నెలకు వేతనం లక్ష. అయినప్పటికీ అధికారం చేతిలో ఉంది కదా అని లంచాలకు మరిగారు. ఇటు గిరిజనులకు, అటు ప్రభుత్వానికి సేవ చేయాల్సింది పోయి డబ్బుల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలంలోని 24 ఏరియా మైనార్టీ ప్రిన్సిపాల్ కృష్ణ రూ.2000 తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు. తాజాగా మంగళవారం మండలంలోని కొమరారం రేంజ్ పరిధిలో రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్ రూ.30 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. అటవీ భూమి నుంచి మట్టి తోలుకునేందుకు ఓ కాంట్రాక్టర్ వద్ద రూ.30వేలు డిమాండ్ చేశారు. గతంలోనే ఇదే పనికి రూ.20 వేలు లంచం పుచ్చుకున్నట్టు తెలిసింది. మళ్లీ గ్రావెల్ తీస్తుండగా అటవీ శాఖ సిబ్బంది వచ్చి జేసీబీ, ట్రాక్టర్లు పట్టుకున్నారు. మరోసారి రూ.15వేలు మామూలు ఇచ్చినట్టు తెలిసింది. మళ్లీ తాజాగా రూ.50 వేలు డిమాండ్ చేసినట్టు తెలిసింది. చివరికి రూ.30 వేలకు ఒప్పందం కుదుర్చుకుని.. వేధింపులు భరించలేక విసిగిపోయిన గుత్తేదారు ఏసీబీని ఆశ్రయించారు. దీంతో ఏసీబీ డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో కొమరారం అటవీ రేంజ్ కార్యాలయంపై దాడులు నిర్వహించారు. రూ.30 వేలు లంచం తీసుకుంటుండగా రేంజర్ ఉదయ్ కిరణ్, బీట్ ఆఫీసర్ సునావత్ హరిలాల్‌ను పట్టుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కార్గో విమానానికి తప్పిన ప్రమాదం

- శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసర ల్యాండింగ్

నవతెలంగాణ-శంషాబాద్


బ్లూడార్ట్ కార్గో విమానామానికి ప్రమాదం తప్పింది. విమానంలో గేర్ బాక్స్ పనిచేయకపోవడంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. కార్గో విమానం చెన్నయ్ నుంచి మరో ప్రదేశానికి వెళ్తోంది. ఈ సమయంలో విమానంలో గేర్ బాక్స్ పనిచేయకపోవడంతో అత్యవసరంగా శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమాచారం అందించారు. విమానం దిగడానికి ఎయిర్‌పోర్టు అధికారులు అనుమతించారు. చాకచక్యంగా వ్యవహరించిన పైలట్ సురక్షితంగా కిందికి దింపారు. ల్యాండింగ్ అయిన సమయంలో విమానంలో 5మంది సిబ్బంది ఉన్నట్టు అధికారులు తెలిపారు.

రూ.22 లక్షల విదేశీ కరెన్సీ పట్టివేత

విమానాశ్రయంలో మంగళవారం పెద్దమొత్తంలో విదేశీ కరెన్సీ పట్టుబడింది. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి దుబాయ్‌కి వెళ్తున్న ఓ ప్రయాణికుడి కదలికలపై సీఐఎస్ఎఫ్ అధికారులకు అనుమానం వచ్చింది. అప్రమత్తమైన అధికారులు అతనితోపాటు లగేజ్‌ని పరిశీలించారు. ఈ తనిఖీలో రూ.22 లక్షల విలువైన విదేశీ కరెన్సీ పట్టుబడింది. ప్రయాణికుడిని అమీర్ అహ్మద్‌గా గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

జానపద కళాకారులకు శివరాత్రి ప్రదర్శనలు ఇప్పించాలి

- జానపద వృత్తి పరిరక్షణ జేఏసీ అధ్యక్షులు మురళీధర్ దేశ్ పాండే, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు



నవతెలంగాణ - ముషీరాబాద్

ఉపాధి కోల్పోయి దయనీయ స్థితిలో ఉన్న జానపద వృత్తి కళాకారులకు శివరాత్రి జాగారం సందర్భంగా తమ కళలు ప్రదర్శించే అవకాశం కల్పించాలని జానపద వృత్తి పరిరక్షణ జేఏసీ అధ్యక్షులు మురళీధర్ దేశ్‌పాండే, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం గోడపత్రిక ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీధర్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. 15 సంవత్సరాల కిందట డీపీఆర్‌ఓ కింద కళాకారులకు జీవనభృతి కల్పించారని, కానీ తెలంగాణ వచ్చినప్పటి నుంచి జీవనభృతి లేదని అన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డు, పింఛన్లు, ఇండ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. రవింద్రభారతి అగ్రహారంగా మారిందన్నారు. తక్షణమే తెలంగాణ జానపద అకాడమీని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్రంలో యక్షగాన జానపద కళాకారులపై సమగ్ర సర్వే చేయాలని, రవింద్రభారతిలో జానపద కళాకారుల ప్రదర్శనలకు అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జానపద కళాకారులకు రూ.500 కోట్లు కేటాయించాలని, అకాడమీకి చైర్మెన్‌ను నియమించాలని కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేయాలని, కళాకారులంతా రోడ్డెక్కి ఆందోళనకు సిద్ధం కావాలంటూ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్ సెన్సార్ బోర్డు చైర్మెన్ వి.రామకృష్ణారెడ్డి, జానపద మీడియా ఇన్‌చార్జి సీహెచ్ సుధాకర్ బ్రాహ్మణి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కార్డులు.. కోటి తిప్పలు

- చేర్పులూ మార్పుల్లోనూ చిక్కులు
- 'ఆధార్ నంబర్'తో అప్లికేషన్ నిర్ధారణ

ఆన్‌లైన్ ప్రక్రియలో ఇక్కట్లు | మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు





'కోడ్' ఉన్నచోట తప్పని ఎదురు చూపులు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కొత్త రేషన్‌కార్డుల దరఖాస్తుకు కోటి తిప్పలు పడాల్సి వస్తోంది. ఆన్‌లైన్ ప్రక్రియ ఆలస్యమవుతోంది. రేషన్‌కార్డుల దరఖాస్తుదారులు, పాత కార్డుల్లో చేర్పులు, మార్పుల కోసం మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మీ సేవ కేంద్రాల్లో అప్లికేషన్‌తో పాటు కుటుంబ సభ్యులందరి ఆధార్‌కార్డులు, చిరునామాకు సంబంధించి ఓటర్ ఐడీ లేదంటే కరెంట్ బిల్లు, ఇంటి పన్ను వంటి ధ్రువీకరణల జిరాక్స్‌లు తీసుకుంటున్నారు. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు పొందు పరుస్తున్నారు. ఇదంతా చేసి సబ్మిట్ చేశాక సర్వర్ డౌన్ లేదంటే ఆన్‌లైన్ ఎర్రర్.. ఇలాంటివేవో వస్తూ గంటల తరబడి ప్రక్రియ పూర్తి కావటం లేదు.

రూ.50 చార్జీతో ఆన్‌లైన్ చేయాల్సిన అప్లికేషన్‌కు మీ సేవ కేంద్రాల నిర్వాహకులు రకరకాల కారణాలు చెబుతూ కనీసం రూ.100కు తక్కువ కాకుండా వసూలు చేస్తున్నారు. జిరాక్స్‌ల పేరుతో ఒక్కో కాపీకి రూ.3 చొప్పున, ప్రింట్ ఇస్తే రూ.10-25 చొప్పున దండుకుంటున్నారని దరఖాస్తుదారులు వాపోతున్నారు. ఒక్కోసారి వెంటనే ఆన్‌లైన్ అవుతున్నా...కొన్నిసార్లు గంటల తరబడి వేచివుండాల్సి వస్తోందని, చేసేది లేక పూర్తి చేసిన హార్డ్‌కాపీ దరఖాస్తును మీసేవలో ఇచ్చి వెళ్తున్నారు. అవి ఆన్‌లైన్ అయ్యాక మొబైల్ నంబర్‌కు మెసేజ్ వస్తుందని చెబుతున్నా ఏమీ రాకపోవడంతో పదే పదే మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తుందని దరఖాస్తుదారులు చింతిస్తున్నారు.

ఆధార్ నంబర్‌తో అప్లికేషన్‌కు అర్హత నిర్ధారణ

మీసేవ కేంద్రాల్లో అప్లికెంట్ పేరు, ఆధార్ నంబర్ ఇవ్వగానే ఆన్‌లైన్‌లో చెక్ చేస్తున్నారు. దరఖాస్తు చేసుకోవచ్చని సూచిస్తేనే అప్లికేషన్ తీసుకుంటున్నారు. గతంలో ఫ్యామిలీ మెంబర్‌గా తెలంగాణ ప్రభుత్వ రేషన్‌కార్డులో నమోదై ఉంటే కొత్తకార్డు దరఖాస్తును ఒక్కోసారి ఆన్‌లైన్ ఆమోదించట్లేదు. కారణమేంటో మీసేవ కేంద్రాల నిర్వాహకులు చెప్పట్లేదు. తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే అక్కడా సరైన సమాధానం రావట్లేదు. వివిధ ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకోవడంతో లక్షలాది మంది కొత్త కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వం పదేండ్ల కిందట కొద్దిమందికి కార్డులు ఇచ్చి చేతులు దులుపుకుంది. ప్రస్తుత ప్రభుత్వం నిరంతర ప్రక్రియ పేరుతో ఇబ్బందులు పెడుతుండటంతో ప్రజల నుంచి ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రజాపాలనలో దరఖాస్తులు, వాటి ఆన్‌లైన్ ప్రక్రియలో దొర్లిన తప్పుల కారణంగా జనవరి 26 తర్వాత ప్రకటించిన అర్హుల జాబితాలో అనేక లోపాలు వెలుగుచూశాయి. మళ్లీ మీసేవల్లో దరఖాస్తు చేసుకోవాలనటం.. ఆన్‌లైన్ ఇక్కట్లు ఎదురవుతుండటంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

చేర్పులు.. మార్పుల్లోనూ సమస్యలు

పాత కార్డుల్లోని ఫ్యామిలీ మెంబర్ల చేర్పులు మార్పులకూ ప్రభుత్వం అవకాశం ఇచ్చింది. కానీ వాటి ఆన్‌లైన్ విషయంలోనూ చిక్కులు ఏర్పడుతున్నాయి. ఈ పదేండ్లలో వివాహాలై అనేక మంది వేర్వేరు కార్డుల్లో ఫ్యామిలీ మెంబర్లుగా ఉన్నారు. వారిని ముందుగా వాటిలో నుంచి తొలిగించిన తర్వాతే కొత్త కార్డు దరఖాస్తును ఆన్‌లైన్‌లో ఆమోదించే పరిస్థితి ఉంది. కుటుంబ సభ్యుల్లో ఎవరైనా మరణిస్తే మళ్లీ అదో తతంగం. రాష్ట్రంలో ఇప్పటికే 89.96 లక్షల మందికి రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటిలో 2.1 కోట్ల మంది సభ్యులు ఉన్నారు. కొత్తగా మరో పది లక్షల మందికి పైగా ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నారు. అంతా సవ్యంగా పూర్తయితే రాష్ట్రంలో కోటి మందికిపైగా రేషన్‌కార్డుదారులు ఉండే అవకాశం ఉంది.

అర్హుల ఎంపికపై వ్యతిరేకత

ప్రజాపాలనలో భాగంగా కొత్త రేషన్ కార్డుల కోసం ఖమ్మం జిల్లాలో 51,558 మంది, భద్రాద్రి కొత్తగూడెంలో 42,644 మంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ గ్రామసభల్లో ఖమ్మంలో 17,088, భద్రాద్రిలో 38,879 దరఖాస్తులను మాత్రమే ఎంపిక చేయడంపై నిరసనలు వ్యక్తమయ్యాయి. వివిధ గ్రామాల్లో అధికారులు వెల్లడించిన జాబితాపై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. చాలాచోట్ల బీఆర్ఎస్ అధికారంలో ఉండగా గ్రామ, మండల స్థాయిలో అధికారులతో సత్సంబంధాలున్న నేతల సూచన మేరకే ఎంపికలు జరిగినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో జాబితాలో పేర్లు రానివారు, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మళ్లీ అర్జీలు పెట్టుకునే అవకాశం కల్పించారు. గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా ఆన్‌లైన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ ముగిసిన తర్వాత అర్హులు ఎవరనేది తేల్చనున్నారు. రాష్ట్రంలో లక్ష రేషన్ స్మార్ట్‌కార్డుల జారీకి ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో లేని జిల్లాల్లో ముందుగా ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిబంధనలు ఉన్న చోట లబ్దిదారులు మరికొంత కాలం వేచిచూడక తప్పని స్థితి నెలకొంది. రేషన్‌కార్డులపై నెలకొన్న సమస్యలపై సివిల్ సప్లయ్ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వ మార్గదర్శకాలకనుగుణంగా ఎంపికలు జరిగాయని చెబుతుండటం గమనార్హం.

వర్సిటీల అభివృద్ధికి రూ.5 వేల కోట్లు కేటాయించాలి

- సమస్యలు పరిష్కరించాలి : సీఎం రేవంత్‌రెడ్డికి జాన్‌వెస్లీ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. రాష్ట్రంలోని 15 విశ్వవిద్యాలయాల్లో మౌలిక సదుపాయాల్లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల తాను ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) సందర్శించిన సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు, రీసెర్చ్ స్కాలర్లు అక్కడి సమస్యలను తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. వర్సిటీల్లో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లతోపాటు బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఖాళీ పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడంలేదని తెలిపారు. కాంట్రాక్టు లెక్చరర్లను సుదీర్ఘకాలం కొనసాగిస్తున్నారని వివరించారు. నిధుల కొరత తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. ల్యాబ్ పరికరాలు, హాస్టళ్లు, మెస్, స్పోర్ట్స్, ఇతర మౌలిక సదుపాయాల సమస్యలు కూడా ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇటీవల హాస్టళ్లలో శ్లాబ్ పెచ్చులు ఊడిపడి విద్యార్థులు గాయపడ్డారని వివరించారు.

వందేండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయం నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) గుర్తింపులో వెనుకబడి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వర్సిటీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. విశ్వవిద్యాలయాల భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని తెలిపారు. వాటిని పరిరక్షించేందుకు తగు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థినిలపై వేధింపులు నిరోధించడానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో స్కిల్ యూనివర్సిటీ ఒక్కటే కాకుండా ప్రతి వర్సిటీనీ స్కిల్ యూనివర్సిటీగా మార్చేందుకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సానుకూలంగా పరిశీలించి వర్సిటీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు చేపట్టాలని కోరారు.

డిమాండ్లు :

- విశ్వవిద్యాలయాలకు రూ.ఐదు వేల కోట్లు, ప్రత్యేకంగా ఉస్మానియా వర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.
- వర్సిటీల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను తక్షణమే భర్తీ చేయాలి.
- నూతన భవనాలను నిర్మించాలి. మోడ్రన్ లైబ్రరీ, సైన్స్ ల్యాబ్, రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలి.
- ప్రతి పీహెచ్‌డీ విద్యార్థికి నెలకు రూ.25 వేలు ఫెలోషిప్‌లను అందించాలి.
- అన్ని వర్సిటీలకూ రీసెర్చ్ గ్రాంట్లను ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలి.
- కాంట్రాక్టు, పార్ట్ టైం టీచర్ల వేతనాలను పెంచాలి.
- వర్సిటీల్లో విద్యార్థి సంఘం గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలి.

రాష్ట్ర అభివృద్ధి, ప్రణాళికా సంఘం (టీజీడీపీఎస్) సలహా కమిటీ ఏర్పాటు

- సభ్యులుగా 9 మంది, చైర్మెన్‌గా డిప్యూటీ సీఎం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ డెవలప్‌మెంట్, ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) సలహా కమిటీని తొమ్మిది మందితో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆ కమిటీకి చైర్మెన్‌గా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యవహరించనున్నారు. సభ్యులుగా ప్రొఫెసర్ కంచ ఐలయ్య, ప్రొఫెసర్ శాంతసిన్హా, ప్రొఫెసర్ హిమాన్షు, డాక్టర్ సుఖ్‌దేవ్ థోరట్, నిఖిల్ దేయ్, ప్రవీణ్ చక్రవర్తి, ప్రొఫెసర్ భూక్యా ప్రొఫెసర్ పురుషోత్తమ్‌రెడ్డి ఉండనున్నారు. దీనికి సంబంధించి మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 2ని విడుదల చేసింది.

రాజులు వద్దు..

"నో కింగ్స్" థీమ్ 50501 ఉద్యమాలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఆయన విధానాలకు వ్యతిరేకంగా నిరసనకారులు గళం విప్పుతున్నారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోయినా తూర్పు తీర నగరాల్లో "ప్రెసిడెంట్స్ డే నాడు రాజులు వద్దు" అని నినాదాలతో ప్రదర్శనలు నిర్వహించారు. వేగంగా మారుతున్న ఫెడరల్ ఇమ్మిగ్రేషన్ అమలును బలోపేతం చేసే బిల్లును వ్యతిరేకిస్తూ ఫ్లోరిడా, కాలిఫోర్నియా, డల్లాస్ సహా పలు నగరాల్లో ప్రజలు ఆందోళనకు దిగారు. లాస్ ఏంజిల్స్‌లో ట్రంప్ విధానాలకు వ్యతిరేకంగా జరిగిన ర్యాలీలో ప్రదర్శనకారులు పోస్టర్లు పట్టుకుని కవాతు చేశారు.

"50 నిరసనలు, 50 రాష్ట్రాలు, ఒక రోజు" అంటే "50501".. రెండోసారి గద్దెనెక్కిన ట్రంప్ పరిపాలన, విధానాలు, చర్యలను నిరసించేలా ఉద్యమాలు నిర్వహిస్తున్నారు. బోస్టన్‌లోని స్టేట్‌హౌస్ నుంచి సిటీ హాల్ వరకు మంచులో కవాతు చేస్తూ "ఎలన్ మస్క్ వెళ్ళిపోవాలి" అంటూ నినాదాలు చేశారు.. గడ్డకట్టే స్థాయి కంటే తక్కువ మంచులోనూ గళమెత్తారు.బోస్టన్‌లో విప్లవాత్మక యుద్ధ శైలి దుస్తులు ధరించి, "ఇది తిరుగుబాటు" .. "ట్రంప్‌కు పిరికివాళ్లు నమస్కరిస్తారు, దేశభక్తులు ఎదురొడ్డి నిలబడతారు" వంటి ప్లకార్డులతో నినదించారు. ర్యాలీలో బోస్టన్ ఇంజనీర్ ఎమిలీ మానింగ్, తన ఇద్దరు టీనేజ్ కుమారులతో హాజరయ్యారు. "అమెరికన్ విలువలు ధనవంతుల విలువలు లేదా పరిమిత కొద్దిమంది ధనవంతులు కాదు."అని మానింగ్ చెప్పారు.దేశ రాజధానిలో వందలాది మందిని ఆకర్షించిన ర్యాలీలో ఒక బోర్డు "ట్రంప్‌ను మస్క్‌ను గద్దె దించు" అని ప్రదర్శించారు.

విద్యార్థినిపై ఒత్తిడి తెచ్చి.. ఫిర్యాదు లెటర్ వెనక్కి?

- లెక్చరర్ మందలించాడన్న కోపంతో తప్పుగా చెప్పిందంట
- సీసీ కెమెరాల ఆధారంగానే బాలిక ఘటనపై విచారణ
- ఏమీ లేదని తేల్చిన పోలీసులు
- అధ్యాపకుడితో బాలిక, తల్లిదండ్రులకు క్షమాపణలు చెప్పించిన ప్రిన్సిపాల్?

నవతెలంగాణ-సిటీబ్యూరో/కంటోన్మెంట్

సికింద్రాబాద్ వెస్ట్ మారేడుపల్లిలోని ఓ కళాశాలలో లెక్చరర్ వేధింపుల విషయంలో బాధిత బాలికపై ఒత్తిడి తెచ్చి ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేసినట్టు తెలిసింది. ఘటనపై విద్యార్థిని తల్లి, బంధువులు కాలేజీ ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిన అంశాలతో కూడిన కథనాన్ని సోమవారం 'నవతెలంగాణ'లో ప్రచురించిన విషయం తెలిసిందే. అయితే, విద్యార్థినిపై అధ్యాపకుని అసభ్య ప్రవర్తనపై తల్లిదండ్రుల ఫిర్యాదు లెటర్‌ను వెనక్కు తీసుకోవాలని ప్రిన్సిపాల్, సిబ్బంది ఒత్తిడి తీసుకొచ్చినట్టు సమాచారం. విద్యార్థిని ఇచ్చిన కంప్లైంట్‌పై సీసీ కెమెరాల్లో ఆధారాలు లేవని ఆ అధ్యాపకుడిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని తెలిసింది. సదరు విద్యార్థిని ఆ అధ్యాపకుని వల్ల తనకు వేధింపులు ఉన్నాయని రాతపూర్వకంగా తల్లిదండ్రులు, బంధువులతో వచ్చి ఫిర్యాదు లెటర్ ఇస్తే దాని ఆధారంగా విచారణ చేయకుండా.. సీసీ కెమెరాల రికార్డులో ఆధారాలు లేవని చెప్పి విషయాన్ని పక్కదారి పట్టించే ప్రయత్నం ప్రిన్సిపాల్ చేస్తున్నట్టు తెలుస్తోంది. పైగా, కంప్లైంట్ ఇచ్చిన తల్లిదండ్రులకు, బాధిత విద్యార్థినికి సదరు అధ్యాపకుడితో క్షమాపణలు చెప్పించి రాజీ కుదిర్చినట్టు సమాచారం. అంతేగాక మరోసారి తప్పు జరగకుండా చూసుకుంటామని బాలిక పేరెంట్స్‌కు హామీ ఇచ్చినట్టు తెలిసింది.

కళాశాలకు స్పెషల్ బ్రాంచ్, స్థానిక పోలీసులు

ఇదిలావుంటే 'నవతెలంగాణ'లో వచ్చిన వార్తపై స్పందించిన స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, మారేడుపల్లి సివిల్ పోలీసులు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. సీసీ ఫుటేజ్‌లను గంటకుపైగా పరిశీలించారని, మారేడుపల్లి మహిళా ఎస్ఐ సౌందర్య.. విద్యార్థినిని వ్యక్తిగతంగా విచారణ చేశారని కాలేజీ ప్రిన్సిపాల్ తెలిపారు. సదరు విద్యార్థిని విషయంలో ఏం జరిగిందన్న విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ.. కళాశాలలో ఎలాంటి ఘటనా జరగలేదని, విద్యార్థినిని లెక్చరర్ మందలించారని, ఆ కోపంతో తల్లిదండ్రులకు తప్పుగా చెప్పిందని, దాంతో వారు ఆందోళనకు గురై కాలేజీలో సీసీ కెమెరాలు చూడటానికి వచ్చారని తెలిపారు. సీసీ కెమెరాలో అలాంటిదేమీ లేకపోవడంతో బాలికదే తప్పు అని తేలిందని చెప్పారు.

సైబర్‌సేఫ్ స్టేట్‌గా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

రేకెత్తించే చర్యలు కూడా జరుగుతున్నాయని ఉదహరించారు. ఇలాంటి సైబర్ నేరాల కట్టడి కోసం ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని భరోసా ఇచ్చారు. దీనికోసం సైబర్ సెక్యూరిటీ సొల్యూషన్స్ కోసం ఎకో సిస్టమ్ వ్యవస్థను ఏర్పాటు చేసి, నిపుణులు, ఐటీ సంస్థలతో కలిసి పనిచేయడానికి అవసరమైన అన్ని వనరులను ప్రభుత్వం సమకూరుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను ఆర్థిక, వ్యాపార భద్రతకు కేంద్రంగా మార్చడమే లక్ష్యమని చెప్పారు. సైబర్ నేరాల కట్టడిలో భాగంగా 24 గంటలూ పనిచేసే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ క్రైం నుంచి ప్రజల్ని రక్షించేందుకు సైబర్ సెక్యూరిటీ బ్యూరో, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ ఉన్న అతికొద్ది రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని గుర్తుచేశారు. గత ఏడాది ఏడు కొత్త సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్లను ప్రారంభించామని తెలిపారు. నేరం జరిగిన తర్వాత నేరస్తులను పట్టుకోవడం కాదనీ, నేరం జరగకుండా నిరోధించేలా వ్యవస్థల రూపకల్పన ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ సైబర్ నేరాల ప్రమాదం, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని వివరించారు. ఢిల్లీ ఎయిమ్స్ ఆస్పత్రి,పవర్ గ్రిడ్‌లపై కూడా సైబర్ దాడులు జరిగాయని ఉదహరించారు. కానీ సమర్థవంతంగా భారతీయ టెకీలు దాన్ని నిలువరించగలిగారని చెప్పారు. గణాంకాల ప్రకారం దేశంలో 15వేల సైబర్ క్రైం కేసులు నమోదయ్యాయనీ, వివిధ కారణాలతో నమోదు కాని కేసులు దీనికి రెండింతలు ఉంటాయని తెలిపారు. డేటా చౌర్యాన్ని నిరోధించడమే అతిపెద్ద సవాలుగా ఉందన్నారు. దానికోసమే దావోస్ పర్యటనలో గూగుల్‌తో 1 గిగావాట్ సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఏర్పాటుకు ఒప్పందం చేసుకున్నామని వివరించారు. ప్రజలకు డిజిటల్ రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని స్పష్టంచేశారు. కార్యక్రమంలో డీజీపీ జితేందర్, హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ షికాగోయల్ స్వాగతోపన్యాసం చేశారు.

గోయాస్‌తో ఒప్పందం

బ్రెజిల్‌కు చెందిన గోయాస్ హబ్ రాష్ట్రంలోని టీహబ్‌తో కలిసి పనిచేసేందుకు అవగాహన ఒప్పందం చేసుకుంది. హెచ్ఐసీసీలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో టీహబ్ ఫౌండేషన్ సీఈవో సుజిత్, బ్రెజిల్‌కు చెందిన గోయాస్ స్టేట్ సైన్స్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్స్ సెక్రెటరీ జోస్ ఫ్రెడెరికో లైరా నెట్టో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఐటీ, అగ్రి-టెక్, హెల్త్‌కేర్, బయోటెక్, మైనింగ్ రంగాల్లో ఈ సంస్థలు కలిసి పనిచేస్తాయి.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించండి

- ఎమ్మెల్సీ, ప్రస్తుత అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి



నవతెలంగాణ-వరంగల్

వరంగల్-ఖమ్మం-నల్లగొండ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గానికి 2025 ఫిబ్రవరి 27న జరగనున్న ఎన్నికల్లో తనను గెలిపించాలని ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2019లో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యాయ అధ్యాపక సంఘాల మద్దతుతో ఎమ్మెల్సీగా ఎన్నికై ఉపాధ్యాయ, అధ్యాపకుల గొంతుకగా నిరంతరం పనిచేశానన్నారు. యూఎస్ పీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యోగ, ప్రజా సంఘాలు చేపట్టిన పోరాటాలకు మద్దతుగా నిలిచానని తెలిపారు. కేజీబీవీ, యూఆర్ఎస్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయ ఉద్యోగులకు వేసవి సెలవులు సహా 12 నెలలు జీతం వచ్చేలా చేయడంలో కృషి చేశానని చెప్పారు. తెలంగాణ మొదటి పీఆర్‌సీని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయడంలో, 180 రోజుల ప్రసూతి సెలవులను సాధించడంలోనూ అద్వితీయమైన కృషి చేశానన్నారు. బేసిక్ పే సాధన కోసం పని చేస్తున్నామన్నారు. పది సంవత్సరాలుగా మోడల్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి పని చేశానని, మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలకు ఏర్పడిన న్యాయమైన ఆటంకాలను అధిగమించి బదిలీలు జరిగేలా ఉత్తర్వులు సాధించానని తెలిపారు. ప్రమోషన్లు, 010 పద్దు ద్వారా వేతనాల చెల్లింపు కోసం కృషి చేశానన్నారు. ఎయిడెడ్ టీచర్లకు సకాలంలో వేతనాల మంజూరు కోసం నిరంతరం పాటుపడ్డానన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, ప్రమోషన్లు జరిపించడంతోపాటు పండిట్, పీఈటీల పోస్టుల అప్‌గ్రేడేషన్, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు నూతన ఉపాధ్యాయ పోస్టుల మంజూరు, సీఆర్‌టీ వేతనాల సమస్యల పరిష్కారానికి ప్రయత్నించినట్టు తెలిపారు. పాఠశాల విద్యారంగంలో నిలిచిన ఉపాధ్యాయ ప్రమోషన్స్, బదిలీలు జరగడానికి తన వంతు కృషి చేశానని వివరించారు. టెట్ వివాదం పరిష్కారానికి ఢిల్లీలో ఎన్సీటీఈ అధికారులతో చర్చించి మార్గం సుగమం చేశానన్నారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల కాంట్రాక్టు లెక్చరర్ల రెగ్యులరైజేషన్ సాధించడంలో అత్యంత కీలక పాత్ర పోషించానన్నారు.

డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల బదిలీల షెడ్యూల్ జారీ చేయించానన్నారు. కాకతీయ, మహాత్మాగాంధీ యూనివర్సిటీలలో కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ సమయంలో ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా ఉత్తర్వులు సాధించానన్నారు. ప్రయివేట్ విశ్వవిద్యాలయాల బిల్లును వ్యతిరేకించి ఏకైక ఎమ్మెల్సీగా నిలిచానన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని పాఠశాలలు, కళాశాలల్లో అవసరమైన భవనాలు, ప్రహారీల నిర్మాణానికి కేటాయించడమే కాకుండా వాటిని సకాలంలో వినియోగించినట్టు తెలిపారు. పేద ప్రజలకు వైద్య సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నాలుగు కోట్ల రూపాయలు మంజూరు చేయించానని వివరించారు. తన వేతన భత్యాలను కూడా ప్రజా సంక్షేమానికి ఖర్చు చేసి చట్టసభల సభ్యులకు రోల్ మోడల్‌గా నిలిచానన్నారు. అంగన్‌వాడీ, ఆశ, సర్వశిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ.. వారి పోరాటాలకు మద్దతుగా నిలిచానని తెలిపారు. మరోసారి తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే మరిన్ని సమస్యల పరిష్కారం, ప్రభుత్వ విద్యారంగం బలోపేతం కోసం పాటుపడటమే కాకుండా ఉపాధ్యాయ, అధ్యాపకుల పక్షాన నిలుస్తానని హామీ ఇచ్చారు.




హింస లేని సమాజానికై...

మీనాక్షి మల్హోత్రా.. ప్రతీకారం, న్యాయం అందించడం మధ్య వ్యత్యాసాన్ని చూపుతున్నారు. దేశంలో ఎన్‌కౌంటర్, మరణశిక్షపై ఆధారపడకుండా హింస లేని సమాజాన్ని ఎలా సృష్టించాలో వివరిస్తున్నారు. అన్యాయం, అసౌకర్య భావనను రేకెత్తించే ఉద్దేశ్యంతో ఈ పుస్తకం రూపొందించ బడిందని మితాలి చక్రవర్తి తన ముందు మాటలో చెప్పారు. ఈ సంకలనంలోని వ్యాసాలు, కథలు, కవితలు అనేక సమస్యలను గుర్తించి చక్కగా వివరించాయి. మన సమాజాలలో విస్తృతంగా వ్యాపించిన హింస గురించి ఆందోళన చెందుతున్న పాఠకులకు ఈ పుస్తకంలో అసరమైన సమాచారం, ఆలోచనలు, లోతైన అవగాహనను కనుగొంటారు. సమాజ మార్పుకు, అందుకు అవసరమైన అవగాహన పెంచుకునేందుకు దోహదపడే సంకలనం ఇది.

మా కథలు.. మా పోరాటాలు..

ఇది ఓ సాధారణ పుస్తకమే కావొచ్చు... కానీ స్త్రీల పట్ల సమాజం చూపుతున్న వివక్ష ఎంత తీవ్రంగా ఉందో కండ్లకు కట్టినట్టు మనకు చూపిస్తుంది. రోజురోజుకు మహిళల జీవితాల్లో హింస ఎలా వ్యాపిస్తుందో తెలియజేస్తోంది. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన లైంగిక దాడి, హత్య తర్వాత విడుదలైన 'అవర్ స్టోరీస్, అవర్ స్ట్రగుల్: హింస - మహిళల జీవితాలు' అనే ఈ సంకలనం ఓ చర్చనీయాంశంగా మారింది. ఎంతోమందిని ఆలోచింపజేస్తున్న ఆ పుస్తకంలో అసలేముందే తెలుసుకుందాం...



ఈ సంకలనం అంతటా మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులే మనకు కనిపిస్తాయి. 'బిరంగోనా' అనే కవితలో.. విముక్తి యుద్ధంలో పాకిస్తాన్ దళాలచే అత్యాచారం చేయబడిన వేల మంది బంగ్లాదేశ్ మహిళల గురించి సదాఫ్ సాజ్ రాశారు. భారత రాష్ట్రంలోని సైనిక, పారా మిలటరీ దళాలు మణిపూర్ మహిళలపై అత్యాచారాన్ని ఆయుధంగా ఎలా ఉపయోగించాయో తెరెసా రెహ్మాన్, హెూయినిల్హింగ్ సిథౌ వివరించారు. 2023 సంఘర్షణ సమయంలో ఆధిపత్య మెయిటీ కమ్యూనిటీకి చెందిన పురుషులు కుకి మహిళలపై అత్యాచారం చేసిన ఘటనలను ఆమె తన కవిత్వంలో చెప్పారు.

జాతి హింసతో పోరాటం

స్గురాంగ్ రీనా 2009లో అరుణాచల్ ప్రదేశ్ నుండి ఢిల్లీకి తరలివెళ్లారు. 'హిడెన్ వల్నరబిలిటీస్'లో ఆమె భారతదేశ జాతి, లింగ యుద్ధాల కాలంలో జీవించిన అనుభవాలపై దృష్టి పెడుతున్నారు. భారతదేశ ఈశాన్య ప్రాంతం నుండి 'ప్రధాన భూభాగం'కి వలస వచ్చినవారు ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం వంటి వారి ప్రాథమిక అంశాలలో జాతి హింసతో ఎలా పోరాడుతున్నారో వివరిస్తున్నారు. అక్కడి ప్రజలు సాంస్కృతిక, నైతిక పోలీసింగ్‌ను ఎదుర్కొంటున్నారు. వారి ఆహారం, దుస్తులు, జీవనశైలి, ఆదాయ మార్గాలు, సంబంధాలు, వినోదం వంటి విషయాలలో భారతీయ సమాజం నుండి వివక్ష అనుభవిస్తున్నారు. అంతేకాదు మహానగరాలలో మహిళా వలసదారులు ఎదుర్కొంటున్న గుర్తింపు సమస్యలను ఆమె విశ్లేషిస్తున్నారు. మహిళల భద్రత, శ్రేయస్సుతో పాటు విస్మరించబడుతున్న అనేక అంశాలను ఆమె తన కవిత్వంలో లేవనెత్తారు.

పునరుత్పత్తితో పాటు...

శ్రీలంక మహిళల సాహిత్య వారసత్వంపై వచ్చిన ఒక వ్యాసంలో.. సిమ్రాన్ చద్దా రాజకీయ లక్ష్యాలు, మహిళల ప్రవర్తన, శరీరాలకు ఆపాదించబడిన జాతి లక్షణాలు ఎంత దారుణంగా ఉన్నాయో పరిశీలిస్తుంది. మూడు దశాబ్దాలుగా కొనసాగిన సమాజాల మధ్య యుద్ధంలో పాత్రలు, గుర్తింపులు ఎలా పునర్నిర్వచించబడ్డాయో విశ్లేషించడానికి LTTE మహిళా కార్యకర్తల నుండి సింహళ మహిళల వరకు శ్రీలంకలోని మహిళలు రాసిన రచనలను ఆమె ప్రస్తావించారు. పునరుత్పత్తితో పాటు మహిళలు మాతృభూమి సేవలో చురుకైన యోధులుగా ఉండాల్సిన కొత్త స్త్రీత్వం ఆలోచనను LTTE మహిళా యోధులు స్వీకరించారు.

పదే పదే దాడి

జీవిత భాగస్వాముల హింస, భర్తలు తమ భార్యలను కొట్టడంతో పాటు అనేక కథనాలు ఇందులో ఉన్నాయి. 'డు యు వాంట్ టు డై యంగ్'లో ఫరా అహ్మద్ భర్త చేత మానసికంగా, శారీరకంగా, లైంగికంగా హింసించబడిన ఓ స్త్రీ గురించి రాశారు. ఈ మహిళపై వివిధ సంస్థలు, వ్యక్తులు పదే పదే దాడి చేయడంతో కుటుంబం, రాష్ట్రం, సమాజం మధ్య కుట్ర బయటపడుతుంది. 'శ్రీజస్ స్టోరీ', 'ది ఫోన్ కాల్'లలో సంప్రదాయాలు, సామాజిక నిబంధనలను ధిక్కరిస్తూ ప్రేమించి పెండ్లి చేసుకున్న పురుషులు తర్వాత కాలంలో ఎంత భయంకరంగా మారి మహిళలను హింసిస్తున్నారో మనం చూస్తాము.

పురుషాధిక్యతను ప్రశ్నిస్తుంది

ఈ సంపుటి ఇప్పటి వరకు చెప్పని అనేక విషయాల గురించి మాట్లాడుతుంది. గౌరవ హత్యలు, సతి, లైంగిక దాడి, అత్యాచారం తర్వాత మహిళలను విస్మరించడాన్ని కూడా వివరిస్తుంది. ఇల్లు, కుటుంబం అనే ఆలోచనను ఇది ప్రశ్నిస్తుంది. తండ్రులు, మామలు, భర్త తరపు బంధువులు, ఆ కుటుంబాలలోని మహిళలు ఇలా స్త్రీలను క్రూరంగా హింసించే ఎన్నో కథలు ఇందులో ఉన్నాయి. ఈ పురుషాధిక్యతను సవాలు చేస్తూ తమ సోదరీమణులను, కుమార్తెలను హింస, దుర్వినియోగం నుండి రక్షించలేనప్పుడు సోదరులు, తండ్రులు ఎదుర్కొనే దుఃఖం, నిస్సహాయతను కూడా మనం చూడొచ్చు.





యాసిడ్ దాడులపై...

ఈ సంకలన సంపాదకులలో ఒకరైన రత్నోత్తమ సేన్‌గుప్తా.. 'వెన్ కిన్ సేస్ కిల్' అనే వ్యాసంలో ప్రధానంగా భారతదేశం, పాకిస్తాన్‌లో 'గౌరవ హత్యలు' గురించి రాశారు. ఈ హత్యలు ఎక్కువగా పాకిస్తాన్‌లో జరుగుతున్నాయి. 'ఎ ఫేస్ దట్ మేక్స్ డెత్ షివర్'లో సేన్‌గుప్తా యాసిడ్ దాడుల గురించి రాశారు. అక్కడ పురుషులు మహిళలపై యాసిడ్ పోసి ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుంటారు. సేన్‌గుప్తా తన విశ్లేషణలో బాధితుల సోషల్ మీడియా అకౌంట్లు, ప్రభుత్వ డేటా, చట్టపరమైన నిబంధనలు, వార్తాపత్రిక నివేదికలపై ఆధారపడి ఈ క్రూరత్వం వివిధ అంశాలను ప్రదర్శిస్తుందని తెలిపారు. అలాగే సాంస్కృతిక అంచనాలు, వేగవంతమైన వైద్య సంరక్షణ లేకపోవడం, చట్ట అమలు సరిపోకపోవడం వంటి వాటిని కూడా నొక్కి చెబుతున్నారు.

మైనార్టీలే లక్ష్యంగా...

ఇది విభిన్న శైలులు, కథలు, ఆలోచనలను కలిపి రూపొందించబడిన సేకరణ. చాలా మంది రచయితలు మార్పు కోసం సూచనలు అందించారు. సమాజాన్ని ప్రశ్నించేందుకు ఏమాత్రం వెనుకాడలేదు. భారత ప్రభుత్వం, దాని సంస్థలు మహిళలపై జరుగుతున్న లైంగిక హింసకు పాల్పడుతున్న వారిని ఎలా క్షమించారో కల్పనా కన్నబిరాన్ మనకు తెలియజేస్తారు. మైనారిటీలను లక్ష్యంగా చేసుకున్న హింసకు స్పష్టమైన ఉదాహరణలు ఉన్నాయి. అయితే వీటిని మహిళలు ప్రతిఘటించారు. తమతమ స్థాయిలో జోక్యం చేసుకోవడం, కోర్టుకు వెళ్లడం ద్వారా మెజారిటీ రాజ్యాన్ని ప్రశ్నించడంపై దృష్టి సారించారు.

స్త్రీని ఓ ఫర్నీచర్‌గా...

ఉల్లంఘన, అణచివేత, స్వేచ్ఛా పితృస్వామ్యాన్ని ఈ విశ్లేషణ హైలైట్ చేస్తుంది. ఓ ఫర్నీచర్ లాగా స్త్రీలను వారి కుటుంబాలు ఉంచే చోట ఉంచుతారు, వారు కూడా దానికి అనుగుణంగా ఉండాలి. 'ది సోషల్ వర్కర్'లో ఆయ్షా బాకీర్.. మహిళల మధ్య ఉద్రిక్తతలు, సమాజంలోని తరగతి విభజనలు, ఆత్మవిశ్వాసంతో ఉన్న మహిళల వెనుక దాగి ఉన్న కథల గురించి రాశారు. మహిళల జీవితాల్లోని చీకటి, నిస్సహాయత, అలాగే వారు తమను తాము పునర్నిర్మించుకోవడానికి తీసుకునే చర్య గురించి ఈ విశ్లేషణ మాట్లాడుతుంది. పదహారేండ్ల వయసులో నేపాల్ నుండి భారతదేశానికి అక్రమ రవాణా చేయబడిన చరిమయ తమంగ్ తిరిగి వచ్చి 1997లో అక్రమ రవాణాదారులకు వ్యతిరేకంగా ధైర్యంగా సాక్ష్యమిచ్చిందని చదవడం స్ఫూర్తిదాయకం.

ఇట్ల చేద్దాం..

చెక్క ఫర్నిచర్, కిచెన్ ప్లాట్‌ఫామ్‌పై నీటి మరకలు ఓ పట్టానా వదలవు. అలాంటప్పుడు ఆలివ్ నూనె, ఉప్పు కలిపి పేస్ట్‌లా తయారు చేసిన మిశ్రమాన్ని మరకలున్న చోట అప్లై చేయాలి. గంట తర్వాత పొడి క్లాత్‌తో తుడిస్తే చాలు. ఇలాగే కిచెన్ ప్లాట్‌ఫామ్‌ను కూడా శుభ్రం చేసుకోవచ్చు.

ఆదాయపన్ను బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనలా ?

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల బాండ్ల ద్వారా వచ్చిన ఆదాయాన్ని చేర్చకూడదు' అని అందులో పేర్కొన్నారు. ప్రస్తుతం అమలులో ఉన్న 1961 సంవత్సరపు ఆదాయపన్ను చట్టం ప్రకారం ఎన్నికల బాండ్ల ద్వారా కంపెనీలు, వ్యక్తుల నుండి వచ్చిన విరాళాల నుండి రాజకీయ పార్టీలకు మినహాయింపు ఉంది. 64 సంవత్సరాల నాటి ఐటీ చట్టం స్థానంలో కేంద్ర ప్రభుత్వం నూతన ఆదాయపన్ను బిల్లును తీసుకొచ్చింది. చట్టానికి 4000కు పైగా సవరణలు చేసినందున అది సంక్లిష్టంగా మారిందని, అందుకే దానిని సరళీకరించి 622 పేజీల బిల్లును తీసుకొచ్చామని ప్రభుత్వం చెబుతోంది.

ప్రభుత్వ చర్యలు చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసేందుకు వాటిని సమీక్షించడం, పర్యవేక్షించడం సాధారణంగా జరిగే పనే. అందుకోసం కొత్త బిల్లులో ఎన్నికల బాండ్ల నిబంధనను చేర్చి ఉండవచ్చునని లేదా భవిష్యత్తులో ఆ పథకాన్ని సవరించి మరో దారిలో తీసుకొచ్చేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నం కూడా కావచ్చునని ఏఎంఆర్‌జీ అండ్ అసోసియేట్స్ సీనియర్ భాగస్వామి రజత్ మోహన్ చెప్పారు. ఎన్నికల బాండ్ల పథకాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసిన సమయంలో కొన్ని అంశాలను లేవనెత్తిందని, వాటిని వ్యవస్థీకృత చర్చలు, నిపుణులతో సంప్రదింపుల ద్వారా పరిష్కరించవచ్చునని ఆయన సూచించారు. అయితే సవరించిన రాజకీయ విరాళాల వ్యవస్థను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం తనకున్న శాసనాధికారాన్ని అట్టే పెట్టుకున్నదని అన్నారు. కొత్త బిల్లులో ఎన్నికల బాండ్ల ప్రస్తావన తేవడం వ్యూహాత్మక నిర్ణయం కావచ్చునని, దీని ద్వారా భవిష్యత్తులో ఎన్నికల నిధులకు సంబంధించిన సంస్కరణలకు అవకాశం కలుగుతుందని చెప్పారు.

శార్దూల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కంపెనీ భాగస్వామి రోహిత్ గార్గ్ మాట్లాడుతూ కొత్త ఆదాయపన్ను బిల్లులో చేసిన మార్పులు స్వభావరీత్యా కేవలం నిర్మాణ సంబంధమైనవేనని అన్నారు. నిబంధనలు, సెక్షన్లలో ప్రధాన మార్పులేవీ లేవని చెప్పారు. 'ఎన్నికల బాండ్ల జారీని నిలిపివేయాలని ఎస్‌బీఐకి సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ఆ తీర్పును ప్రతిబింబించేలా సంబంధిత చట్టాల్లో సవరణలు చేయాల్సి ఉంటుంది. భవిష్యత్తులో ఎన్నికల బాండ్లు జారీ చేయాల్సి వచ్చినా వాటిని డిడక్షన్‌గా అనుమతిస్తారు. ఏదేమైనా దాతల వివరాలకు బహిర్గతం చేసే అంశాన్ని సంబంధిత చట్టాల కిందే పరిష్కరించాల్సి ఉంటుంది' అని అన్నారు.

2018లో ఎన్నికల బాండ్ల పథకం ప్రారంభమైంది. అప్పటి నుండి ఎస్‌బీఐ ఎనిమిది దఫాలుగా రూ.16,518 కోట్ల విలువైన బాండ్లు జారీ చేసింది. ఎనిమిదో షెడ్యూల్ ప్రకారం ఏ రాజకీయ పార్టీ అయినా తాను పొందిన స్వచ్ఛంద విరాళాలపై పన్ను మినహాయింపు కోరాలంటే ఆరు షరతులు పాటించాల్సి ఉంటుంది. అందులో ఒక షరతు ప్రకారం...రాజకీయ పార్టీ రెండు వేల రూపాయల కంటే ఎక్కువ విరాళం పొందకూడదు. అయితే అకౌంట్ పేఈ చెక్కు, అకౌంట్ పేఈబ్యాంక్ డ్రాఫ్ట్, ఎలక్ట్రానిక్ క్లియరింగ్ సిస్టమ్ లేదా ఇతర ఎలక్ట్రానిక్ పద్ధతి ద్వారా అంతకు మించిన మొత్తంలో విరాళం తీసుకోవచ్చు.

బీజేపీ ఆదాయం రూ.4,340 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

ఆదాయం 83.85 శాతం మేర పెరిగిందని ఏడీఆర్ నివేదిక పేర్కొంది. ఇక కాంగ్రెస్ 1225.11 కోట్లతో కాంగ్రెస్ పార్టీ రెండోస్థానంలో నిలిచింది. అయితే అంతకు ముందు ఏడాదితో పోల్చితే.. కాంగ్రెస్‌కి అధిక మొత్తంలోనే విరాళాలు వచ్చాయి. ఈ పార్టీ విరాళాలు సేకరించడంలో 170.82 శాతం మేర పెరుగుదల ఉందని ఈ నివేదిక తెలిపింది. ఇక బీఎస్పీ 22.68 కోట్లు, ఆప్ 22.44 లక్షల విరాళాలతో వరుస స్థానాల్లో నిలిచాయి.

కాగా, విరాళాల రూపంలో వచ్చిన ఆదాయంలో పార్టీలు 50 శాతం మేరకే ఖర్చు చేశాయని ఏడీఆర్ నివేదిక తెలిపింది. బీజేపీ తన ఆదాయంలో రూ.2,211.69 కోట్లు (50.96 శాతం) వ్యయం చేయగా.. కాంగ్రెస్ పార్టీ రూ.1025.24 కోట్లు (83.69 శాతం) ఖర్చు చేసినట్టు ఏడీఆర్ తెలిపింది. బీఎస్పీ రూ.43.18 కోట్లు (66.67 శాతం) ఖర్చు చేశాయి. ఆప్ రూ.34.09 కోట్లు ఖర్చు చేసింది. జాతీయ పార్టీలకు ఎలక్టోరల్ బాండ్ల రూపంలోనే ఎక్కువ ఆదాయం సమకూరినట్టు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

ఆ మేరకు భూభారతి విధివిధానాలు : కలెక్టర్లతో వర్క్ షాప్‌లో మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేలా భూ భారతి విధివిధానాలను రూపొందించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. దేశానికి ఆదర్శంగా ఉండేలా భూ భారతి ఆర్వోఆర్ 2025 చట్టాన్ని తీసుకువచ్చామనీ, అదే స్ఫూర్తితో ఈ చట్టానికి సంబంధించిన విధివిధానాలుంటాయని ఆయన చెప్పారు. ఇదే అంశంపై మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్క్‌షాప్‌లో పొంగులేటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజాస్వామ్యయుతంగా అసెంబ్లీలో డ్రాఫ్ట్ బిల్లుపెట్టి ఆ తర్వాత మేధావులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సలహాలు సూచనలు తీసుకున్నా మన్నారు. రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా మెరుగైన, సమగ్ర రెవెన్యూ సేవలను సత్వరమే అందిం చాలన్న ఆశయంతో, విస్తృత స్థాయిలో అభిప్రాయాలను సేకరించి భూభారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఆ చట్టం రూపకల్పనకు ఎంత కష్టపడ్డామో దానికి సంబంధించిన విధివిధానాలను తయారు చేయటానికి అదే స్థాయిలో కసరత్తు చేయాలని అధికారులకు సూచించారు. "ఎలాంటి విధి విధానాలు తయారు చేయకుండానే 2020 ఆర్వోఆర్ చట్టాన్ని ఆనాటి ప్రభుత్వం అమలులోకి తీసుకురావడంతో ఎదురైన ప్రతికూల పరిస్థితులు మన కండ్లముందే కనిపిస్తున్నాయి. ఆనాటి పాలకులు గొప్పగా చెప్పుకున్న ధరణిలో అన్ని లొసుగులు, లోపాలే. నిబంధనల రూపకల్పన లేకుండానే అమలులోకి తీసుకువచ్చిన 2020 ఆర్ఓఆర్ చట్టం వల్లే లక్షలాది మంది రైతులు రోడ్డున పడ్డారు. చట్టం తీసుకొచ్చి మూడేండ్లు గడిచినా ఆనాటి ప్రభుత్వం విధివిధానాలను రూపొందించలేదు. మేం మాత్రం సచివాలయంలో కూర్చొని రూల్స్ ఫ్రేమ్ చేయకుండా, విస్తృత స్థాయిలో అధికారులు, మేధావులు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకుని అందరి అభిప్రాయాలను క్రోడీకరించి పకడ్బందీగా భూ భారతి విధివిధానాలు తయారు చేస్తున్నాం. వీలైనంత త్వరగా వాటిని అమల్లోకి తెస్తాం. కొత్త సమస్యలు రాకుండా ఉన్న సమస్యలు పరిష్కారమయ్యేలా రైతులకు ప్రయోజనం కలిగేలా, అధికారులు తప్పుచేయడానికి ఆస్కారం లేకుండా విధివిధానాలను రూపొందిస్తున్నాం. తెలంగాణలో నూతన రెవెన్యూ చట్టం (భూభారతి) భూ పరిపాలనలో పెను మార్పులను తీసుకురాబోతుంది. భూ హక్కులను రక్షించడం, భూ వ్యవహారాలలో పారదర్శకత తీసుకురావడం భూ లావాదేవీలను సులభతరం చేయడం, సామాన్యులకు సైతం రెవెన్యూ సేవలను అందుబాటులోకి తీసుకురావడం ఇది ప్రధాన లక్ష్యం. ఈ చట్టం తరతరాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతుంది. భవిష్యత్తులో మరింత మెరుగైన విధానాలు, సాంకేతికతను ఉపయోగించుకుని భూ పరిపాలనను మరింత సమర్థవంతంగా కొనసాగిస్తాం. ఈ నూతన చట్టం ద్వారా భూ యాజమాన్య హక్కులనే గాకుండా వారి జీవితాలకు ఆత్మగౌరవాన్ని ఆర్థిక స్వతంత్ర్యాన్ని తీసుకువస్తుంది" అని మంత్రి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, సీసీఎల్ఏ పీడీ సీఎంఆర్ఓ మకరంద్, భూ చట్ట నిపుణులు భూమి సునిల్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్గిరి, వికారాబాద్, నాగర్ కర్నూల్ జిల్లాల కలెక్టర్లు వివిధ జిల్లాల ఆర్‌డిఓలు, తహసీల్దార్లు, రిటైర్డ్ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రంపై ఫికర్ లేదు

నవతెలంగాణ-ఆమనగల్



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రియల్ ఎస్టేట్‌పై ఉన్న ఫికర్ రాష్ట్రంపై లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో పది శాతం మంది రైతులకు కూడా రైతు భరోసా రాలేదన్నారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా ఆమనగల్ పట్టణం మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధ్యక్షతన రైతు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీ పేరుతో సీఎం రేవంత్‌రెడ్డి డ్రామాలు ఆడుతూ.. అత్తగారి ఊరిలో ఉన్న వెయ్యి ఎకరాల భూముల ధరలను పెంచేందుకు డబుల్ రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల ముందే వెల్దండ మండలంలో తమ కుటుంబ సభ్యులకు ఉన్న 500 ఎకరాల భూమికి తోడు ఇటీవల మరో 500 ఎకరాల భూమిని సీఎం, ఆయన సోదరులు దొబ్బేసినట్టు చెప్పారు. రైతు రుణమాఫీ కాక రైతులు, పెండింగ్ బిల్లులు అందక మాజీ సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెండ్లి కానుక తులం బంగారం, ఆడపిల్లలకు స్కూటీలు ఎప్పుడు ఇస్తారో రేవంత్‌రెడ్డిని ప్రజలు ప్రశ్నించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు అడగడానికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని సూచించారు. పిట్ట కథ చెబుతూ.. 'తాగుడుకు బానిసై తల్లిదండ్రులను చంపిన వ్యక్తి కోర్టులో న్యాయవాది ముందు నేను అమ్మానాన్న లేని అనాథను.. నన్ను క్షమించండి సార్' అన్నట్టుగా సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే ఎన్నికల్లో ఇక్కడ నుంచే ఆయన పతనం ప్రారంభం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మెన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్‌రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మెన్ ఉప్పల వెంకటేష్ పాల్గొన్నారు.

హైకోర్టు హాల్లోనే కుప్పకూలిన లాయర్

నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్ర హైకోర్టులో విషాద ఘటన జరిగింది. కేసు వాదిస్తూ ఓ సీనియర్ న్యాయవాది గుండెపోటుతో మరణించారు. వివరాల్లోకి వెళితే.. న్యాయవాది పసునూరు వేణుగోపాలరావు మంగళవారం హైకోర్టులో ఓ కేసుకు సంబంధించి న్యాయమూర్తి ముందు వాదనలు వినిపిస్తున్నారు. ఈ క్రమంలో కోర్టు హాల్లోనే ఒక్కసారిగా కుప్పకూలారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను చనిపోయారని వైద్యులు వెల్లడించారు. లాయర్ మృతితో మిగతా కోర్టు హాళ్లలో రెగ్యులర్ పిటిషన్లను వాయిదా వేశారు.


ఇది ప్రజా వ్యతిరేక బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

ఆలోచించుకోవాల్సిన అవసరముందన్నారు.

నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు కె.రాజన్న, ఎస్ఎన్‌రెడ్డి మాట్లాడారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోతోందన్నారు. రైతన్నకి పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, రుణాలన్నింటినీ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

గంగ నీటిలో మల బ్యాక్టీరియా !



(మొదటిపేజీ తరువాయి)

పరీక్షించాం. బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్ (బీఓడీ)కు కావాల్సిన ప్రమాణాలు నీటిలో లేవు. అంతేకాదు...స్నానం చేసే నీరు నాణ్యమైనదిగా ఉండాలి. అయితే అనేక పర్యాయాలు పరీక్షించినప్పటికీ అది మల బ్యాక్టీరియా ప్రమాణాలకూ అనుగుణంగా లేదు. మహా కుంభమేళాలో...ముఖ్యంగా పవిత్ర దినాలలో ప్రజలు భారీగా గంగలో స్నానం చేస్తున్నారు. మల బ్యాక్టీరియా పెరగడానికి, కాలుష్యానికి ఇది కారణమవుతోంది" అని నివేదిక వివరించింది.

ఈ నివేదికను కోల్‌కత్తా హైకోర్ట్ మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రకాష్ శ్రీవాత్సవ నేతృత్వంలోని ట్రిబ్యునల్ పరిశీలించింది. బుధవారం వర్చువల్‌గా తన ఎదుట హాజరు కావాలని యూపీ కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులను ఆదేశించింది.

జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా టీకేకే రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్టీయూ) హైదరాబాద్ ఉపకులపతి (వీసీ)గా ప్రొఫెసర్ టి కిషన్‌కుమార్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఇటీవల జేఎన్టీయూ హైదరాబాద్ వీసీ కోసం సెర్చ్ కమిటీ సమావేశమైన విషయం తెలిసిందే. ముగ్గురు ప్రొఫెసర్ల జాబితాను ప్రభుత్వానికి పంపించింది. వాటిని పరిశీలించి గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపించింది. ప్రభుత్వ ప్రతిప్రాదనలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పరిశీలించి టి కిషన్‌కుమార్‌రెడ్డిని జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా ఆమోదించారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన మూడేండ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారని తెలిపారు. మంగళవారమే ఆయన జేఎన్టీయూ హైదరాబాద్ వీసీగా బాధ్యతలను స్వీకరించారు. ఆయనకు ఉన్నత విద్యామండలి చైర్మెన్, జేఎన్టీయూ హైదరాబాద్ ఇన్‌చార్జీ వీసీ వి బాలకిష్టారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావుతో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ ఏకసభ్య కమిషన్ కాలపరిమితి పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

చేసిన ఈ కమిషన్ నవంబరు 11న బాధ్యతలు చేపట్టింది. సమగ్ర అధ్యయనం చేసి 60 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆ కమిషన్‌ను కోరింది. జనవరి 10న అరవై రోజుల గడువు ముగియడం తో జనవరి 11 నుంచి ఫిబ్రవరి 10 వరకు పొడిగించారు. అనంతరం కమిషన్ ఇటీవలే నివేదిక సమర్పించింది. అయితే ఎస్సీ వర్గీకరణకు చట్టరూపం రావాల్సి ఉండటంతోపాటు, పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పునఃపరిశీలించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో కమిషన్ కాలపరిమితిని మార్చి 10 వరకు మరో సారి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



ప్రపంచ క్రికెట్ ఐసీసీ ఈవెంట్లతో కళకళలాడుతోంది. ఇటీవల 2023 వన్డే వరల్డ్‌కప్, 2024 టీ20 ప్రపంచకప్‌లు అభిమానులను అలరించగా.. ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ దూసుకొచ్చింది. ఏడేండ్ల విరామం తర్వాత జరుగుతున్న ఈ మెగా టోర్నమెంట్‌కు డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్ ఆతిథ్యం అందిస్తుండగా.. రన్నరప్ టీమ్ ఇండియా తన మ్యాచులను దుబాయ్‌లో ఆడేందుకు రంగం సిద్ధం చేసుకుంది. ప్రపంచ టాప్-8 జట్లు పోటీపడుతున్న ఈ సమరంలో టైటిల్ కోసం చాంపియన్లు తలపడుతున్నాయి. పాకిస్థాన్, న్యూజిలాండ్ ఆరంభ మ్యాచ్‌తో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నేటి నుంచి షురూ కానుంది.

చాంపియన్ల వేట

- నేటి నుంచి చాంపియన్స్ ట్రోఫీ
- ఆరంభ మ్యాచ్‌లో పాక్, కివీస్ ఢీ

నవతెలంగాణ-కరాచి

ఎనిమిది మేటి జట్లు

ఓ ఐసీసీ టోర్నమెంట్ ముంగిట అగ్ర జట్లు ఆ ఫార్మాట్‌కు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వకపోవటం బహుశా ఇదే ప్రథమం. చాంపియన్స్ ట్రోఫీ వన్డే ఫార్మాట్‌లో జరుగుతుండగా.. భారత్, ఇంగ్లాండ్ సహా పలు దేశాలు టీ20 ఫార్మాట్‌లోనే ఎక్కువగా మ్యాచులు ఆడాయి. 50 ఓవర్ల ఆటకు ఆశించిన ప్రాధాన్యత దక్కలేదు. అయినా, చాంపియన్స్ ట్రోఫీ వేటలో సమర శంఖం పూరించేందుకు మేటి ఎనిమిది జట్లు సిద్ధమయ్యాయి. గత ప్రపంచకప్‌లో టాప్-8లో నిలిచిన జట్లు మాత్రమే అర్హత సాధించటంతో శ్రీలంక, వెస్టిండీస్ వంటి జట్లు ఈ టోర్నీకి దూరం అయ్యాయి. 2017 చాంపియన్స్ ట్రోఫీ ఫైనలిస్టులు భారత్, పాకిస్థాన్ సహా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్, దక్షిణాఫ్రికా, అఫ్గనిస్థాన్‌లు తాజా టోర్నీలో పోటీపడుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశ, నాకౌట్ దశలో సాగనుంది. ఎనిమిది జట్లను తొలుత రెండు గ్రూప్‌లుగా విభజించారు. భారత్, పాకిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్‌లు గ్రూప్-ఏలో ఉన్నాయి. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్, అఫ్గనిస్థాన్‌లు గ్రూప్-బిలో ఉన్నాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు ఇతర మూడు జట్లతో ఓసారి తలపడుతుంది. టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి.

పాకిస్థాన్‌కు సవాల్

పాకిస్థాన్‌లో పండుగ వాతావరణం మొదలైంది. 1996 ఐసీసీ ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇచ్చిన తర్వాత పాక్‌లో మళ్లీ ఓ ఐసీసీ టోర్నమెంట్ నిర్వహించటం ఇదే ప్రథమం. దశాబ్ద కాలం పాటు స్వదేశంలో ద్వైపాక్షిక క్రికెట్‌కు దూరమైన పాకిస్థాన్ 29 ఏండ్ల నిరీక్షణ తర్వాత మెగా టోర్నమెంట్‌కు వేదికగా నిలిచింది. 1996 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్, 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ఓ ఆసక్తికర సంబంధం ఉంది. 1992 ప్రపంచకప్ విజేతగా నిలిచిన పాకిస్థాన్.. డిఫెండింగ్ చాంపియన్‌గా వరల్డ్‌కప్‌కు ఆతిథ్యం ఇవ్వగా.. తాజాగా 2017లో చాంపియన్స్ ట్రోఫీ సాధించిన పాకిస్థాన్ మరోసారి డిఫెండింగ్ చాంపియన్ హోదాలో మెగా ఈవెంట్‌కు వేదికైంది. భద్రత ఏర్పాట్లు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కఠిన సవాల్. ప్రణాళిక ప్రకారంగా మూడు స్టేడియాల్లోనే టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. రావల్పిండి, కరాచి, లాహోర్‌లో స్టేడియాలను ఆధునీకరించారు. క్రికెట్‌ను పాకిస్థాన్‌లో విపరీతంగా అభిమానిస్తారు. మూడు దశాబ్దాల తర్వాత ప్రపంచ క్రికెట్ పాక్ గడ్డపై రావటంతో అభిమానుల్లో హంగామా మొదలైంది. పొరుగు దేశం, దాయాది భారత్ తన మ్యాచులు దుబాయ్‌లో ఆడటం పాకిస్థాన్‌కు నిరాశే మిగిల్చింది.

కొత్త చాంపియన్‌ను చూస్తామా?

ఐసీసీ ఈవెంట్లలో కొత్త చాంపియన్ అనగానే తొలుత వినిపించే మాట దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్. ప్రపంచకప్‌లలో దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్‌కు దారుణ రికార్డుంది. కానీ చాంపియన్స్ ట్రోఫీలో ఈ రెండు జట్లు మాజీ చాంపియన్లు. 1998 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో వెస్టిండీస్‌పై దక్షిణాఫ్రికా 4 వికెట్ల తేడాతో గెలుపొందింది. 2000 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో భారత్‌పై న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో పైచేయి సాధించింది. 1998లో బంగ్లాదేశ్, 2000లో కెన్యా చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం అందించాయి. పాకిస్థాన్ (2017), ఆస్ట్రేలియా (2006, 2009), భారత్ (2002, 2013) చాంపియన్స్ ట్రోఫీ సాధించిన జట్లు. మాజీ చాంపియన్లు శ్రీలంక (2002), వెస్టిండీస్ (2004)లు 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించలేదు.

మూడో టైటిల్ వేటలో భారత్

ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో టీమ్ ఇండియా మంచి రికార్డుంది. 2017 చాంపియన్స్ ట్రోఫీలోనూ టీమ్ ఇండియా టైటిల్ ఫేవరేట్. కానీ ఫైనల్లో పాకిస్థాన్ అనూహ్యంగా రాణించింది. అప్పటివరకు సూపర్‌గా ఆడిన కోహ్లిసేన టైటిల్‌కు అడుగు దూరంలోనే నిలిచింది. 2000 చాంపియన్స్ ట్రోఫీలోనూ భారత్ పరాజయం పాలైంది. టైటిల్ పోరులో న్యూజిలాండ్‌కు తలొగ్గింది. 2013 చాంపియన్స్ ట్రోఫీని టీమ్ ఇండియా ధోని సారథ్యంలో దక్కించుకుంది. 2002 చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌కు వరుసగా రెండు రోజులు వర్షం అంతరాయం కలిగించటంతో శ్రీలంకతో కలిసి భారత్ టైటిల్‌ను పంచుకుంది.

ముందే ముగిసిన ఆరంభ వేడుకలు

ఐసీసీ టోర్నమెంట్లకు ఆరంభ వేడుకలు ప్రత్యేకంగా నిలుస్తాయి. చాంపియన్స్ ట్రోఫీకి ఆతిథ్యం ఇస్తోన్న పాకిస్థాన్ టోర్నమెంట్ ఆరంభానికి మూడు రోజులు ముందే ఓపెనింగ్ సెర్మొనీ చేసేసింది. లాహోర్‌లోని గడాఫీ స్టేడియాన్ని అట్టహాసంగా ఆరంభించిన పీసీబీ.. లాహోర్ కోట వద్ద ఆరంభ వేడుకలు చేసింది. 2017 చాంపియన్స్ ట్రోఫీ గెలుపు గుర్రాలు ఆరంభ వేడుకలకు హాజరయ్యారు. ఐసీసీ ఈవెంట్లకు సహజంగా కనిపించే మరో సంప్రదాయం సైతం ఈసారి కనుమరుగైంది. టోర్నీలో పోటీపడుతున్న అన్ని జట్ల కెప్టెన్లు ట్రోఫీతో గ్రూప్ ఫోటో దిగుతారు. కెప్టెన్లు అందరూ మీడియా ముందుకొచ్చి మాట్లాడతారు. కానీ 2025 చాంపియన్స్ ట్రోఫీకి ఈ కార్యక్రమాలు ఏమీ షెడ్యూల్ చేయలేదు.

ముంబయి విలవిల

తొలి ఇన్నింగ్స్‌లో 188/7

నాగ్‌పూర్ : విదర్భతో రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో 41 సార్లు చాంపియన్ ముంబయి ఎదురీదుతోంది. లెఫ్టార్మ్ స్పిన్నర్ పార్థ్ రాజేశ్ (3/16) ఒకే ఓవర్లో మూడు వికెట్ల మాయజాలం చేయటంతో 113/2తో పటిష్టంగా సాగిన ముంబయి ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. ఐదు పరుగుల వ్యవధిలోనే నాలుగు వికెట్లు కోల్పోయి 118/6తో విలవిల్లాడింది. ఓపెనర్ ఆకాశ్ ఆనంద్ (67 నాటౌట్, 171 బంతుల్లో 6 ఫోర్లు) అజేయ అర్ధ సెంచరీతో ఆదుకున్నాడు. సిద్దేశ్ లాడ్ (35), ఆయుశ్ (9) నిరాశపరిచారు. అజింక్య రహానె (18), సూర్యకుమార్ యాదవ్ (0), శివం దూబె (0)లు రాజేశ్ ఓవర్లో మాయకు చిత్తయ్యారు. శామ్స్ ములాని (4) విఫలమవగా.. శార్దుల్ ఠాకూర్ (37) వేగంగా పరుగులు రాబట్టాడు. ఆకాశ్ ఆనంద్‌తో కలిసి తనుశ్ కొటియన్ (5 నాటౌట్) అజేయంగా క్రీజులో నిలిచాడు. రెండో రోజు ఆట ముగిసేసరికి ముంబయి తొలి ఇన్నింగ్స్‌లో 59 ఓవర్లలో 188/7 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో 195 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది. అంతకుముందు విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 107.5 ఓవర్లలో 383 పరుగులకు ఆలౌటైంది. శివం దూబె (5/49) ఐదు వికెట్ల ప్రదర్శనతో మెరిశాడు.



అజహరుద్దీన్ సెంచరీ

కేరళ, గుజరాత్ రంజీ సెమీస్

అహ్మదాబాద్ : మందకోడిగా సాగుతున్న కేరళ, గుజరాత్ రంజీ ట్రోఫీ సెమీఫైనల్లో మహ్మద్ అజహరుద్దీన్ (149 నాటౌట్, 303 బంతుల్లో 17 ఫోర్లు) అజేయ సెంచరీతో చెలరేగాడు. రెండు రోజుల ఆటలో 177 ఓవర్లు వేసినా గుజరాత్ బౌలర్లు కేరళను ఆలౌట్ చేయలేదు. కేరళ తొలి ఇన్నింగ్స్‌లో 418/7 పరుగులు చేసింది. అజహరుద్దీన్‌కి తోడు సల్మాన్ నిజార్ (52, 202 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), సచిన్ బేబి (69, 195 బంతుల్లో 8 ఫోర్లు) అర్ధ సెంచరీలతో రాణించారు. గుజరాత్ బౌలర్లలో అర్జాన్ (3/64) మూడు వికెట్లు పడగొట్టగా.. రవి బిష్ణోయ్ (1/74), విశాల్ (1/57), జడేజా (1/58) తలా ఓ వికెట్ పడగొట్టారు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆదిత్య (10 నాటౌట్)తో కలిసి అజహరుద్దీన్ అజేయంగా ఆడుతున్నాడు.



ఇక కూర్పు తలనొప్పి!

దుబాయ్ : దుబాయ్‌లో వరుసగా మూడు రోజులుగా కఠోర సాధన చేస్తున్న టీమ్ ఇండియా బుధవారం తొలి సవాల్‌కు సిద్ధమవుతోంది. దుబాయ్ స్టేడియంలో బంగ్లాదేశ్‌తో భారత్ తొలి మ్యాచ్‌లో ఆడనుంది. బ్యాటింగ్ లైనప్‌లో యశస్వి జైస్వాల్‌ను తప్పించటంతో సెలక్షన్ తిప్పలు తప్పాయి. బ్యాటింగ్ ఆర్డర్‌లో వికెట్ కీపర్ కెఎల్ రాహుల్, రిషబ్ పంత్ మాత్రమే తుది జట్టులో చోటు కోసం పోటీపడుతున్నారు. రోహిత్, గిల్, కోహ్లి, శ్రేయస్ సహా హార్దిక్, జడేజా, అక్షర్‌లకు తుది జట్టులో చోటు ఖాయం. పేసర్లలో మహ్మద్ షమి, అర్షదీప్ సింగ్, హర్షిత్ రానాలో ఒకరు బెంచ్‌కు పరిమితం కానున్నారు. స్పిన్ విభాగంలో వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్ నడుమ గట్టి పోటీ నెలకొంది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌లో వరుణ్‌కు అవకాశం దక్కినా.. చైనామన్ కుల్దీప్‌కు దుబాయ్‌లో చాన్స్ ఇస్తారనే అంచనాలు ఉన్నాయి. కుల్దీప్, వరుణ్‌లు ఇద్దరూ మ్యాచ్‌ను మలుపుతిప్పగల మాయగాళ్లు కావటంతో రోహిత్, గంభీర్‌కు సెలక్షన్ కఠిన సవాలే.



'దిల్ రూబా' హోలీ కానుకగా రిలీజ్



కిరణ్ అబ్బవరం, రుక్సర్ ధిల్లాన్

హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న కొత్త సినిమా 'దిల్ రూబా'. రుక్సర్ ధిల్లాన్ హీరోయిన్. శివమ్ సెల్యులాయిడ్స్, మ్యూజిక్ లేబుల్ సారెగమ తమ నిర్మాణ సంస్థ అయినటువంటి ఏ యూడ్లీ ఫిలిం సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. రవి, జోజో జోస్, రాకేష్ రెడ్డి, సారెగమ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. విశ్వ కరుణ్ దర్శకుడు. ఈ సినిమా మార్చి 14న హోలీ పండుగ సందర్భంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం రామానాయుడు స్టూడియోలో జరిగిన ఈవెంట్‌లో ఈ చిత్రంలోని సెకండ్ సింగిల్ 'హే జింగిలి..'ని రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ రవి మాట్లాడుతూ, 'సినిమాను అందరికీ నచ్చేలా చేసిన మా టీమ్‌కు థ్యాంక్స్' అని అన్నారు.

"హే జింగిలి' పాటను మీరంతా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాం. ఈ పాటలో కిరణ్, రుక్సర్ పెయిర్ చాలా బాగుంది. ఫస్ట్ టైమ్ లవ్‌లో పడిన అబ్బాయి కింగ్‌లా ఫీలవుతాడు. ఆ లవ్ ఫెయిలై సెకండ్ టైమ్ లవ్‌లో పడినప్పుడు అతనిలో ఒక భయం మొదలవుతుంది. ఇలాంటి ఒక ఎక్స్‌ప్రెషన్ చెప్పగానే భాస్కరభట్ల సూపర్బ్ లిరిక్స్ ఇచ్చారు. సామ్ సీఎస్ సూపర్ హిట్ ట్యూన్ ఇచ్చారు. గంటలో ఈ పాట రెడీ అయ్యింది. ఈ సాంగ్‌కు మంచి పేరొస్తుంది' అని డైరెక్టర్ విశ్వ కరుణ్ చెప్పారు.

హీరోయిన్ రుక్సర్ థిల్లాన్ మాట్లాడుతూ, 'ఈ మూవీ ప్యూర్ లవ్ ఎమోషన్, ఫీలింగ్‌తో ఉంటుంది. నా క్యారెక్టర్ ద్వారా ఫుల్ లవ్ అండ్ ఎమోషన్ చూపించాను' అని తెలిపారు.

ఈ మూవీ చేసినందుకు చాలా గర్వంగా, హ్యాపీగా ఫీలవుతున్నాను. ఇంటెన్స్ మ్యూజికల్ లవ్ స్టోరీగా మీ అందరినీ ఆకట్టుకుంటుంది. సారెగమ వాళ్లు ఫస్ట్ టైమ్ ఈ మూవీతో టాలీవుడ్‌లోకి వస్తున్నారు. ప్రొడ్యూసర్ రవి, డైరెక్టర్ విశ్వ కరుణ్ మూడేళ్లుగా ఈ ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డారు. హోలీ మంచి డేట్ అని సినిమాని రిలీజ్ చేస్తున్నాం. నా సినిమాలన్నింటిలో కంటే ఇందులో ఇంటెన్స్ క్యారెక్టర్ చేశాను. నా క్యారెక్టర్‌లాగే యాక్షన్ ఎపిసోడ్స్ ఇంటెన్స్‌గా ఉంటాయి. యాక్షన్ ఎపిసోడ్స్ స్క్రీన్ మీద కొత్తగా ఉండి ఎంజాయ్ చేస్తారు.

- హీరో కిరణ్ అబ్బవరం

ఆ జర్నలిస్టులు ఏం చేశారు?



మిమో చక్రవర్తి, సశా చెత్రి

బాలీవుడ్ నటుడు, సీనియర్ హీరో మిథున్ చక్రవర్తి తనయుడు మిమో చక్రవర్తి, ఎయిర్ టెల్ ఫేం సశా చెత్రి ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'నేనెక్కడున్నా'. కేబీఆర్ సమర్పణలో మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ సినిమాతో మాధవ్ కోదాడ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈనెల 28న ఈ సినిమాను విడుదల చేయనున్నారు.

ఈ సందర్భంగా ప్రజా నాయకుడు, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ చేతుల మీదుగా ఈచిత్ర ట్రైలర్ విడుదలైంది. ట్రైలర్ విడుదల అనంతరం ఆయన మాట్లాడుతూ, 'జర్నలిజం విలువలు, మహిళా సాధికారతపై తీసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి. దర్శకుడు మాధవ్ కోదాడ, నిర్మాతలు కె.బి.ఆర్, మారుతి శ్యామ్ ప్రసాద్ రెడ్డికి నా శుభాకాంక్షలు' అని అన్నారు.

ఈ సినిమాలో ఆనంద్ పాత్రలో మిమో చక్రవర్తి, ఝాన్సీగా సశా చెత్రి నటించారు. వాళ్లిద్దరూ జర్నలిస్ట్ రోల్స్ చేశారు. జీతం కోసం కాకుండా జనాల జీవితాల కోసం పాత్రికేయ రంగాన్ని ఎంచుకున్న ఆనంద్, ఝాన్సీ చేసిన కొన్ని స్టింగ్ ఆపరేషన్స్ వల్ల అవినీతిపరుల భాగోతాలు బయట పడతాయి. ఆ తర్వాత ఏమైంది? ఎన్ని ప్రమాదాలు ఎదుర్కొన్నారు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి అని చిత్రయూనిట్ తెలిపింది.

మురళీ శర్మ మహేష్ మంజ్రేకర్, ప్రదీప్ రావత్, షాయాజీ షిండే, అభిమన్యు సింగ్, రాహుల్ దేవ్, బ్రహ్మానందం, తనికెళ్ళ భరణి, పోసాని కృష్ణమురళి, సీవీఎల్ నరసింహారావు, రవి కాలే, భాను చందర్, రమణ చల్కపల్లి, మిలింద్ గునాజి, మిహిర, ఉత్తర, అర్చన గౌతం తదితరులు నటించిన ఈ సినిమాకు డాన్స్: ప్రేమ్ రక్షిత్, లిరిక్స్ : సుద్దాల అశోక్ తేజ, సంగీతం : శేఖర్ చంద్ర , ఫోటోగ్రఫీ : జయపాల్ నిమ్మల, ఎడిటింగ్: ఫిల్మీ గ్యాంగ్ స్టర్స్, బ్యాక్ గ్రౌండ్ మ్యూజిక్: రాజేష్, సమర్పణ: కె.బి.ఆర్, నిర్మాత: మారుతి శ్యాం ప్రసాద్ రెడ్డి, స్టోరీ - స్క్రీన్ ప్లే - డైలాగ్స్ - డైరెక్షన్: మాధవ్ కోదాడ.

నవచిత్రం

మ్యూజికల్ డ్రామాగా 'మ్యాజిక్'



ఒక వైపు భారీ సినిమాలను రూపొందిస్తూనే, మరోవైపు యువ ప్రతిభను ప్రోత్సహిస్తూ వైవిధ్యభరిత చిత్రాలను అందిస్తూ, ఘన విజయాలను సొంతం చేసుకుంటోంది సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ.

'జెర్సీ' వంటి క్లాసిక్ చిత్రాన్ని అందించిన గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో 'మ్యాజిక్' అనే సినిమాను ప్రస్తుతం సితార సంస్థ నిర్మిస్తోంది. ఈ మ్యూజికల్ డ్రామాలో పలువురు యువ నటీనటులు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ స్వరకర్తగా వ్యవహరిస్తున్నారు. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఇటీవల ఈ చిత్రం నుంచి 'డోంట్ నో వై' అనే మొదటి గీతాన్ని విడుదల చేశారు. ప్రేమికుల దినోత్సవం కానుకగా అనిరుధ్ పాట విడుదలై ఆకట్టుకోవడం కొన్ని సంవత్సరాలుగా సాంప్రదాయంగా మారిపోయింది. ఇప్పుడు ఆ సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, 'డోంట్ నో వై' పాటతో మరోసారి కట్టిపడేశారు అనిరుధ్. అనిరుధ్ రవిచందర్, ఐశ్వర్య సురేష్ కలిసి తెలుగు, తమిళ భాషల్లో ఈ గీతాన్ని ఆలపించారు. అనిరుధ్ తన సంగీతంతో మాత్రం కాకుండా, గాత్రంతోనూ పాటకు మరింత అందం తీసుకొచ్చారు. ఈ పాట ఒకసారి వినగానే మళ్ళీ మళ్ళీ వినాలి అనిపించేలా ఉంది. ఈ గీతానికి తెలుగులో కృష్ణకాంత్ సాహిత్యం అందించగా, తమిళంలో విఘ్నేష్ శివన్ సాహిత్యం అందించారు. వారి సాహిత్యం పాట విలువను మరింత పెంచింది. తమ కళాశాల ఫెస్ట్ కోసం సొంతంగా ఒక పాటను స్వరపరచడానికి నలుగురు యువకులు చేసే ప్రయత్నం చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ 'మ్యాజిక్' చిత్రంతో ప్రేక్షకులకు ఓ సరికొత్త అనుభూతిని ఇవ్వబోతున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు అని చిత్ర బృందం పేర్కొంది.

'మజాకా'కి సెన్సార్ సభ్యుల ప్రశంసలు



సందీప్ కిషన్, రీతువర్మ

సందీప్ కిషన్ నటించిన నూతన చిత్రం 'మజాకా'. త్రినాథ రావు నక్కిన దర్శకుడు. ఎకె ఎంటర్టైన్మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్‌ల కొలాబరేషన్‌లో రాజేష్ దండా నిర్మిస్తున్నారు. సహ నిర్మాత బాలాజీ గుత్తా. రీతు వర్మ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో రావు రమేష్, అన్షు కీలక పాత్రల్లో నటించారు.

తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. సెన్సార్ బోర్డ్ దీనికి యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చింది. సినిమా అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్ ఉంది. హెల్తీ కామెడీ, ఎంటర్టైన్మెంట్ చాలా బావుందని సెన్సార్ సభ్యులు మూవీ టీమ్‌కి వారి రెస్పాన్స్‌ని తెలియజేశారు.

మంగళవారం మేకర్స్ ఈ సినిమా నుంచి 'పగిలి' సాంగ్‌ని రిలీజ్ చేశారు. లియోన్ జేమ్స్ ఈ పాటని మాస్ డ్యాన్స్ నెంబర్‌గా కంపోజ్ చేశారు. మహాలింగం, సాహితీ చాగంటి, ప్రభ పవర్ ఫుల్ వోకల్స్, కాసర్ల శ్యామ్, ప్రసన్న కుమార్ బెజవాడ అందించిన లిరిక్స్ మాస్‌ని మరింత ఎలివేట్ చేశాయి. ఈ సాంగ్‌లో సందీప్ కిషన్ ఎనర్జిటిక్ మాస్ డ్యాన్స్ మూమెంట్స్ అదిరిపోయాయి. సందీప్ కిషన్, రీతు వర్మ కెమిస్ట్రీ అద్భుతంగా ఉంది. మ్యాసీవ్ అండ్ వైబ్రెంట్ సెట్స్‌లో చిత్రీకరించిన ఈ సాంగ్‌లో విజువల్స్ కలర్‌ఫుల్‌గా ఉన్నాయి. శేఖర్ మాస్టర్ కొరియోగ్రఫీ గ్రేస్ ఫుల్‌గా ఉంది. ఈ పాట థియేటర్స్‌లో మాస్‌ని మెస్మరైజ్ చేయడం ఖాయం. ఇప్పటికే రిలీజైన టీజర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్మెంట్‌ని అందించి సినిమాపై అంచనాలని పెంచింది. ఫస్ట్ సింగిల్ 'బ్యాచులర్స్' ఆంథమ్, సెకండ్ సింగిల్ 'బేబీ' చార్ట్ బస్టర్ హిట్స్‌గా నిలిచాయి. త్రినాధ రావు నక్కినతో సక్సెస్ ఫుల్ ప్రాజెక్టులలో పని చేసిన రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ, ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే డైలాగ్స్ రాస్తున్నారు. మహా శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న ఈ సినిమా థియేటర్లలోకి రానుంది అని చిత్ర బృందం చెప్పింది.

ఈచిత్రానికి దర్శకత్వం: త్రినాధరావు నక్కిన, నిర్మాతలు: రాజేష్ దండా, కథ, స్క్రీన్ ప్లే, మాటలు: ప్రసన్న కుమార్ బెజవాడ, సహ నిర్మాత: బాలాజీ గుత్తా, లైన్ ప్రొడ్యూసర్: కిరణ్ పోపూరి, సంగీతం: లియోన్ జేమ్స్, డీవోపీ: నిజార్ షఫీ, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, స్టంట్స్: పృధ్వీ

స్ఫూర్తినిచ్చే 'దీక్ష'



ఆర్ కె ఫిలిమ్స్ పతాకంపై ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'దీక్ష'. కిరణ్, ఆలేఖ్యరెడ్డి హీరో, హీరోయిన్లు. ఆక్సాఖాన్, తులసి, అనూష ప్రధాన పాత్రలలో నటించారు. లవ్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని, రిలీజ్‌కు రెడీ అయింది.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాత డా.ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ,'ఒక వ్యక్తి దీక్ష, పట్టుదలతో పనిచేస్తే ఏదైనా సాధించవచ్చు అనే పాయింట్‌ను ఇతివృత్తంగా తీసుకుని, లవ్ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. చాలా అందమైన లొకేషన్స్‌తోపాటు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనూ చిత్రీకరణ పూర్తి చేశాం. పాటలు అద్భుతంగా వచ్చాయి. మా బ్యానర్‌కు మంచి పేరు తెచ్చే చిత్రం అవుతుంది. ఈ చిత్రంలో భీముడు పాత్రలో హీరో కిరణ్ అద్భుతంగా నటించారు. హీరో శ్రీహరిని గుర్తు చేసేలా తన నటన ఉంటుంది. ఆక్సాఖాన్ స్పెషల్ సాంగ్‌లో, తనదైన శైలిలో డాన్స్ ఆదరగొట్టింది. మా చిత్రానికి పని చేసిన సాంకేతిక నిపుణులు అందరూ ఎంతో దీక్షతో పనిచేసారు. సంగీత దర్శకుడు రాజ్ కిరణ్ అద్భుతమైన 5 పాటలు అందించారు. మధుప్రియ తదితర ప్రముఖ గాయనీ గాయకులు తమ స్వరాన్ని అందించారు. ఆర్ ఆర్ ఈ చిత్రానికి హైలైట్‌గా నిలుస్తుంది. ఈ చిత్రంలో 5 ఫైట్స్ ఉన్నాయి. ఇప్పటి వరకు 40 చిత్రాలు మా బ్యానర్‌లో నిర్మించాను. ఈ చిత్రం మా బ్యానర్‌కు సూపర్ హిట్ అందించే చిత్రం అవుతుంది. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో రిలీజ్ చెయ్యడానికి ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు. ఈ చిత్రానికి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ రిషి.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886